www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



మంగళవారం | 19-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 231 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: చవితి సా. 5.28 తదుపరి పంచమి; నక్షత్రం: ఆర్ద్ర మ. 2.56 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా.2.53-4.28, దుర్ముహూర్తం: ఉ.8.39-9.24, రా.9.48-10.38, అమృతఘడియలు: శే.ఉ.6.50, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.25, సూర్యాస్తమయం: 5.34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మహిళాశక్తికి వందనం
మహిళల ప్రగతికి అభివందనం





TELANGANA
RISING

మాజీ ప్రధాని "ఉక్కు మహిళ" మన
ప్రియతమ నాయకురాలు
శ్రీమతి ఇందిరా గాంధీ గారి
జయంతి ఉత్సవాలు

ప్రజా విజయోత్సవాలు
తేదీ:
19-11-2024, మధ్యాహ్నం 2.30 గంటలకు
వేదిక:
యూనివర్సిటీ ఆర్ట్స్ & సైన్స్ కాలేజీ మైదానం
సుబేదారి, వరంగల్.

మాట ఇచ్చాం. పూర్తి చేశాం.



మహాలక్ష్మి

ఉచిత బస్సు ప్రయాణం: అధికారం చేపట్టిన 48 గంటల్లోనే 2 గ్యారంటీల అమలుకు శ్రీకారం. నవంబర్ 17,2024 నాటికి 109.80 కోట్ల మంది మహాలక్ష్మి ప్రయాణికులకు రూ.3,710.22 కోట్లు ఆదా. రాష్ట్ర వ్యాప్తంగా 7,292 తెలంగాణ ఆర్టీసి బస్సుల్లో మహాలక్ష్మి అమలు.

రూ. 500కే గ్యాస్ సిలిండర్: 40 లక్షల మంది లబ్దిదారులతో మొదలై, ప్రస్తుతం 43 లక్షల మందికి లబ్ది. రీఫిల్ చేయించుకున్న 1,41,76,222 గ్యాస్ సిలిండర్ లకు రాయితీగా ప్రభుత్వం రూ.394.13 కోట్లు చెల్లించింది.

ఇందిరా మహిళాశక్తి

మార్చి 12,2024 న గౌ || ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా మహిళా శక్తి శుభారంభం,
1 లక్ష కోట్ల రుణాలు. ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం.
రాష్ట్రవ్యాప్తంగా మహిళా శక్తి క్యాంటీన్లు, మహిళా శక్తి సముదాయాలు ప్రారంభం.

గృహజ్యోతి

గృహజ్యోతి '0' బిల్లు: 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్. లబ్దిదారులు: 49,54,834 కుటుంబాలు. మార్చి 2024 నుండి నవంబర్ 2024 వరకు జారీచేయబడిన 3,64,57,380 జీరో బిల్లులకు రూ.1,336 కోట్లను ప్రభుత్వం భరించింది.

ఇందిరమ్మ ఇండ్లు

119 నియోజకవర్గాలలో అమలు. ప్రతి నియోజకవర్గంలో ఏడాదికి 3,500 ఇందిరమ్మ ఇళ్ళు పంపిణీ. 5 సం||ల్లో 20 లక్షల ఇళ్ళు కేటాయింపు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.22,500 కోట్ల వ్యయంతో 4,50,000 ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు.

ప్రజాపాలనలో ప్రథమ సంవత్సరం

జారీ చేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం



'ఏటీపీ' చాంప్ సినర్


టూరిన్ (ఇటలీ): ప్రపంచ టెన్నిస్ పురుషుల నెంబర్ వన్ జానిక్ సినర్ సొంతగడ్డపై అద్భుత ప్రదర్శన చేశాడు. ఈ సీజన్ ముగింపు టోర్నమెంట్, ప్రతిష్ఠాత్మక ఏటీపీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో సింగిల్స్ చాంపియన్‌గా నిలిచాడు. ఈ మెగా ట్రోఫీతో ఈ ఏడాదికి ఘనమైన ముగింపు పలికాడు. ఆదివారం రాత్రి జరిగిన సింగిల్స్ తుదిపోరులో టాప్ సీడ్ సినర్ 6-4, 6-4 స్కోరుతో అమెరికా స్టార్, ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్‌ను వరుస సెట్లలో ఓడించి ఈ మెగా ఈవెంట్‌లో తొలిసారి విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో 1986లో ఇవాన్ లెండిల్ (చెక్ రిపబ్లిక్) తర్వాత ఒక సెట్ కూడా కోల్పోకుండా ఏటీపీ టైటిల్ గెలిచిన తొలి ఆటగాడిగా 23 ఏళ్ల సినర్ రికార్డులకెక్కాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లను కూడా సినర్ దక్కించుకొన్న సంగతి తెలిసిందే. అంతేకాదు.. వరల్డ్ నెంబర్ వన్ ర్యాంక్ కూడా నిలబెట్టుకొని ఈ సీజన్‌కు గ్రాండ్‌గా వీడ్కోలు తీసుకున్నాడు.

మరో మూడు రోజుల్లో మొదలయ్యే ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌కు టీమిండియా సన్నద్ధమవుతోంది. ఐదు టెస్టుల్లో భాగంగా తొలి మ్యాచ్ ఈనెల 22 నుంచి పెర్త్‌లో జరగనుంది. ఈ క్రమంలో మొదటి టెస్ట్ సన్నాహకాల్లో భాగంగా అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ పూర్తిగా సద్వినియోగం చేసుకొనేందుకు యత్నిస్తోంది. అందుకోసం 'ఎ' జట్టుతో మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌ను కూడా రద్దు చేసుకొని తీవ్ర సాధనలో మునిగింది.

ఏ అవకాశమూ వదలకుండా..

పెర్త్ టెస్ట్‌కు టీమిండియా సన్నాహకాలు ముమ్మరం





సిరాజ్‌పై గురుతర బాధ్యత..

రోహిత్ శర్మ అందుబాటులో ఉండకపోవడంతో మొదటి టెస్ట్‌కు బుమ్రా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. దాంతో అతడు సారథ్య బాధ్యతలతోపాటు పేస్ బౌలింగ్ భారాన్ని కూడా మోయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో హైదరాబాదీ మహ్మద్ సిరాజ్ కీలకం కానున్నాడు. తన బౌలింగ్‌తో బుమ్రాకు అతడు అండగా నిలవాల్సి ఉంటుంది.. 2020-21 ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా జరిగిన మూడు టెస్ట్‌ల్లో సిరాజ్ 29.53 సగటుతో 13 వికెట్లు పడగొట్టాడు. ఆ సిరీస్‌లో అతడు అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు. ఇందులో ఒక ఐదు వికెట్ల ప్రదర్శన కూడా ఉండడం విశేషం. 'సిరాజ్ సూపర్ బౌలర్' అని మోర్నీ మోర్కెల్ ప్రశంసించాడు.

పెర్త్: న్యూజిలాండ్‌తో స్వదేశంలో టెస్ట్ సిరీస్‌లో ఘోరంగా ఓడడంతో..భారత జట్టు ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ అవకాశాలు ప్రమాదంలో పడ్డాయి. ఇప్పుడిక టీమిండియా ఫైనల్ అవకాశాలు బోర్డర్-గవాస్కర్ టెస్ట్ సిరీస్‌పై ఆధారపడ్డాయి. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో నాలుగు టెస్ట్‌ల్లో విజయం సాధిస్తేనే రోహిత్ సేన డబ్ల్యూటీసీ తుది పోరుకు చేరగలుగుతుంది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ టీమిండియాకు చావోరేవోనే. ఫలితంగా..పెర్త్‌లో జరిగే మొదటి టెస్ట్‌ను భారత జట్టు అత్యంత కీలకంగా తీసుకుంది. పెర్త్ పరిస్థితులకు పూర్తిగా అలవాటుపడేందుకు జట్టు సభ్యులంతా తీవ్రంగా శ్రమిస్తున్నారు. రెండుగా విడిపోయి మ్యాచ్‌లు ఆడారు. మొదటి మ్యాచ్‌కంటే రెండో మ్యాచ్‌లో బ్యాటర్లు చక్కగా రాణించారని సహాయ కోచ్ అభిషేక్ నాయర్ తెలిపాడు. 'ఈ మూడు రోజుల్లో ఏం చేయాలనే విషయమై ఆస్ట్రేలియా రావడానికి ముందే గంభీర్, రోహిత్‌తో కలిసి మేం చర్చించాం. ఇక్కడి పరిస్థితులకు అలవాటుపడేలా జట్టు సభ్యుల మధ్య జరిగే మ్యాచ్‌లో యువ, అనుభవజ్ఞులైన క్రికెటర్లకు తగు సమయం ఇవ్వాలని నిర్ణయించాం' అని నాయర్‌తోపాటు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చెప్పాడు. 'తొలి పోటీలో సాధారణ మ్యాచ్ మాదిరే బ్యాటర్ అవుటైతే క్రీజు వీడాల్సిందే. వారికి రెండో అవకాశం ఇచ్చాం. రెండోసారి కుర్రాళ్లు పరిస్థితులకు బాగా అలవాటై ఎక్కువసేపు క్రీజులో ఉన్నారు' అని నాయర్ వివరించాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో బౌలర్ల ప్రదర్శన గురించి చెబుతూ 'రెండో రోజు..బౌలర్లతో దశలవారీగా బౌలింగ్ చేయించాం. వారి పని భారాన్ని పరిశీలించాం. ఒక్కో బౌలర్ 15 ఓవర్లు వేశాడు. బుమ్రా అయితే 18 ఓవర్లు బౌలింగ్ చేశాడు. అసలైన టెస్ట్ మ్యాచ్ పరిస్థితుల్లోకి బౌలర్లను తీసుకు రావడమే లక్ష్యంగా ప్రాక్టీస్ సాగింది. 22నాటికి పూర్తిగా గాడిలో పడతాం.' అని నాయర్ వెల్లడించాడు. మరో మూడు సాధన సెషన్లున్నాయని తెలిపాడు.

కమాన్ కోహ్లీ

న్యూఢిల్లీ: టెస్టు సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించడం విరాట్ కోహ్లీకిదే ఆఖరు కానుందని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అభిప్రాయపడ్డాడు. అక్కడ తనకిదే చివరిదని విరాట్‌కు కూడా తెలుసన్న దాదా.. ఆ సిరీస్‌తో కచ్చితంగా ఫామ్‌లోకి వస్తాడన్న విశ్వాసముందన్నాడు. ఇటీవల స్వదేశంలో టెస్టు సిరీస్‌లో పేలవ ప్రదర్శనతో కోహ్లీ ఇంటాబయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. 'విరాట్ ఓ చాంపియన్ బ్యాటర్. ఆసీస్ గడ్డపై అతడికి మెరుగైన రికార్డుంది. 2014లో నాలుగు, 2018లో ఓ శతకం బాదాడు. ఆసీస్‌లో టెస్టు సిరీస్ కోసం పర్యటించడం ఇదే ఆఖరు అనే విషయం అతడికి కూడా తెలుసు. అందుకే విరాట్ ఈసారి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటాడు. ఇక కివీస్‌తో సిరీస్‌లో పిచ్‌లు బ్యాటింగ్‌కు ఏమాత్రం అనుకూలించలేదు. కానీ ఆసీస్ పిచ్‌లు అలా కాదు. అక్కడ అతడికి కొట్టిన పిండి. అందుకే కచ్చితంగా తనకు అనుకూలమైన చోట అద్భుతంగా రాణిస్తాడన్న నమ్మకం నాకుంది' అని గంగూలీ తెలిపాడు.

కసిగా ఆడతాడు

విరాట్ ప్రస్తుతం ఫామ్‌లో లేకపోయినా ఆసీస్‌తో సిరీస్‌లో కసిగా ఆడతాడని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ కూడా అన్నాడు. 'కివీస్‌పై విఫలమైన కోహ్లీ ఆసీస్‌పై పరుగులు సాధించాలనే ఆతృతలో ఉన్నాడు. తొలి టెస్టు జరిగే పెర్త్ మైదానంలో అతడు 2018లో సెంచరీ సాధించాడు. ఇది విరాట్‌కు ఆత్మవిశ్వాసాన్నిస్తుంది. క్రీజులో కాస్త కుదురుకుంటే ఇక అతడిని ఆపడం కష్టమే' అని గవాస్కర్ పేర్కొన్నాడు.

ఆసీస్ క్లీన్‌స్వీప్

మూడో టీ20లోనూ పాక్ ఓటమి

హోబర్ట్: పాకిస్థాన్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. సోమవారం ఆఖరిదైన మూడో మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అలాగే ఆసీస్ చేతిలో పాక్‌కిది వరుసగా ఏడో ఓటమి కావడం గమనార్హం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 18.1 ఓవర్లలో 117 పరుగులకు కుప్పకూలింది. బాబర్ (41) మాత్రమే రాణించాడు. హార్డీకి మూడు.. జంపా, జాన్సన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' స్టొయినిస్ (27 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 61 నాటౌట్) విజృంభించడంతో ఆసీస్ 11.2 ఓవర్లలో 118/3 స్కోరు చేసి గెలుపొందింది. ఇంగ్లిష్ (27) పర్వాలేదనిపించాడు.

బరిలో సాత్విక్ జోడీ

నేటి నుంచి చైనా ఓపెన్



షెన్‌జెన్ (చైనా): పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశాజనక ప్రదర్శన అనంతరం ఆటకు దూరమైన భారత బ్యాడ్మింటన్ టాప్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట మళ్లీ కోర్టులోకి అడుగుపెట్టనుంది. మంగళవారం నుంచి జరిగే చైనా మాస్టర్స్ టోర్నీలో సాత్విక్ జోడీ బరిలోకి దిగనుంది. విశ్వక్రీడల తర్వాత సాత్విక్ భుజానికి గాయం కావడంతో కొంత విరామం తీసుకోవాల్సిన పరిస్థితి. గతేడాది రన్నరప్‌గా నిలిచిన సాత్విక్ జోడీ.. తొలి రౌండ్‌లో చైనీస్ తైపీ ద్వయం లీ జి హు-యాంగ్ పొ హసువన్‌తో తలపడనుంది. పేలవ ప్రదర్శనతో ఇబ్బందులుపడుతున్న సింగిల్స్ స్టార్లు పీవీ సింధు, లక్ష్య సేన్‌తోపాటు యువ షట్లర్లు ఆకర్షి కశ్యప్, మాళవిక అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి, మిక్స్‌డ్‌లో సుమీత్-సిక్కి జోడీలు ఆడనున్నాయి.

జపాన్‌తో భారత్ సెమీస్ నేడు

మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీ

సాయంత్రం 4.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

రాజ్‌గిర్ (బిహార్): టోర్నమెంట్‌లో ఇప్పటి వరకు ఎరుగని అపజయం..దాంతో ఏర్పడిన కొండంత ఆత్మవిశ్వాసం.. వెరసి హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీ డిఫెండింగ్ చాంప్ భారత మహిళల జట్టు కీలక పోరుకు సిద్ధమైంది. మంగళవారం జరిగే సెమీఫైనల్లో జపాన్ జట్టును ఢీకొననుంది. టోర్నీలో ఇప్పటిదాకా మన ఆటతీరు పరిశీలిస్తే సెమీస్‌లో నిస్సందేహంగా భారత జట్టే ఫేవరెట్. అంతేకాదు..చివరి లీగ్ మ్యాచ్‌లో 3-0తో జపాన్‌ను చిత్తు చేయడం భారత్‌లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. టోర్నీలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో అన్నింటిలోనూ నెగ్గిన భారత జట్టు..పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత చైనానూ కంగుతినిపించడం గమనార్హం. మంగళవారం జరిగే మరో సెమీఫైనల్లో చైనాతో మలేసియా తలపడనుంది.



స్టీలర్స్‌కు టైటాన్స్ షాక్

నోయిడా: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన తెలుగు టైటాన్స్ ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో సంచలన విజయం సాధించింది. వరుసగా ఐదు విజయాలతో జోరుమీదున్న టేబుల్ టాపర్ హరియాణా స్టీలర్స్‌కు తెలుగు జట్టు షాకిచ్చింది. ఆరంభం నుంచి పూర్తి ఆధిపత్యం సాగించిన టైటాన్స్ 49-27తో స్టీలర్స్‌ను చిత్తు చేసింది. టైటాన్స్ రైడర్లు ఆశిష్ నర్వాల్ 11 పాయింట్లు, స్టాండిన్ కెప్టెన్ విజయ్ మాలిక్ 8 పాయింట్లతో సత్తా చాటగా.. డిఫెండర్ సాగర్, ఆల్‌రౌండర్ శంకర్ చెరో రెండు పాయింట్లతో ఆకట్టుకున్నారు. ఇక, డిఫెండర్ సాగర్ హైఫైవ్ సాధించాడు. మొత్తం పది మ్యాచ్‌లకుగాను ఆరు విజయాలు సాధించిన టైటాన్స్ 32 పాయింట్లతో ఏడో స్థానంలో కొనసాగుతోంది. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో యు ముంబా 38-37తో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది.

అలా ముగించారు

ఒక్క గెలుపు లేకుండానే ఏడాదికి భారత్ వీడ్కోలు | మలేసియాతో మ్యాచ్ డ్రా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): భారత సాకర్ జట్టు ఈ ఏడాదిని విజయం లేకుండానే ముగించింది. సోమవారం గచ్చిబౌలిలోని స్టేడియంలో జరిగిన భారత్-మలేసియా స్నేహపూర్వక మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది. ఆట ప్రథమార్థంలో రెండు జట్లు నువ్వా నేనా అన్నట్టు తలపడడంతో పోరు హోరాహోరీగా సాగింది. భారత ఆటగాళ్లు ఫారుఖ్ చౌధురి, సందేశ్, చింగిల్ సనా ఆరంభంలో దూకుడుగా ఆడడంతో బ్లూ టైగర్స్ ఆధిపత్యం కనబర్చింది. ఆట 19వ నిమిషంలో గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు డైరెక్ట్ హిట్‌ను అంచనా వేయడంలో విఫలమవడంతో మలేసియాకు సులభమైన గోల్ లభించింది. పౌలో జోశ్ చేసిన గోల్‌తో ఆ జట్టు 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. తర్వాత పుంజుకున్న భారత్ తొలి అర్ధభాగం ముగిసేలోపు గోల్ చేసి స్కోర్లు సమం చేసింది. ప్రథమార్థం ముగుస్తుందనగా 39వ నిమిషంలో కార్నర్ నుంచి ఫెర్నాండెజ్ అందించిన పాస్‌ను రాహుల్ బెకు కళ్లు చెదిరే హెడర్‌తో భారత్‌కు సూపర్ గోల్ అందించాడు. దీంతో ఇరుజట్ల స్కోరు 1-1తో సమమైంది. ఇక.. ద్వితీయార్థంలో ఇరుజట్లు గోల్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసినా సఫలం కాలేదు. ఇంజ్యూరీ సమయంలోనూ ఇరుజట్లు మరో గోల్ సాధించలేకపోయాయి. దీంతో ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్ చివరకు డ్రాగా ముగియక తప్పలేదు.

బిజినెస్

వస్తున్నాయ్.. ఆర్‌బీఐ డేటా సెంటర్లు



» తక్కువ ధరలకే చిన్న సంస్థలకు క్లౌడ్ సేవలు
» హైదరాబాద్‌లో ఒకటి, ముంబైలో మరోటి

ముంబై: ఆర్థిక సేవల రంగంలోని చిన్న కంపెనీలకు అందుబాటు ధరల్లో క్లౌడ్ డేటా స్టోరేజీ వసతి కల్పించడం లక్ష్యంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) దేశంలో లోకల్ క్లౌడ్ డేటా స్టోరేజీ కేంద్రాలు ఏర్పాటు చేసే యోచనలో ఉంది. వీటిలో ఒకటి హైదరాబాద్‌లోను, మరొకటి ముంబైలోను ఏర్పాటు కావచ్చని తెలుస్తోంది. 2025లో ప్రయోగాత్మకంగా ఆర్‌బీఐ ఈ కార్యక్రమం చేపట్టనుంది. ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు ఈ వివరాలు వెల్లడించినట్టు రాయిటర్స్ కథనం పేర్కొంది. అయితే ఇది అత్యంత రహస్య సమాచారం కావడం వల్ల తమ పేర్లు వెల్లడించేందుకు వారు నిరాకరించారని కథనం తెలిపింది. ఇందుకోసం ఆర్‌బీఐ స్థానిక ఐటీ కంపెనీల సేవలు ఉపయోగించుకోనుంది. ఈ డేటా సెంటర్లను అమెజాన్ వెబ్ సర్వీసెస్, మైక్రోసాఫ్ట్ అజూరే, గూగుల్ క్లౌడ్, ఐబీఎం క్లౌడ్‌కు పోటీగా నిలుపుతారు. ఆసియాలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్‌లో క్లౌడ్ సర్వీసుల మార్కెట్ పరిమాణం 2023లో 830 కోట్ల డాలర్లుండగా (రూ.70,550 కోట్లు) 2028 నాటికి 2420 కోట్ల డాలర్లకు (రూ.2.06 లక్షల కోట్లు) చేరుతుందని ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ అంచనా. అయితే ఈ మార్కెట్లో విదేశీ సంస్థలే ఇప్పటి వరకు ఆధిపత్యం చలాయిస్తున్నాయి.

తొలుత స్వల్ప స్థాయిలో

రాబోయే కొద్ది నెలల్లో ఈ ప్రాజెక్టును స్వల్ప స్థాయిలో ప్రారంభించి తదుపరి దశలో దేశవ్యాప్తంగా విస్తరించాలన్నది తమ ప్రయత్నమని ఈ ప్రాజెక్టుపై పని చేస్తున్న సీనియర్ ఎగ్జిక్యూటివ్ తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న క్లౌడ్ డేటా సర్వీసులు భరించగల స్థితి తమకు లేదని భావించే బ్యాంకింగ్, ఆర్థిక సేవా రంగ సంస్థలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టు చేపట్టినట్టు ఆయన చెప్పారు. ఈ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌గా ఎర్నెస్ట్ అండ్ యంగ్‌ను (ఈవై) నియమించారు. తొలి దశలో ఈ వ్యవహారాలను ఆర్‌బీఐకి చెందిన పరిశోధన విభాగం ఇండియన్ ఫైనాన్షియల్ టెక్నాలజీ అండ్ అలైడ్ సర్వీసెస్ నిర్వహిస్తుంది. తదుపరి దశలో ప్రైవేటు రంగంలోని టెక్నాలజీ కంపెనీల భాగస్వామ్యంతో చేపడతారని ఆ వర్గాలు తెలిపాయి. అలాగే ప్రారంభ దశలో ప్రాజెక్టుకు కావలసిన పెట్టుబడిని ఆర్‌బీఐ వద్ద ఉన్న రూ.22,974 కోట్ల అసెట్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి సమకూర్చుతారు. తదుపరి దశలో ఇందులో ఈక్విటీ భాగస్వామ్యం తీసుకోవాలని ఆర్థిక సంస్థలను కేంద్ర బ్యాంక్ ఆహ్వానించనుంది.

డేటా స్థానికీకరణే లక్ష్యం

చెల్లింపులు, ఆర్థిక డేటాను స్థానికీకరించాలన్న ఆర్‌బీఐ కృషిలో దీన్ని తొలి అడుగుగా భావించవచ్చు. క్లౌడ్ సంబంధిత సొల్యూషన్లు అందించడంలో అనుభవం గల దేశీయ కంపెనీలను మాత్రమే బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు అనుమతించారు. కంపెనీలు వ్యక్తిగతంగా గాని, కన్సార్షియంగా గాని దీనికి బిడ్ చేయవచ్చు. ఈ ప్రాజెక్టును చేపట్టడానికి దేశంలో క్లౌడ్ సేవల రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న పలు కంపెనీలు ఆసక్తిని ప్రకటిస్తున్నాయంటున్నారు.

'బీమా'లోకి 100% ఎఫ్‌డీఐ?

» అనుమతించే యోచనలో కేంద్ర ప్రభుత్వం
» శీతాకాల సమావేశాల్లో బిల్లు పెట్టే చాన్స్

న్యూఢిల్లీ: దేశీయ బీమా సేవల రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితిని ప్రస్తుతమున్న 74 శాతం నుంచి 100 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. అలాగే, బీమా ఏజెంట్లపై ఆంక్షలనూ సడలించే యోచనలో ఉంది. ఇందుకోసం పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బీమా చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టనుందని ఓ ఆంగ్ల మీడియా కథనం పేర్కొంది. శీతాకాల సమావేశాలు ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్నాయి. ఎఫ్‌డీఐ పరిమితిని 100 శాతానికి పెంచితే గనుక, విదేశీ సంస్థలు భారత మార్కెట్లోకి నేరుగా ప్రవేశించడంతో పాటు దేశీయ సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకోవాల్సిన అవసరం లేకుండా స్వతంత్రంగానే కార్యకలాపాలు కొనసాగించవచ్చు. అంతర్జాతీయ బీమా దిగ్గజాలను ఆకర్షించడంతోపాటు దేశీయ మార్కెట్లో పోటీని, పెట్టుబడులను పెంచేందుకు ఇది దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే బీమా ఏజెంట్లు ఇకపై ఎన్ని కంపెనీలకు చెందిన పాలసీలనైనా విక్రయించే వెసులుబాటు కల్పించే అవకాశం ఉంది.

అధిక వడ్డీ రేట్లు వృద్ధికి ఆటంకం

ఎస్‌బీఐ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి నిర్మల వ్యాఖ్య



ముంబై: దేశంలో వడ్డీ రేట్లు "చాలా అధికంగా" ఉన్నాయని ప్రజలు భావిస్తున్నారని, బ్యాంకులు వడ్డీ రేట్లను ప్రజలు భరించగల స్థాయికి తగ్గించాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ప్రతి ఏటా నిర్వహించే వాణిజ్య, ఆర్థిక సదస్సులో ఆమె మాట్లాడుతూ.. దేశానికి పరిశ్రమల ఏర్పాటు ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. పరిశ్రమలు సామర్థ్యాలు పెంచుకుని, కొత్త యూనిట్లపై ఇన్వెస్ట్ చేయాలంటే వడ్డీ రేట్లు తక్కువ స్థాయిలో ఉండాలని ఆమె అన్నారు. వడ్డీ రేట్లు తక్కువగా ఉన్నప్పుడే "వికసిత్ భారత్" సాధ్యమవుతుందని చెప్పారు. అలాగే బ్యాంకులు తమపై గల రుణవితరణ బాధ్యతకే కట్టుబడాలని సీతారామన్ సూచించారు. ప్రజలను మభ్యపెట్టి బీమా పాలసీలను విక్రయించడం కూడా పరోక్షంగా నిధుల సమీకరణ భారాన్ని పెంచుతుందని ఆమె వ్యాఖ్యానించారు. పారదర్శకతను పెంచుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని బ్యాంకులకు సూచించారు.

ఎంఎస్ఎంఈలకు ప్రాధాన్యతనివ్వండి

చిన్న వ్యాపారాలకు రుణాలు ఇవ్వడం కూడా బ్యాంకుల ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ ఎంఎస్ఎంఈలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.6.12 లక్షల కోట్లు, 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.7 లక్షల కోట్లు రుణ లక్ష్యాన్ని ఆమె నిర్దేశించారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రూ.5.75 లక్షల కోట్ల లక్ష్యాన్ని కూడా సాధించాలని ఆమె సూచించారు. బీమా కవరేజీని కల్పిస్తూ ప్రజల పొదుపును పెట్టుబడుల్లోకి ఆకర్షించాలని, తద్వారా దాన్ని రిస్క్ మూలధనంగా మార్చడంపై కూడా దృష్టిసారించాలన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం ప్రత్యేకించి ఆహార వస్తువుల ధరలు ఆందోళనకరమైన స్థాయిలో ఉంటున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని గత 10 విడతలుగా ఆర్‌బీఐ రెపో రేట్లపై యథాతథ స్థితిని కొనసాగిస్తోంది. తాజాగా అక్టోబరులో రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ స్థాయి (6 శాతం) కూడా దాటిపోయి 6.2 శాతంగా నమోదైన నేపథ్యంలో డిసెంబరు సమావేశంలో కూడా రెపో రేటు యథాతథంగానే కొనసాగించే అవకాశం కనిపిస్తోంది.

ఈ ఏడాది చివరికి మరో 500 శాఖలు

ఎస్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి కొత్తగా 500 శాఖలను ప్రారంభించనున్నట్టు ఆర్థిక మంత్రి తెలిపారు. కొత్త బ్రాంచీల ఏర్పాటు పూర్తయితే మొత్తం ఎస్‌బీఐ శాఖల సంఖ్య 23,000కి చేరుతుంది. ఎస్‌బీఐ ముంబై మెయిన్ బ్రాంచీ ఏర్పాటై వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 1921లో బ్యాంకు ఏర్పాటైన నాటి నుంచి అది దశదిశలుగా విస్తరించిందన్నారు. 1921లో 250 బ్రాంచీలున్న ఎస్‌బీఐ ఇప్పుడు 22,500 శాఖలకు చేరిందని చెప్పారు. 50 కోట్లకు పైబడిన కస్టమర్లతో ఎస్‌బీఐ బ్యాంకింగ్ రంగంలోని డిపాజిట్లలో 22.4 శాతం, రుణ బట్వాడాలో ఐదో వంతు వాటాతో అగ్రగామిగా ఉందని ఆమె తెలిపారు.

ఐటీ, ఆయిల్ షేర్లలో అమ్మకాలు

» సెన్సెక్స్ 241 పాయింట్లు డౌన్ .. ఏడో రోజూ నష్టపోయిన నిఫ్టీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో నష్టాలు కొనసాగాయి. సోమవారం సెన్సెక్స్ మరో 241.30 పాయింట్లు కోల్పోయి 77,339.01 వద్దకు జారుకుంది. సూచీ నష్టపోవడం వరుసగా ఇది నాలుగో రోజు. నిఫ్టీ వరుసగా ఏడో రోజు నష్టపోయింది. సోమవారం నాటి సెషన్‌లో 78.90 పాయింట్లు క్షీణించి 23,453.80 వద్ద ముగిసింది. అమెరికా మార్కెట్ల ప్రతికూల సంకేతాలతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఐటీ, ఆయిల్ రంగ షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 17 నష్టపోగా.. టీసీఎస్ 3.05 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఇన్ఫోసిస్ 2.82 శాతం పతనమైంది.

ఏషియా ఇండెక్స్ నుంచి 'బీఎస్ఈ సెలెక్ట్ ఐపీఓ' సూచీ

బీఎస్ఈ అనుబంధ విభాగమైన ఏషియా ఇండెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సోమవారం 'బీఎస్ఈ సెలెక్ట్ ఐపీఓ' ఇండెక్స్‌ను ప్రారంభించింది. ఐపీఓ లేదా వ్యాపార విభజన/డీమెర్జర్ ద్వారా స్టాక్ మార్కెట్లో లిస్టయిన కంపెనీల పనితీరును ఈ ఇండెక్స్ మదింపు చేయనుంది. కంపెనీ పూర్తి మార్కెట్ క్యాపిటలైజేషన్, లిక్విడిటీ, కనీసం 3 నెలల లిస్టింగ్ చరిత్ర వంటి అంశాల ఆధారంగా కంపెనీలను ఇండెక్స్‌లో చేర్చనున్నారు.

మెడ్‌ప్లస్‌లో 6.6 శాతం వాటా విక్రయం

హైదరాబాద్‌కు చెందిన మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్‌లో ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ మొత్తం 6.6 శాతం వాటాను రూ.552 కోట్లకు విక్రయించాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త అజీమ్ ప్రేమ్‌జీకి చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ప్రేమ్‌జీ ఇన్వెస్ట్.. మెడ్‌ప్లస్‌లో తనకున్న 5.77 శాతం వాటాను పూర్తిగా ఉపసంహరించుకుంది. కాగా, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ 0.84 శాతం వాటా విక్రయించింది. దాంతో మెడ్‌ప్లస్‌లో ఈ ఫండ్ వాటా 4.88 శాతం నుంచి 4.04 శాతానికి తగ్గింది.

అంతర్గత నిర్వహణ బలోపేతం చేయండి

» బ్యాంకు బోర్డులకు ఆర్‌బీఐ గవర్నర్ దాస్ సూచన

ముంబై: బ్యాంకుల అంతర్గత నిర్వహణ వ్యవస్థ బలోపేతం చేయాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ బ్యాంకు బోర్డులకు సూచించారు. ప్రధానంగా ఏయే రంగాలపై అవసరాన్ని మించి దృష్టి పెడుతున్నారో గుర్తించి తద్వారా ఎదురవుతున్న రిస్కులు, సవాళ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పిలుపు ఇచ్చారు. నానాటికీ బ్యాంకింగ్ ముఖచిత్రం మారిపోతున్న వాతావరణంలో డైరెక్టర్ల బోర్డులు ఒక దిక్సూచి వలె వ్యవహరించాలని, బ్యాంకులకు స్థిరమైన మార్గదర్శకం అందించాలని సూచించారు. ప్రైవేటు రంగ బ్యాంకుల డైరెక్టర్ల సదస్సులో ఆయన కీలకోపన్యాసం ఇస్తూ ప్రజలను మభ్యపెట్టి బీమా ఉత్పత్తులు విక్రయించడం, సరైన కేవైసీ లేకుండానే ఖాతాలు తెరవడం వంటి అనైతిక చర్యలకు స్వస్తి పలకాలని సూచించారు.

హైదరాబాద్‌లో ఇండిజీన్ కేంద్రం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లైఫ్ సైన్సెస్ కమర్షియలైజేషన్ సంస్థ ఇండిజీన్ హైదరాబాద్‌లో కొత్త కేంద్రాన్ని ప్రారంభించింది. పెరుగుతున్న వ్యాపార అవసరాలను తీర్చటంతో పాటు గ్లోబల్ డెలివరీ కార్యకలాపాలను మరింత పటిష్ఠం చేసే ఉద్దేశంతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు సంస్థ ఛైర్మన్, సీఈఓ మనీష్ గుప్తా వెల్లడించారు. లైఫ్ సైన్సెస్ కంపెనీల ఆధునికీకరణ, టెక్నాలజీపరంగా ఫార్మా పరిశ్రమ ఎదుర్కొంటున్న ఒత్తిళ్లను తీర్చటంలో ఈ కేంద్రం కీలకంగా ఉండనుందని గుప్తా పేర్కొన్నారు.

అపోలో రేడియాలజీ చేతికి ఇన్‌హెల్త్ రేడియాలజీ విభాగం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హాస్పిటల్స్‌కు చెందిన అపోలో రేడియాలజీ ఇంటర్నేషనల్ (ఏఆర్ఐ).. యూకేలోని ఇన్‌హెల్త్ గ్రూప్ రేడియాలజీ రిపోర్టింగ్ విభాగాన్ని చేజిక్కించుకుంది. యూకేతో పాటు ప్రపంచవ్యాప్తంగా నాణ్యమైన డయోగ్నోస్టిక్ సేవలను విస్తరించటంతో పాటు రేడియాలజిస్టుల కొరతను తీర్చేందుకు ఈ కొనుగోలు దోహదపడుతుందని ఏఆర్ఐ తెలిపింది. అంతేకాకుండా ఏటా 20 లక్షల స్కాన్స్, 24 దేశాల్లో సేవలు సహా 200కు పైగా హెల్త్‌కేర్ సంస్థలకు సేవలందించే అవకాశం లభిస్తుందని భావిస్తోంది.

2030 నాటికి భారత జీసీసీ పరిశ్రమ రూ.8.5 లక్షల కోట్లకు..

» 25 లక్షల ఉద్యోగాలు

న్యూఢిల్లీ: భారత గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) పరిశ్రమ.. 2030 నాటికి రూ.8.5 లక్షల కోట్లకు (10,000 కోట్ల డాలర్లు) చేరే అవకాశం ఉందని ఇండియా జీసీసీ ల్యాండ్‌స్కేప్ పేరుతో రూపొందించిన నివేదిక వెల్లడించింది. అంతేకాకుండా ఈ పరిశ్రమ దాదాపు 25 లక్షల మంది నిపుణులకు ఉద్యోగాలు కల్పించనుందని పేర్కొంది. ప్రస్తుతం భారత్‌లో 1,700కు పైగా జీసీసీలు ఉండగా వీటి వార్షికాదాయం 6,460 కోట్ల డాలర్లు (రూ.5.45 లక్షల కోట్లు)గా ఉంది. కాగా 19 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. గడచిన ఐదేళ్ల కాలంలో ఈ సెంటర్లు భారత్‌లో సాంప్రదాయ సేవలతో పోలిస్తే కీలకమైన ట్రాన్స్‌ఫార్మేషన్ హబ్స్‌గా మారాయని నివేదిక పేర్కొంది. అంతేకాకుండా 2026 నాటికి ఈ సెంటర్లలో 70% వరకు అడ్వాన్స్‌డ్ కృత్రిమ మేధ (ఏఐ) సామర్థ్యాలతో పనిచేస్తాయని తెలిపింది. అంతర్జాతీయంగా చూస్తే భారత్‌లో జీసీసీల నిర్వహణ వ్యయాలు 40% తక్కువగా ఉండటంతో బహుళజాతి సంస్థలను విశేషంగా ఆకర్షిస్తోంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	76,310 ▲	69,950 ▲	99,000 ▲
ముంబై	74,808 ▲	68,524 ▲	89,289 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	575
వరంగల్	552	గోదావరి	565
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	95	విజయవాడ	111
వరంగల్	95	గుంటూరు	108
కరీంనగర్	95	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	102
కర్నూలు	95	నెల్లూరు	102
విశాఖపట్నం	103	అనంతపురం	102
గోదావరి	111		

ఏఐ సహకారంతో.. శ్రీవారి దర్శనం

2-3 గంటల్లోనే

12

టూరిజం కోటా టికెట్లు రద్దు

నెయ్యి నాణ్యత పరీక్షకు 90 లక్షలతో ల్యాబ్

దేవస్థానంలోని అన్యమతస్థులకు వీఆర్ఎస్

కొండపై రాజకీయాలు మాట్లాడడం నిషేధం

టీటీడీ కొత్త పాలకమండలి నిర్ణయాలు

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



10

కొత్త కాగ్ సంజయ్ మూర్తి

1989 హిమాచల్ క్యాడర్ అధికారి నియామకం

గతంలో హైదరాబాద్ ఎన్ఐఎస్జీ డైరెక్టర్‌గా విధులు

మంగళవారం | 19-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 231 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్



ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి టెండర్లు

జనవరిలో..

2 ప్యాకేజీల్లో పనులు.. త్వరలో దక్షిణ డీపీఆర్ టెండర్లు

రైతులకు నష్టం జరగొద్దని సీఎం రేవంత్ చెప్పారు

ఆర్ఆర్ఆర్ బాధ్యతలు ఐఏఎస్ దాసరి హరిచందనకు

ఎనిమిది నెలల్లో మామునూరు విమానాశ్రయం పూర్తి

ఫిబ్రవరిలో విజయవాడ హైవే విస్తరణ పనులు

కేసీఆర్ వద్దంటే మూసీ ప్రాజెక్టు ఆపేస్తాం: కోమటిరెడ్డి

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం నిర్మాణ పనుల కోసం జనవరిలో టెండర్లను ఆహ్వానించనున్నట్టు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఆ లోపే పరిహారం సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. ఇప్పటికే ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. రెండు ప్యాకేజీల్లో పనులను చేపడతామని చెప్పారు. గత ప్రభుత్వం కేంద్రంతో సఖ్యతగా వ్యవహరించక పోవడం వల్లనే ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం నిర్మాణం ఆలస్యమైందని కోమటిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉత్తరభాగంలో 94 శాతం భూ సేకరణ పూర్తయిందన్నారు. 80 శాతం భూసేకరణ పూర్తవ్వగానే టెండర్లు పిలిచేందుకు అవకాశం ఉన్నా జాతీయ రహదారుల సంస్థ పిలవలేదని చెప్పారు. పరిహారం విషయంలో మానవీయ కోణంతో వ్యవహరించి రైతులకు నష్టం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారన్నారు. ఉత్తరభాగం నిర్మాణం కోసం 1,895 హెక్టార్ల భూమి

మిగతా 12వ పేజీలో...

ఓరుగల్లుకు

నిధుల వరద



హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో సీఎం సభకు జరుగుతున్న ఏర్పాట్లు

రూ.4962 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

అధికంగా భూగర్భ డ్రైనేజీకి రూ.4,170 కోట్లు

విమానాశ్రయ భూసేకరణకు రూ. 205 కోట్లు

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు 161 కోట్లు

నేడు వరంగల్ పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజా పాలన విజయోత్సవ సభకు హాజరు

కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించనున్న సీఎం

22 జిల్లాల మహిళా భవనాలకు శంకుస్థాపన

ఎంజీఎంలో ట్రాన్స్‌జెండర్ క్లినిక్ ప్రారంభం

మహిళల రుణాల చెక్కుల పంపిణీకి శ్రీకారం

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్: శ్రీధర్‌బాబు

హైదరాబాద్/వరంగల్/హనుమకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండో పెద్ద నగరంగా ఉన్న వరంగల్ అభివృద్ధిపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. వరంగల్ నగరంలో వివిధ అభివృద్ధి పనుల కోసం గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.4962.47 కోట్లు మంజూరు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని పనులకు పరిపాలన అనుమతులు కూడా మంజూరు చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవ సభలు నిర్వహిస్తోంది. 20 రోజులపాటు నిర్వహించనున్న ఈ సభల ద్వారా ఏడాది కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తున్న తీరు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ప్రగతిని వివరించనుంది. ఈ విజయోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సెంటిమెంట్ ప్రకారం వరంగల్ ఆర్ట్స్ కాలేజీ మైదానాన్ని తొలి వేదికగా

మిగతా 11వ పేజీలో...

మహారాష్ట్రలో ఓటమి మోదీకి ముందే తెలిసింది!

అందుకే ప్రచారం వీడి విదేశాలకు

హామీల అమల్లో ప్రధాని విఫలం

మావి కచ్చితమైన గ్యారెంటీలు

వీలైతే కేంద్ర కమిటీని పంపండి

వివరాలన్నీ ఇస్తా: రేవంత్‌రెడ్డి 11

వేములవాడ అభివృద్ధికి రూ. 127 కోట్లు

ఆలయ కాంప్లెక్స్, వసతులకు

రూ.76 కోట్లు.. రోడ్లకు 47 కోట్లు

రేపు ముఖ్యమంత్రి పర్యటన

11



నాగపూర్‌లో ఎన్నికల సామగ్రి కేంద్రం వద్ద బందోబస్తు

నువ్వా నేనా?

మహారాష్ట్రలో రెండు కూటములకు సవాల్

ముగిసిన ఎన్నికల ప్రచారం.. రేపు పోలింగ్

తెలంగాణ సరిహద్దు జిల్లాల్లో ఢీ అంటే ఢీ

అధికార యంత్రాంగం అప్రమత్తం

ఝార్ఖండ్‌లో గురువారం చివరిదశ ఓటింగ్

నిజామాబాద్, న్యూఢిల్లీ, నవంబరు18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ఆదిలాబాద్: మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లో హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారం సోమవారంతో ముగిసింది. బుధవారం జరిగే ఎన్నికలపైనే దేశం దృష్టి యావత్తూ కేంద్రీకృతమైంది. మహారాష్ట్రలో ప్రధానమైన రెండు ప్రాంతీయ పార్టీలు ఎన్‌సిపి, శివసేన చీలిపోయి బీజేపీ, కాంగ్రెస్‌తో చేతులు కలపడంతో ఈ రెండు పార్టీల చీలిక వర్గాల భవిష్యత్తు ఏమిటో ఈ ఎన్నికలు తేల్చనున్నాయి. శివసేన(ఉద్ధవ్ థాక్రే వర్గం), ఎన్‌సీపీ(శరద్ పవార్ వర్గం), కాంగ్రెస్‌తో కలిసి మహావికాస్ అఘాడీ పేరుతో పోటీ చేస్తుండగా, శివసేన(ఏక్‌నాథ్‌శిందే), ఎన్‌సీపీ(అజిత్‌పవార్), బీజేపీతో కలిసి మహాయుతి పేరుతో పోటీ చేస్తున్నాయి. ఈ రెండు కూటములతో పాటు ఒవైసీ నేతృత్వంలోని మజ్లిస్(ఏఐఎంఐఎం), మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన, కొందరు తిరుగుబాటు అభ్యర్థులు కూడా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశాలున్నాయి. మహారాష్ట్రలోని 288 సీట్లలో బీజేపీ అన్ని పార్టీల కంటే అత్యధికంగా 152 స్థానాలకు

మిగతా 10వ పేజీలో...

చెత్త వేస్తే చలానా!

ట్రాఫిక్ జరిమానా తరహాలో విధింపు

రోడ్లపై వ్యర్థాలు పడేయకుండా నిఘా

సీసీ కెమేరాలు.. క్షేత్ర స్థాయి ఫొటోలు

యాప్ రూపకల్పనలో జీహెచ్ఎంసీ

డిసెంబరు 1 నుంచి అందుబాటులోకి!

11 చెత్త బుట్టలు లేని దుకాణాలు సీజ్



మండుతున్న మణిపూర్

- కర్ఫ్యూను ఉల్లంఘించిన నిరసనకారులు
- ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు 10
- మరో 5వేల మంది కేంద్ర బలగాల తరలింపు

ఉగాది తర్వాతే సన్న బియ్యం!


12

కొత్త ధాన్యం మిల్లింగ్‌తో భారీగా నూక శాతం

నాణ్యత తగ్గే ప్రమాదం.. ముద్దగా అన్నం

నిపుణుల సూచనతో సర్కారు పునరాలోచన

ధాన్యం తక్కువ వస్తుండడం.. మరో కారణం



8

ఇంటర్మీడియట్ వరకూ తెలుగును తప్పనిసరి చేయాలి

ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు.. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ సూచన

దక్షిణాదిన మరే రాష్ట్రంలో మాతృభాషకు ముప్పు లేదు

తెలుగు రాష్ట్రాల్ని ఆంగ్ల వ్యామోహం కమ్మేసిందని ఆవేదన

పోలవరపు కోటేశ్వరరావు సాహిత్యసర్వస్వం ఆవిష్కరణ

కుంగదీస్తున్న మధుమేహం

20% ఆరోగ్యవంతులతో పోలిస్తే.. మధుమేహ బాధితులు డిప్రెషన్ బారిన పడే ముప్పు 2-3 రెట్లు అధికం. వ్యాకులత, ఆదుర్దా, చింతతో బాధపడే ప్రమాదం 20% అధికం.

63% డయాబెటిస్ బాధితుల్లో.. దానివల్ల కాలక్రమంలో వచ్చే దుష్ప్రభావాలు, సమస్యల గురించిన ఆందోళన తమ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని పేర్కొన్నవారు..

28% తమ పరిస్థితిపై సానుకూల భావనతో ఉండడం కష్టంగా అనిపిస్తోందని చెప్పిన మధుమేహ బాధితులు..

బాధితుల్లో 36% మందిలో మానసిక సమస్యలు

ఒత్తిడి, కుంగుబాటు, కోపం, ఆందోళన, భయం

సిగ్గు, విచారం వంటివాటితో తీవ్రంగా సతమతం

జర్మనీ పరిశోధకుల తాజా అధ్యయనంలో వెల్లడి

పరీక్షలు చేయించుకుని జాగ్రత్తపడాలని సూచన



న్యూఢిల్లీ, నవంబరు 18: మధుమేహం.. శారీరకంగానే కాదు, మానసికంగా కూడా దెబ్బతీస్తోందని.. చక్కెరవ్యాధితో బాధపడేవారిలో 36 శాతం మంది కోపం, అపరాధ భావన, సిగ్గు, భయం, ఆందోళన, విచారం, ఒత్తిడి (స్ట్రెస్), కుంగుబాటు (డిప్రెషన్) వంటి సమస్యలకు గురవుతున్నారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. జర్మనీలోని హెన్రిచ్ హీన్ యూనివర్సిటీ, డసెల్‌ఫోర్డ్‌కు చెందిన పరిశోధకులు చేసిన ఈ అధ్యయన నివేదిక లాన్సెట్ జర్నల్ తాజా సంచికలో ప్రచురితమైంది. దీర్ఘకాల మధుమేహ ప్రభావం శరీరంలోని పలు కీలక అవయవాలపై పడుతుందన్న సంగతి తెలిసిందే. అయితే, చక్కెర వ్యాధి మానసికంగా ఎన్నెన్ని సమస్యలకు కారణమవుతోందనే అంశంపై జర్మనీ పరిశోధకులు దృష్టి సారించారు. "మధుమేహాన్ని ఎలా నియంత్రించాలి? దీనివల్ల ఇంకా ఏమేం సమస్యలు వస్తాయో? అనే సందేహాలు.. జీవన నాణ్యత తగ్గిపోవడం, వైద్య ఖర్చులు నానాటికీ పెరగడం, మందులు వాడుతున్నా ఆశించినంతగా చక్కెరస్థాయులు నియంత్రణలోకి రాకపోవడం, ఆహారపుటలవాట్లను మార్చుకోవాల్సి రావడం, ఔషధం మోతాదు ఎక్కువై రక్తంలో చక్కెర స్థాయులు ఆందోళనకరస్థాయిలో పడిపోతాయన్న

మిగతా 10వ పేజీలో...



నేను భారతీయులకు

గులామ్‌ని!

మీరు ఇటలీ నేతలకు బానిసలు

ప్రభుత్వ వైఫల్యాల్ని ఎత్తిచూపితే వ్యక్తిగత విమర్శలు చేస్తారా?

ఏడాదైనా పథకాల అమలేదీ?

కోతలు, అబద్ధాలతో గడిపేశారు

సీఎం రేవంత్‌పై కిషన్‌రెడ్డి ధ్వజం

రాష్ట్ర సర్కారు వైఫల్యాలపై బీజేపీ నేతల వర్క్‌షాపు

11



మణిపూర్ పరిస్థితే లగచర్లలోనూ

హక్కుల కోసం 9 నెలలుగా గిరిజనుల పోరాటం

దమనకాండపై రాహుల్, మోదీ స్పందించాలి

రూ.60 లక్షలు భూమికి రూ.8 లక్షలైనా ఇవ్వరా?

రేవంత్ రెడ్డి సోదరుడికి ఏ హోదాతో ప్రోటోకాల్?

ప్రభుత్వాన్ని అస్థిరపర్చం.. రేవంతే ఐదేళ్లూ ఉండాలి

ఆ తర్వాత 15 ఏళ్లు మేమే.. ఢిల్లీలో కేటీఆర్

నియంతలా రేవంత్

రైతులకు సీఎం సోదరుడి బెదిరింపులు: అరుణ

లగచర్లపై పార్లమెంటులో తీర్మానం: ఈటల

సంగారెడ్డి జిల్లా జైల్లో గ్రామస్థులకు పరామర్శ

న్యూఢిల్లీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని లగచర్లలోనూ మణిపూర్ వంటి పరిస్థితే ఉందని, అక్కడి గిరిజనుల గోడు దేశమంతా వినాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. తెలంగాణలో గిరిజనులకు న్యాయం దక్కడం లేదని, అందుకే వారి సమస్యను దేశ రాజధాని ఢిల్లీకి తీసుకొచ్చామని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అస్థిరపరచాల్సిన అవసరం తమకు లేదని, ఐదేళ్లూ ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరుకుంటున్నామన్నారు. ఢిల్లీకి కావాల్సిన మూటలు అందించగల సత్తా రాష్ట్రంలో రేవంత్ రెడ్డికి మాత్రమే

మిగతా 9వ పేజీలో...

లగచర్ల ఎఫెక్ట్.. పరిగి డీఎస్పీ బదిలీ! 9

సంగాయిపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

అరెస్టులు ఆపండి.. ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మణిపూర్ రోదన

ఇటీవల కుకీ మిలిటెంట్లు అపహరించుకుపోయిన ఆరుగురు వ్యక్తుల మృతదేహాలు నదిలో దొరకడంతో ఇంఫాల్ లోయలో అగ్గిరాజుకుంది. ఒక శరణార్థ శిబిరంనుంచి ఆ మీతీ కుటుంబాన్ని అపహరించుకుపోయిన కుకీ మిలిటెంట్లు ఎనిమిదినెలల పసికందునుంచి అమ్మమ్మ వరకూ అందరినీ అమానుషంగా హత్యచేశారు. రెండేళ్ళబాలుడి తల, చేతులు నరికివేసి అత్యంత ఉన్మాదంగా వ్యవహరించారు. ఈ దారుణఘటన మీతీలను ఆగ్రహోదగ్రులను చేసింది. మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ళమీద దాడులు చేశారు, వాటిని తగులబెట్టారు. ఏకంగా ముఖ్యమంత్రి నివాసంమీదే విరుచుకుపడ్డారు. ఇటీవల పదిమంది కుకీలను సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఎన్‌కౌంటర్ చేయడంతో కుకీ–జో మిలిటెంట్లు ప్రతీకారంగా ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఓ వాదన. మీతీ మిలిటెంట్లనుంచి తమవారిని రక్షించుకోవడానికి వలంటీర్లుగా పనిచేస్తున్న కుకీలను సీఆర్పీఎఫ్ బలగాలు పనిగట్టుకొని చంపివేశాయన్నది వారి ఆరోపణ. కుకీ–జోమీ ఆదివాసుల్లో ఒకటైన హమర్ తెగకు చెందిన ఒక యువతిమీద మీతీ మిలిటెంట్లు అత్యాచారం జరిపి, చిత్రవధచేసి, సజీవంగా తగులబెట్టినందుకు ప్రతీకారంగా మీతి కుటుంబాన్ని హమర్ మిలిటెంట్లు చిత్రవధ చేసిచంపినట్టు కనిపిస్తోంది. మీతీలు, ఆదివాసీ తెగల మధ్య పాలకులు అడ్డుగోడలు కట్టేసిన తరువాత, మణిపూర్ నిత్యం రగులుతూనే ఉంది.

ఏడాదిన్నరగా మణిపూర్ తీవ్రమైన హింసనీ, బాధనీ చవిచూస్తోంది. విద్వేషపూరిత రాజకీయాలమీద ఆధారపడి పాలన చేయాలనుకుంటున్నవారు జాతుల మధ్య వైరాన్ని పెంచిపోషిస్తున్నారు. ప్రస్తుత పరిణామాలు కాస్తంత పెద్దవి కావచ్చునేమో కానీ, మణిపూర్‌లో మళ్ళీ హింస అంటూ వార్తలు నిత్యం వింటూనే ఉన్నాం. మీతీల మీద ఓ దారుణం జరిగి, వారు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నందువల్లనే కేంద్ర హోంమంత్రి మళ్ళీ మణిపూర్ గురించి ఆలోచిస్తున్నారని, ఇంతకాలమూ గిరిజనులమీద ఎన్ని అఘాయిత్యాలు జరిగినా ఢిల్లీకి పట్టలేదని కుకీ సంఘాలు విమర్శిస్తున్నాయి. తమపై దాడులకు పాల్పడుతున్న మిలిటెంట్ గ్రూపులను నిర్దాక్షిణ్యంగా అణచివేసి తమను కాపాడాలని మీతీల అభ్యర్థనమేరకు ఇప్పటికే వందలాదిమంది సైనికులు అక్కడ ఉన్నప్పటికీ, మరిన్ని అదనపు బలగాలను తరలించాలని కేంద్రం నిర్ణయించింది.

ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో, బీరేన్‌సింగ్ ప్రభుత్వానికి ఇంతకాలమూ అండగా నిలబడిన రెండు పార్టీలు—ఇద్దరు ఎమ్మెల్యేలున్న కుకీ పీపుల్స్‌పార్టీ, ఏడుగురు ఎమ్మెల్యేలున్న నేషనల్ పీపుల్స్ పార్టీ—మద్దతు ఉపసంహరించుకున్నాయి. శాంతిస్థాపనలో బీరేన్ సింగ్ విఫలం చెందారని, ఆయన ఏలుబడిలో శాంతి దక్కదని తేలిపోయిందని ఎన్పీపీ అధినేత జూనియర్ సంగ్మా అంటున్నారు. కూటమినుంచి ఎప్పుడు తప్పుకోవాలన్నది ఆయన ఇష్టం కానీ, ఇంతకాలమూ బీరేన్‌మీద ఆయనకు అంత నమ్మకం ఉండటమే ఆశ్చర్యం. అరవైమంది సభ్యులున్న మణిపూర్‌లో సొంతబలం ముప్పై[illegible]పున్న బీజేపీకి ఇలా ఏవో కొన్నిపార్టీలు కూటమిని వీడిపోయినా పెద్ద తేడా ఏమీ రాదు. కానీ, బీరేన్‌ను తప్పించాలన్న డిమాండ్ గతంతో పోల్చితే ఇటీవల సొంతపార్టీలోనే బాగా హెచ్చిన మాట వాస్తవం. కనీసం ఇరవైమంది బీజేపీ ఎమ్మెల్యేలు బీరేన్‌కు వ్యతిరేకంగా ఉన్నారని, జాతీయ అధ్యక్షుడికి కూడా వారు లేఖరాశారని, సంతకం చేసినవారిలో స్పీకర్ కూడా ఉన్నారని వార్తలు వచ్చాయి. ఇప్పటి హింస నేపథ్యంలో, మరిన్ని బలగాలను పంపుతూ కుకీ–జోమీ తెగలవారిని అదుపులో ఉంచడం, వారిలో ఆత్మరక్షణకోసం ఆయుధాలు పట్టినవారినీ, అసలైన మిలిటెంట్లనూ ఊచకోతకోయడం వినా, బిరేన్‌ను తప్పించాలన్న డిమాండ్‌కు బీజేపీ అధిష్ఠానం లొంగిరాకపోవచ్చు. బీరేన్‌ను తప్పించి, ఎవరిని కూచోబెట్టినా పరిస్థితుల్లో మార్పు వస్తుందని, ఈ ఉద్రిక్తతలు కొంతమేరకు తగ్గుతాయని బీజేపీ అధిష్ఠానానికి తెలియకపోదు. కానీ, జాతుల మధ్య చిచ్చుపెట్టి మానవహననానికి దారులు పరిచిన బీరేన్ లేకపోతే ఈ ఈశాన్యరాష్ట్రంలో వారు అనుకున్న ఎజెండాలు నెరవేరవు. ఎప్పుడు హింస జరిగినా, విపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా, మణిపూర్ చల్లారుతోందనీ, అగ్నికి ఆజ్యం పోయవద్దనీ హోంమంత్రి హితవు చెబుతూంటారు. ఆరునెలల క్రితం కాబోలు, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యల నేపథ్యంలో, మీతీ–కుకీ వర్గాల మధ్య వైమనస్యాలు తొలగించేందుకు ప్రత్యేక కృషి ఆరంభమవుతుందని ప్రకటించారు. కానీ, పరిస్థితుల్లో ఏ మార్పూ కనిపించడం లేదు. కశ్మీర్‌కు కూడా పోయి ఓట్లు అడిగినవారు మణిపూర్‌లో ఎందుకు కాలూనడంలేదో మనకు తెలియనిదేమీ కాదు.

ట్రంప్ 2.0: వాణిజ్య యుద్ధాలే!

వ్యాకరణం బోధిస్తూ మా తెలుగు టీచర్ 'రావణుణ్ణి శ్రీరాముడు చంపాడు' అని ఉదహరించిన వాక్యం ట్రంప్ ఎన్నిక సందర్భంగా గుర్తు వస్తోంది. రాముడు 'కర్త', రావణుడు 'కర్మ', 'చంపాడు' క్రియ. ఈ వ్యాకరణ విశేషాన్ని అమెరికా అధ్యక్ష ఎన్నిక ఫలితాల ప్రచార సరళికి వర్తింపజేస్తే ట్రంప్ కర్త అవుతాడు. అయితే అది సత్యం మాత్రం కాదు. 'ట్రంప్ అనూహ్యమైన విజయం సాధించాడు', 'ప్రత్యర్థి డెమొక్రటిక్ పార్టీ ఓట్ బ్యాంకుని సైతం కొల్లగొట్టాడు', 'ఏ స్త్రీలు, మైనార్టీలకూ, వలస కార్మికులకూ, నాన్ వైట్ జాతులకు వ్యతిరేకమో వాటి ఓట్లు సైతం కొల్లగొట్టి విజేతగా నిలిచాడు' అని పబ్లిసిటీ జరుగుతోంది. పై లెక్కన డొనాల్డ్ ట్రంప్ 'కర్త', కమలా హారిస్ 'కర్మ', ఓటమి 'క్రియ'!

మరో ప్రచార సరళి చూద్దాం. 'అనూహ్య ఆధిక్యతతో ట్రంప్ గెలిపించబడ్డాడు', 'ప్రత్యర్థి పార్టీ ఓట్లు సైతం బదిలీ చేయబడ్డాయి', 'ఆటుపోట్లకి గురైన ట్రంప్‌ని నిలబెట్టి విజేతగా మార్చింది', 'ఏ వర్గాలకు వ్యతిరేకంగా దూషణలకు ట్రంప్‌ని ప్రేరేపించిందో అదే వర్గాల ఓట్లు వేయించింది'. ఈ ప్రకారం ట్రంప్ 'కర్మ'గా మారతాడు. ఓటమి క్రియే! ఇది కర్త లేని 'రావణుడు చచ్చెన్' వంటి వాక్యం. నిజానికి ట్రంప్ సాధించిన విజయం కాదిది. ట్రంప్‌కి చేకూర్చబడ్డ విజయం. ఈ రెండో ప్రచార సరళిలో కర్త అదృశ్యశక్తిగా ఉంటుంది. అదే అమెరికా పెట్టుబడి! పైగా టీ పార్టీ ఉద్యమంగా మొదలై 'మన అమెరికాని మళ్ళీ గొప్పరాజ్యం చేద్దాం' అనే ఉద్యమాన్ని తెర వెనక నుండి నడిపిస్తున్న పెట్టుబడిలోని ఓ కొత్త శిబిరం.

అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ రెండవసారి ఎన్నిక వర్తమాన ప్రపంచాన్ని తీవ్ర కుదుపునకు గురిచేసింది. ట్రంప్ మొదటి ప్రభుత్వ పాలన బాధిత సమూహాలుగా మారిన శ్రేణులు కూడా రెండోసారి ట్రంప్ గెలుపునకు సాయం చేయడం విస్మయం కలిగించేదే. ఇది అమెరికాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ట్రంప్ వ్యతిరేక రాజకీయ శక్తుల దృష్టిలో సైతం అనూహ్య ఫలితమే. అయితే ఆ గెలుపు 78 ఏండ్ల ట్రంప్ వ్యక్తిగత ఘన విజయంగా సాగే ప్రచార సరళి వాస్తవ విరుద్ధమైనది. ట్రంప్ వ్యక్తి కాదు. ట్రంప్ పార్టీ స్వతంత్ర రాజకీయ సంస్థ కాదు. ఆయన పార్టీ అమెరికా పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తోంది. అది చేపట్టిన వ్యూహం, ఎత్తుగడలకి దక్కిన విజయం. అది ఒక వ్యక్తికి అంటగట్టడం సరికాదు. వ్యక్తిగతంగా సమర్థుడైనా వ్యక్తిగత విజయం కాదు. ట్రంప్‌ని పోటీలో నిలబెట్టి గెలిపించిన పెట్టుబడిదారీ వర్గం సాధించిన విజయమది.

అమెరికా రాజ్య వ్యవస్థ ద్విముఖ స్వభావం గలది. బయటకి కనబడే రాజ్యం (ఓపెన్ స్టేట్) వెనక చీకటి రాజ్యం (డీప్ స్టేట్) ఉంది. సాధారణంగా అమెరికా ప్రభుత్వ విధానం రెండు పార్టీల మధ్య వైరుధ్యాలతో కూడింది. ఆ వివాదం ఓపెన్ స్టేట్‌కే పరిమితం. కానీ బాహ్య వివాదాలకి అతీతంగా డీప్ స్టేట్ గాఢ ఐక్యతని ప్రదర్శిస్తుంది. ఆఫ్ఘానిస్తాన్, ఇరాక్ దురాక్రమణల నుండి ఇరాన్, సిరియా, క్యూబా, ఉత్తర కొరియాతో కయ్యం దాకా ఐక్యత ప్రదర్శించింది. ఆ డీప్ స్టేట్‌లోనూ విభజన వస్తుండడం నేటి కొత్త మాట! దాని రాజకీయ ప్రతిబింబమే ట్రంప్. దేశాల మధ్య సరిహద్దుల్ని చెరిపి, సుంకాల్ని రద్దుచేసి ప్రపంచాన్ని ఓ కుగ్రామంగా మార్చిన ప్రపంచీకరణతో మరింత బలపడగలనని అమెరికా పెట్టుబడిదారీ వర్గం 1990 దశకంలో అంచనా వేసింది. తనకు కలిసొచ్చిన అంతర్జాతీయ పరిస్థితిని సద్వినియోగం చేసుకుంది. సోవియట్ యూనియన్ పతనాన్ని అవకాశంగా ఎంచుకొని సరిహద్దులు లేని కొత్త ప్రపంచ వ్యవస్థ (న్యూ వరల్డ్ ఆర్డర్) స్థాపనకు పూనుకున్నది. అదే ప్రపంచీకరణ ప్రక్రియ! అందులో భాగమే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో).



నేటి నిర్దిష్ట పరిస్థితుల్లో అమెరికా అధిక సుంకాలు విధించి చైనా, భారత్ వంటి దేశాలతో తీవ్ర వాణిజ్య యుద్ధానికి దిగి ప్రపంచ వాణిజ్య సంస్థకి స్వస్తి చెబితే యుద్ధాలు లేని పరిస్థితి నెలకొంటుందా? నేటి ప్రాంతీయ యుద్ధాల స్థానంలో మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందా?

తమ ఆర్థిక సామ్రాజ్య విస్తరణ కోసం, రాజకీయ సామ్రాజ్య పటిష్ఠత కోసం, తుదకు సైనిక సామ్రాజ్య ఆధిపత్యం కోసం, అంటే ఏకధ్రువ ప్రపంచ వ్యవస్థ స్థాపనకై నాటి అమెరికా పెట్టుబడిదారీవర్గం నడుం కట్టింది. అది జార్జి బుష్‌ని శక్తిమంతమైన రాజకీయ ప్రతినిధిగా మార్చుకుంది. నాడు బుష్ సర్కార్‌తో యుద్ధాలను చేయించింది. అమెరికా పెట్టుబడి కర్త, బుష్ కర్మ కాగా, యుద్ధాలు క్రియగా మారింది. కానీ బయటకు బుష్ కర్తగా పేరొందాడు. వాస్తవ కర్త కనుమరుగైనది. చరిత్ర పునరావృతం అవుతోంది. నేడు ట్రంప్ కూడా కర్తగానే పేరొందాడు. వాస్తవ కర్త తెరమరుగైనది. ఆ కర్త గూర్చి తెల్సుకుందాం.

అమెరికా పెట్టుబడిదారీ వర్గం డబ్ల్యూటీవోతో తలచింది ఒకటి. జరిగింది మరొకటి. ఆ సంస్థ అమెరికా కొంప ముంచింది. ఆఫ్ఘాన్, ఇరాక్ యుద్ధాల్లో అమెరికా దిగబడ్డ కాలంలో ప్రపంచ వాణిజ్య సంస్థను చైనా ఒక వరంగా మార్చుకొని బలపడ్డది. అది 150 దేశాల భాగస్వామ్యంతో బెల్టు అండ్ రోడ్ ఇనిషియేటివ్ పేరిట తలపెట్టిన అంతర్జాతీయ వాణిజ్య కారిడార్ అమెరికా ఆర్థిక సామ్రాజ్యానికి ఓ సవాల్‌గా మారింది. నాటి నుండే డబ్ల్యూటీవో పట్ల అమెరికా పెట్టుబడిదారీ వర్గంలో విబేధాలు మొదలై చీలికకి బీజం పడింది. క్రమంగా అది డీప్ స్టేట్‌లో చీలికకి కూడా దారి తీసింది. ప్రపంచ వాణిజ్య సంస్థతో తాము పొందే లాభం కంటే చైనా అధిక లాభపడుతుందనే భావన అమెరికా పెట్టుబడిదారీ వర్గంలోని ఒక శిబిరంలో బలపడుతూ వచ్చింది. అదే సమయంలో నేటికీ అమెరికా పెట్టుబడిదారీ వర్గంలో ఓ శిబిరం ప్రపంచ వాణిజ్య సంస్థ ద్వారా లాభపడుతోంది. అది డబ్ల్యూటీవో నిబంధనల ప్రకారం చైనాని ఎదుర్కొని జయిద్దామని వాదిస్తోంది. ఆ నిబంధనలకి విరుద్ధంగా చైనాపై వాణిజ్య సుంకాల్ని విధించి వాణిజ్య యుద్ధం చేపడదామని కొత్త శిబిరం వాదిస్తోంది. ఆచరణలో ఇది ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి వైదొలిగే ప్రక్రియకి దారి తీస్తుంది. రెండో శిబిరపు రాజకీయ ప్రతినిధి ట్రంప్! పై కర్త రెండో శిబిరమే.

ట్రంప్ ఆకస్మికంగా ఆకాశం నుండి రాలిపడ్డ తార కాదు, ఊడిపడ్డ ఉల్క అసలే కాదు. వర్తమాన అంతర్జాతీయ రంగంలో పరస్పర విరుద్ధ శక్తుల మధ్య సంఘర్షణలో పుట్టి పెరుగుతున్న తీవ్ర మితవాద రాజకీయ వ్యవస్థకు శక్తిమంతమైన ప్రతినిధి మాత్రమే. ఈ ఎన్నికల్లో 'యుద్ధాలు వద్దు, వాణిజ్యం ముద్దు' అన్న ట్రంప్ నినాదంలో వాస్తవ శాంతి లేదు. అది నాటి బుష్ యుద్ధోన్మాద విధానానికి వ్యతిరేకమూ కాదు. అమెరికాకి ప్రపంచ వాణిజ్య సంస్థతో లాభం జరక్కముందే తొందరపడి యుద్ధాలకు దిగిందనీ, తద్వారా యుద్ధ ఊబిలో పూర్వ వైభవాన్ని కోల్పోయిందనీ, పూర్వ వైభవం రావాలంటే సైనిక యుద్ధాల కంటే వాణిజ్య యుద్ధాల తొలి అవసరం ఉందని ఈ రెండో శిబిరం వాదిస్తోంది. ఇది ప్రపంచ వాణిజ్య సంస్థతో అమెరికా కంటే చైనా వంటి ఆర్థిక వ్యవస్థలు బలపడ్డ స్థితి నుండి గుణపాఠం. అమెరికా అప్పుల కొంపగా మారడానికి కారణమైన సైనిక యుద్ధాల్ని వెంటనే నిలిపి వాణిజ్య యుద్ధాలపై కేంద్రీకరణ చేద్దామనే ఎత్తుగడలో భాగమిది. అధిక సుంకాలతో చైనా వంటి ఆర్థిక వ్యవస్థలపై నిరాయుధ యుద్ధాలతో డబ్ల్యూటీవో విచ్ఛిన్నమైనా వెనకాడకూడదని కూడా ఈ శిబిరం వాదిస్తోంది.

ఆఫ్ఘాన్, ఇరాక్‌లపై యుద్ధాల వల్ల అమెరికా పౌర సమాజంలో పెరిగిన వ్యతిరేకత ఆధారంగా ఈ శిబిరం ట్రంప్ యుద్ధ వ్యతిరేకిగా ఫోకస్ చేసే వ్యూహం పన్నింది. బుష్‌తో అమెరికా పెట్టుబడి ఏకగ్రీవశక్తిగా నిలిచి నాడు ప్రాంతీయ యుద్ధాలను చేయిస్తే, నేడు అందులో ఓ శిబిరం వేరుపడి మూడో ప్రపంచ యుద్ధానికి పూర్వ రంగ స్థితిని ట్రంప్‌తో సృష్టించజూస్తోంది.

సామ్రాజ్యవాదానికి లెనిన్ పేర్కొన్న ఐదు లక్షణాల్లో అవి వెనకబడ్డ దేశాలకు సరుకులకు బదులు పెట్టుబడిని ఎగుమతి చేయడం! ఆ ఎగుమతైన పెట్టుబడి ఆ దేశాల్లో చౌక శ్రమశక్తితో సరుకుల్ని ఉత్పత్తి చేయడం కూడా అందులో భాగమే. తమ స్వంత దేశాల్లో సరుకులు, సేవల ఉత్పత్తుల కోసం వెనకబడ్డ దేశాల నుంచి చౌక శ్రమశక్తిని దిగుమతి చేసుకోవడానికి కూడా అది దారి తీస్తుంది. ఇవి వాటి సహజ లక్షణాలే. వాటికి వ్యతిరేకంగా తమ దేశానికి పరిశ్రమల్ని తెచ్చి సరుకుల ఉత్పత్తుల దేశంగా మార్చి, విదేశీ చౌక శ్రామికుల దిగుమతి నియంత్రణని, తద్వారా 'గ్రేట్ అమెరికా' నిర్మాణం చేస్తాననీ ట్రంప్ హామీ ఇచ్చాడు. రోజుకు ఐదారు డాలర్ల జీతం గల దేశాల నుంచి గంటకి పది, ఇరవై డాలర్ల జీతాలు గల అమెరికాకి తెస్తాననడం ఆచరణలో కాలచక్రాన్ని అడ్డుకోవడమే. అదో భ్రమ. తాత్కాలికంగా విదేశీ సరుకుల్ని దిగుమతి కాకుండా అధిక సుంకాల ద్వారా అడ్డుకోవచ్చు. అదే సమయంలో అధిక జీతాల స్వదేశీ కార్మికులతో పని చేయించే ప్రయత్నానికి అమెరికా పెట్టుబడిదారీ వర్గం నుండే తిరుగుబాటు రావచ్చు. పైగా ఎక్కువ ఉత్పాదక ఖర్చులతో ఉత్పత్తి చేసిన సరుకుల్ని కొనే స్తోమతు లేని స్వదేశీ ప్రజా వ్యతిరేకత వెల్లువగా మారవచ్చు. ఇలా ట్రంప్ సర్కార్ సామ్రాజ్యవాద ఆర్థిక నియమాలకు వ్యతిరేకంగా కాలప్రవాహ దిశను మార్చజూస్తే వాటి చక్రాల క్రింద నలిగిపోక తప్పదు. యుద్ధాలకు వ్యతిరేకంగా ట్రంప్‌తో వల్లింపజేసే నేటి 'శాంతి' ప్రవచనాలు రేపు గాలిలో దీపాలుగా మారి ప్రపంచ యుద్ధానికి కూడా దారి తీసే ప్రమాదం లేకపోలేదు.

చరిత్ర గమనంలో అనేక మహా సామ్రాజ్యాలు కాలగర్భంలో కలిసాయి. ప్రాచీన రోమన్, ఆధునిక పోర్చుగీస్, స్పెయిన్, బ్రిటన్, ఫ్రాన్స్, సోవియట్ యూనియన్ వరకూ అగ్రరాజ్యాలు అంతరించి పోయాయి. నేడు అమెరికా వంతు వచ్చింది. దాన్ని పూర్తి చేసే రాజకీయ బాధ్యత ట్రంప్ భుజస్కంధాలపై చరిత్ర మోపిందేమో!

నేటి నిర్దిష్ట పరిస్థితుల్లో అమెరికా అధిక సుంకాలు విధించి చైనా, భారత్ వంటి దేశాలతో తీవ్ర వాణిజ్య యుద్ధానికి దిగి ప్రపంచ వాణిజ్య సంస్థకి స్వస్తి చెబితే యుద్ధాలు లేని పరిస్థితికి దారి తీస్తుందా? లేదంటే నేటి ప్రాంతీయ యుద్ధాల స్థానంలో ప్రపంచ యుద్ధ పూర్వరంగ పరిస్థితికి దారి తీస్తుందా? ఇది నేటి చర్చనీయాంశం. చరిత్ర గమనం ఏఏ మలుపులు తీసుకుంటుందో వేచి చూద్దాం.

◆ పి. ప్రసాద్
భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టు)

రెండో రాజధాని స్థాయికి చేరువైన వరంగల్

వరంగల్! — కాకతీయుల రాజధానిగా ప్రసిద్ధికెక్కిన ప్రాంతం. ధిక్కార సంస్కృతికి ప్రతీకగా నిలిచిన నేల. పోతన కాలం నుంచీ మొదలుకొని సమ్మక్క సారలమ్మ సాలులో, రాణి రుద్రమ ధీరత్వంతో, దొడ్డి కొమురయ్య చాకలి ఐలమ్మల పోరాట పటిమతో, ప్రజాకవి కాళోజీ అడుగుజాడల్లో ప్రశ్నించడమే పరమావధిగా వర్ధిల్లిన నేల. ఇప్పుడు వరంగల్ తన ప్రశస్తి మరింత ఇనుమడించే బాటలో అడుగులు వేస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఈ నగరం తెలంగాణ రెండో రాజధానిగా ఎదుగుతున్నది. గత దశాబ్ద కాలపు చీకటి రోజులను మరిచి అభివృద్ధి పథంలోకి అడుగేస్తున్నది.

చరిత్ర అవలోకనం, సంస్కృతి పరిరక్షణ చర్యలు, అభివృద్ధి చర్యలలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, ముందుతరాలకు ఉపయోగపడే రీతిలో మౌలిక వనరులను మలచుకోవడం.. ఈ చర్యలన్నింటినీ ఇప్పటి ప్రభుత్వం సమగ్రంగా చేపడుతున్నది. కాకతీయుల కాలం నాటి సేద్యపు నీటి వనరుల పరిరక్షణ యజ్ఞాన్ని తనదైన శైలిలో రేవంతన్న సర్కారు ముందుకు తీసుకుపోతున్నది. అభివృద్ధి రంగంలో వరంగల్‌ను ముందువరుసలో నిలిపే చర్యలు చేపడుతున్నది. ఒక ప్రాంతం సమగ్ర ప్రగతిని సాధించాలంటే— విద్య, వైద్యం, ఉపాధి రంగం, రహదారులు, రవాణా వ్యవస్థ ఇవన్నీ మెరుగుపడాలి. ఈ లక్ష్యాన్ని ఆచరణలో వాస్తవికం చేసి, తద్వారా వరంగల్‌ను ప్రగతి పథంలో ఆశించిన స్థాయికి తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నడుం కట్టింది. ఇందులో భాగంగానే ఇవ్వాళ వరంగల్‌లో ప్రజాకవి కాళోజీ కళాక్షేత్రం ఆరంభం అవుతున్నది. ఈ కళాక్షేత్రాన్ని ప్రారంభించడం ద్వారా పద్మవిభూషణ్ కాళోజీకి ఘనమైన రీతిలో నివాళులర్పిస్తున్నది ప్రభుత్వం. రాజకీయ రంగానికి వరంగల్ చేస్తున్న సేవలను ప్రస్ఫుటం చేసే ఈ ఆవిష్కరణతో ఈ నగరం తెలంగాణలో తనదైన స్థానాన్ని నిలుపుకోనున్నది.



పదేళ్లు గడిచిన తరువాత వరంగల్ నగరంలో నేడు ఒక కదలిక వచ్చింది. అభివృద్ధిని పరమావధిగా ఎంచుకున్న సర్కారు చేపడుతున్న చర్యలతో నగర పౌరుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇది వరంగల్ తెలంగాణకు రెండో రాజధానిగా ఎదుగగలిగే అపురూప తరుణం. ఈ అభివృద్ధి ఫలాలను ఒడిసి పట్టుకుందాం. అభివృద్ధిని ఆకాంక్షించే అందరం ఈ సందర్భాన్ని ఆహ్వానిద్దాం.

అభివృద్ధి ఒక నిరంతర ప్రక్రియ. పథకాలు, ఆ పథకాల ఆచరణకు వేసే ప్రణాళికలు, ఆ ప్రణాళికలకు క్రియాశీలమైన రీతిలో దారులూ వేసినప్పుడే ఒక ప్రాంత సమగ్రాభివృద్ధి సవ్యంగా జరుగుతుంది. కళలకు, సంస్కృతికి ప్రతీక అయిన వరంగల్ తెలంగాణలోని ప్రముఖ విద్యాకేంద్రంగా విలసిల్లుతూ వచ్చింది. వరంగల్ ప్రాధాన్యతను ఇక్కడి ప్రతిష్ఠాత్మక జాతీయ శాస్త్ర సాంకేతిక విషయాల సంస్థ (నిట్) జాతీయ స్థాయిలో నిలబెడుతున్నది. అలాగే ఇక్కడి కాకతీయ విశ్వవిద్యాలయం, వైద్య విద్యాసంస్థలు, ఉపాధి రంగంలో అవకాశాలను విస్తరింపజేసే పరిశ్రమలు, నైపుణ్య సంస్థలు వరంగల్‌ను తెలంగాణ పటంలో ప్రముఖంగా ఉంచుతున్నాయి. ఇలాంటి వరంగల్ నగరం ఒక దశాబ్ద కాలంగా గత ప్రభుత్వ అలసత్వం వలన వెనుకపట్టు పట్టి దీనస్థితికి నెట్టి వేయబడింది. అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామని చెబుతూనే వాటికి సంబంధించిన పనులను క్రియాశీలమైన రీతిలో అమలుపర్చకపోవడం వల్ల ఈ నగరం ఒక దశాబ్దం వెనుకబడ్డది. ఈ నగర ప్రాముఖ్యతను తగ్గించే రీతిలో వరంగల్‌ను ఆరు జిల్లాలుగా విభజించిన అప్పటి పాలకులు ఇక్కడి అభివృద్ధిని కనీసం పట్టించుకోలేదు.

పదేళ్లు గడిచిన తరువాత వరంగల్ నగరంలో నేడు ఒక కదలిక వచ్చింది. అభివృద్ధిని పరమావధిగా ఎంచుకున్న సర్కారు చేపడుతున్న చర్యలతో నగర పౌరుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటిదాకా అరకొర పనులతో అసంపూర్ణంగా ఉన్న కాళోజీ కళాక్షేత్రం నేడు సమగ్రతను సంతరించుకున్నది. కాళోజీ తరహా ప్రజల పక్షాన నిలిచే ఆవేదనలకు ఇప్పుడొక జవాబు దొరకబోతున్నది. సమాజం ముందుకు వెళ్లే దశలో ఎదురైన అవాంతరాలను తన మనాదిగా భావిస్తూ 'నా గొడవ'లో అక్షరీకరించిన కాళోజీ భావనలకు సమాధానం దొరికే ప్రయత్నాలకు అంకురార్పణ జరుగుతున్నది.

ఆశించిన రవాణా సౌకర్యాలు లేక అంతర్జాతీయ వాణిజ్య రంగానికి ఉత్పత్తులను చేరవేయడంలో ఆపసోపాలు పడిన వరంగల్‌కు ఎయిర్ పోర్టు సదుపాయం కలుగుతున్నది. మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉత్పత్తయ్యే అంతర్జాతీయ స్థాయి ఉత్పత్తులను తరలించేందుకు అనువైన రీతిలో ఈ విమాన రవాణా వ్యవస్థ అందుబాటులోకి రానున్నది. ఎయిర్ పోర్టు కోసం భూ సేకరణ ఉత్తర్వులు నవంబర్ 17న జారీ అయ్యాయి. ఈ ఎయిర్ పోర్టు వాణిజ్య ప్రపంచంలో వరంగల్‌కు స్థానం కల్పించడంతో పాటు ఇక్కడ లభించిన విద్య ఊతంగా సాంకేతికంగా తమ ప్రతిభను చాటుకుంటున్న కొత్త తరాలకు ప్రపంచ దేశాల్లో విస్తరించగలిగే అవకాశాలను మెరుగుపరచనున్నది.

రోడ్లు ఒక ప్రాంత ప్రగతికి చిహ్నాలు. ఇక్కడే ప్రాతినిధ్యం వహించి ప్రధానమంత్రి స్థాయికి ఎదిగిన పీవీ నరసింహారావు హయాంలో వరంగల్ ద్వారా అనేక జాతీయ రహదారుల రూపకల్పన జరిగింది. ప్రస్తుత ఆచరణశీల ప్రభుత్వ హయాంలో వాటి విస్తరణ కార్యరూపం దాలుస్తున్నది. విద్యా వైద్య రంగం కూడా వరంగల్ ప్రాముఖ్యతను విస్తరిస్తున్నది. వరంగల్ హెల్త్ హబ్‌గా మారుతున్నది. బొగ్గు గనులు, థర్మల్ యూనిట్‌తో ఉపాధి రంగ విస్తరణ జరుగుతున్నది. సాఫ్ట్‌వేర్ రంగం అభివృద్ధి వరంగల్‌ను సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్తున్నది. అలాగే— దశాబ్దాలుగా కలగా మిగిలిన వ్యాగన్ పరిశ్రమ ఇప్పుడు కోచ్ ఫ్యాక్టరీగా రూపొందగలిగే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి.

వరంగల్ త్రినగరి నగరానికి న్యూక్లియస్. దీనికి అధునాతన సౌకర్యాలను కలిపించటమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. ముఖ్యమంత్రి వరంగల్ నగర డ్రైనేజ్ వ్యవస్థ ఆధునీకరణ కోసం నాలుగు వేల కోట్ల వ్యయంతో చేపట్టే పనులకు అనుమతి ఉత్తర్వులు జారీ చేయటం వరంగల్ ప్రగతి పయనంలో మరో ముఖ్య భాగం. ఇది వరంగల్ తెలంగాణకు రెండో రాజధానిగా ఎదుగగలిగే అపురూప తరుణం. ఈ అభివృద్ధి ఫలాలను ఒడిసి పట్టుకుందాం. అభివృద్ధిని ఆకాంక్షించే అందరం ఈ సందర్భాన్ని ఆహ్వానిద్దాం.



• డాక్టర్ కడియం కావ్య
ఎంపీ, వరంగల్
(నేడు సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా)

అవసాన దశలో గ్రంథాలయాలు!

ఉభయ తెలుగు రాష్ట్రాలలోని గ్రంథాలయాల పరిస్థితి చూస్తుంటే అవి అవసాన దశలో ఉన్నట్లు స్పష్టమవుతోంది. గ్రంథలయాలు శాశ్వతంగా మూతపడే అవకాశం కూడా ఉంది. వేలాది కోట్ల రూపాయల విలువైన గ్రంథాలయ భవనాలు, గ్రంథాలు, ఫర్నిచర్ ఇతర వస్తువులు నిస్తేజంగా పడియున్నాయి. కొంతమంది పెద్దలు తమ ఆస్తిని తమ సంతానంతో సమానంగా గ్రంథాలయాలకూ పంచారు అనే విషయం జగద్వితం.

1984లో ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత రూ.2 కిలో బియ్యం ప్రచారం నిమిత్తం మండలానికి ఒక గ్రంథాలయం స్థాపించారు. భవనాలు కూడా నిర్మించారు. ఆ విధంగా గ్రంథాలయాల సంఖ్య పెరిగి కొంతవరకు సీఎల్ఐఎస్‌సీ, బీఎల్ఐఎస్‌సీ పాసైన నిరుద్యోగులకు భుక్తి కల్పించారు. ఆ కాలంలో గ్రంథాలయాలకు మంచి ఊపు వచ్చింది.

గ్రంథాలయ ఉద్యోగుల జీతభత్యాలు ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉండేవిధంగా 1970వ దశకంలో ముఖ్యమంత్రి వెంగళరావు ఏర్పాటు చేసియున్నారు. అప్పటి వరకు గ్రంథాలయ సెస్సు, ప్రభుత్వ గ్రాంటు మీదే ఆధారపడి గ్రంథాలయాలు, వాటి సిబ్బంది ఆధారపడి ఉండేవారు.

సుమారు 15 నుండి 20 సంవత్సరాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు గ్రంథాలయ సెస్సును జిల్లా గ్రంథాలయాలకు జమచేయడం లేదు. కేవలం ప్రభుత్వం ఇచ్చే గ్రాంటుమీదే ఉద్యోగస్థులు, పెన్షనర్స్ బ్రతుకుతున్నారు. మరో ఆదాయం లేదు.

గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్‌లో నేడు రూ. 1000 కోట్ల గ్రంథాలయ సెస్ బకాయిలు పేరుకొనిపోయినవి. ఖమ్మం, నల్గొండ, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ వంటి నగరాలు గ్రంథాలయాల సెస్‌ను ఆయా జిల్లాల సంస్థలకు జమచేయడం లేదు.

ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, ఏలూరు, కాకినాడ, మచిలీపట్నం, విజయనగరం, శ్రీకాకుళం వంటి నగరాలు కూడా సుమారు రూ. 1000 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. 80 మునిసిపాలిటీలు మరో రూ. వెయ్యికోట్ల వరకు బకాయిలు ఉన్నాయి.

ఇవన్నీ ఆంధ్ర, తెలంగాణలో ఉన్న జిల్లా గ్రంథాలయాల సంస్థలకు 010 జీఓ ద్వారా జమైతే వెనుతిరిగి చూడవలసిన పనిలేదు. సుమారు నాలుగువేల కోట్ల రూపాయలు, వాయిదాల మీద కట్టినా, దఫదఫాలుగా కట్టినా గ్రంథాలయోద్యమం బ్రతికి బట్టకడుతుంది. గ్రంథాలయ సెస్సు కట్టాలనే జీఓ ఉన్నా కట్టకపోతే తగిన ప్రతిచర్యలు లేక గ్రంథాలయాల ఆర్థిక పరిస్థితి దిగజారుచున్నది.

జిల్లా గ్రంథాలయ సంస్థలలో సిబ్బంది కరువై రెండు గ్రంథాలయాలకు ఒక ఉద్యోగి (వారానికి మూడురోజులు) పనిచేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని 100 గ్రంథాలయాల్లో గతంలో 230 మంది పనిచేయగా ప్రస్తుతం 50 మంది పనిచేస్తున్నారు. మరికొంత మంది రిటైర్డ్ అయితే కొత్త రిక్రూట్‌మెంట్ లేదు. కొత్త గ్రంథాలయాలు లేవు. ఇలానే కొనసాగితే భావిభారత పౌరులకు చేతిలో పుస్తకం అనేది ఉండదు.

–గంధం అప్పారావు, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం మాజీ కార్యదర్శి

ఎవరి కోసం ఈ స్కిల్ యూనివర్సిటీ!?

తెలంగాణ ప్రభుత్వం ప్రైవేట్- పబ్లిక్- భాగస్వామ్య పద్ధతిలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసింది. యువతలో సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసి ఉద్యోగాలు కల్పించాలనే సంకల్పంతో యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వం చెపుతున్నది. అదాని, రెడ్డి లాబ్స్, మహీంద్ర, ఫ్లిప్‌కార్ట్, జి.ఎం.ఆర్, హెచ్.ఎస్.బి.సి., అపోలో లాంటి కార్పొరేట్ కంపెనీలు భాగస్వాములుగా చెబుతున్న ఈ యూనివర్సిటీకి ఆనంద్ మహీంద్రా ఛైర్మన్.

ఈ ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంలో కంపెనీల పాత్ర స్పష్టంగా లేదు. యూనివర్సిటీ కోసం అయ్యే మొత్తం పెట్టుబడిలో ఈ కంపెనీల వాటా ఎంత? ఇన్‌ఫ్రా[illegible]ర్ ఎంతవరకు కల్పిస్తారు? ఈ కంపెనీలు ఒక్కొక్కటీ రాబోయే ఐదేళ్లలో ఒక్కొక్క సంవత్సరం ఎన్ని ఉద్యోగాలు కల్పిస్తాయి? ఎటువంటి ఉద్యోగాలు కల్పిస్తాయి? నిర్దిష్టంగా ఈ యూనివర్సిటీ స్థాపనలో ఏయే కంపెనీలు భాగస్వాములవుతున్నాయి? అనే విషయాల మీద సమాచారం లేదు. అయితే ఈ భాగస్వామ్యంలో ప్రభుత్వం పాత్ర స్పష్టంగానే ఉంది. ప్రభుత్వం ఈ యూనివర్సిటీకి కావలసిన సుమారు 57 ఎకరాల భూమిని కేటాయించింది. భవనాలను నిర్మించడానికి రూ.100 కోట్లు ఖర్చు పెడుతున్నది. రోడ్లు, విద్యుత్తు, నీరు మొదలైన మౌలిక వసతులను ఉచితంగా కల్పిస్తున్నది. యూనివర్సిటీ నడవడానికి కావలసిన తాత్కాలిక క్యాంపస్‌ను గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో, హైటెక్ సిటీలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన[illegible]లో ఏర్పాటు చేశారు. వచ్చే మూడేళ్ళకు అయ్యే మొత్తం పునరావృత ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుంది. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం అంటే ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పడం కాదా?

ఈ యూనివర్సిటీలో 17 రకాలైన కోర్సులు ప్రవేశపెడుతున్నారు. ఈ–కామర్స్, హెల్త్ కేర్, ఫార్మస్యూటికల్ అండ్ లైఫ్ సైన్సెస్, బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, కన[illegible] మొదలైన అధ్యయన సముదాయాలు (స్కూల్స్) ప్రారంభిస్తున్నారు. ఇటువంటి కోర్సులను ప్రవేశపెట్టి యూనివర్సిటీని కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడంలో అంతర్యమేమిటి? ముఖ్యమంత్రితో సహా మంత్రులు దేశ, దేశాలు తిరిగి 19 బహుళ జాతి కంపెనీలను ఆహ్వానించినట్టు వార్తలు వచ్చాయి. అత్యధిక లాభాలే లక్ష్యంగా కలిగిన ఈ స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలు ఇప్పటికే ఆధునీకరణ, యాంత్రీకరణ, కంప్యూటరీకరణల ద్వారా వేలాదిమంది ఉద్యోగులను తీసివేశారు, తీసివేస్తున్నారు. మరోవైపు, కార్పొరేట్ కంపెనీల తరఫున ఇన్ఫోసిస్ అధినేత రోజుకు 8 గంటలు కాదు 12 గంటలు పని చేయాలని సూచన చేశాడు. అంటే కొత్తగా ఉద్యోగాలను ఇవ్వడం అటుంచి, ఉన్న ఉద్యోగులను ఇంటికి పంపించాలనే ఉచిత సలహా ఇచ్చాడు. పైగా కృత్రిమ మేధస్సు అమలు చేయడం వలన రాబోయే కాలంలో నిరుద్యోగం ఇంకా తీవ్రతరం అవుతుంది. ఈ కోర్సుల ఉద్దేశం అతి తక్కువ వేతనాలతో, సామాజిక భద్రత లేని అవుట్‌సోర్సింగ్, కాన్ట్రాక్ట్ పద్ధతిలో అసంఘటిత కార్మికులను సృష్టించడమేనని అర్థమవుతున్నది.

ప్రజల అవసరాలను తీర్చడానికి రాష్ట్రంలో ఉన్న వనరులను ఉపయోగించుకొని ప్రభుత్వ రంగంలోనే వేలాది చిన్న, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేస్తే, వాటికి అవసరమైన నైపుణ్యాలను ఇప్పుడు ఉన్న ఐటీఐలూ పాలిటెక్నిక్‌లలో నేర్పించే విధానం ఉంటే తెలంగాణలో నిరుద్యోగ నిర్మూలన జరిగేది.




1980–1990 కాలంలో చైనా దేశంలో చిన్న పట్టణాలలో, గ్రామాలలో ఉద్యోగ కల్పన ప్రధాన లక్ష్యంగా పెద్ద ఎత్తున టౌన్ అండ్ విలేజ్ పరిశ్రమలు ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా మన దేశంలో కూడ ఉద్యోగ కల్పనే ప్రధాన లక్ష్యంగా చిన్న పట్టణాలలో, గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వమే వేలాదిగా చిన్న కుటీర పరిశ్రమలను స్థాపించి లక్షల సంఖ్యలో ఉద్యోగాలను ఇచ్చే ప్రయత్నం చేస్తే బాగుంటుంది. ఆ అవకాశం కూడా ఉన్నది. వేలాది వ్యవసాయాధారిత పరిశ్రమలను స్థాపించవచ్చు. అలాగే అటవీ సంపద మీద ఆధారపడే పరిశ్రమలను అభివృద్ధి చేయవచ్చు. టూరిజం, కోళ్ల పరిశ్రమ, పూలు, పండ్లు సాగు చేసి అమ్మడం లాంటి రంగాలలో పరిశ్రమలను స్థాపించి రెగ్యులర్ ప్రాతిపదికన, సామాజిక భద్రత కల్పించి, లక్షల సంఖ్యలో ఉద్యోగాలు సృష్టించవచ్చు. ఈ పరిశ్రమల కోసం ఎటువంటి నైపుణ్యాలు కావాలో అటువంటి కోర్సులను ప్రవేశపెట్టవచ్చు. అటువంటిది ఏమీ లేకుండా పైపైన స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి స్వదేశీ, విదేశీ కంపెనీలకు అప్పజెప్పితే ఫలితం శూన్యం.

ఈ యూనివర్సిటీకి ప్రభుత్వం, కార్పొరేట్ కంపెనీల నిధులతోపాటు బ్యాంకుల నుంచి, కార్పొరేషన్ల నుంచి అప్పులు తీసుకుంటారు. దాతలు డబ్బులు ఇస్తే భవనాలు, సెంటర్లు, గదులు, గోడలకు కూడా ఆ దాతల పేర్లు పెడతారు. యూనివర్సిటీ స్వయంపోషకంగా ఉండటానికి వనరులు సేకరించాలని చట్టంలో చెప్పారు. ఇక్కడ ఇచ్చే డిగ్రీలకు, డిప్లమాలకు, సర్టిఫికెట్లకు విద్యార్థుల నుంచి పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేసే అవకాశమూ ఉన్నది. ఎందుకంటే ఇక్కడ ఫీజుల వివరాలు వెల్లడించలేదు. యూనివర్సిటీలోని ఆడిటోరియంలను, క్రీడా ప్రాంగణాలను పెళ్లిళ్లకు, పేరంటాలకు, బర్త్‌డే పార్టీలకు ఇచ్చి నిధులను సమకూర్చుకోవాలని చట్టం సూచించింది. ఇక్కడ అధ్యాపకుల నియామకాలు కాంట్రాక్ట్ పద్ధతిలో జరుగుతాయి. కాంట్రాక్ట్ ఫ్యాకల్టీని నియమించాలని చట్టం బహిరంగంగానే చెప్పింది. స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీ మొదలైన స్కూల్స్‌కు డీన్ మాత్రమే కోర్ ఫ్యాకల్టీగా ఉంటాడు. అంటే మొత్తం స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అంతా ఒకే ఒక్క రెగ్యులర్ ఫ్యాకల్టీ ఉంటాడన్నమాట. మిగతా ఫ్యాకల్టీ అంతా కాంట్రాక్ట్ ఫ్యాకల్టీగా నియమించబడతారు. చాలీచాలని జీతాలతో కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ ఎన్నిచోట్ల పనిచేయవలసి ఉంటుందో, ఫలితంగా ఈ యూనివర్సిటీని వారు ఎంతవరకు పట్టించుకుంటారో ఇప్పటి మన యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల పరిస్థితి చూస్తే అర్థమవుతుంది.

యూనివర్సిటీ పరిపాలన రంగంలో అకడమిక్ కౌన్సిల్ పైనా, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ పైనా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ పెత్తనం జాతీయ విద్యా విధానంలో సూచించిన విధంగా ఉంటుంది. పరిపాలన విభాగంలో బోర్డ్ ఆఫ్ గవర్నర్ అనే విభాగాన్ని సృష్టించి దానికి సర్వాధికారాలను కలుగజేశారు. ఇంతవరకు యూనివర్సిటీలలో అకడమిక్ కౌన్సిల్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, సెనేట్స్ ఉన్నాయి కానీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ అన్నది ఎక్కడా లేదు. ఈ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌కు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నిర్ణయాలను పక్కకు పెట్టడం దగ్గర నుంచి, ఫైనాన్స్ ఆఫీసర్‌ను నియమించడం, రిజి[illegible]ను నియమించడం దాకా అసాధారణ అధికారాలు ఉంటాయి. వైస్–ఛాన్సలర్‌ను కూడా తొలగించే అధికారం దీనికి ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే అకాడమిక్ కౌన్సిల్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామమాత్రమై బోర్డు ఆఫ్ గవర్నర్స్ అనే విభాగం అంతిమ నిర్ణయాధికార సంస్థగా ఉంటుంది. యూనివర్సిటీకి సంబంధించిన సర్వాధికారాలు కలిగిన ఈ సంస్థలో 15 మంది సభ్యులు ఉంటారు. వీరిలో ఏడుగురు సభ్యులు కంపెనీల నుండే ఉంటారు. అటువంటప్పుడు ఇది ఎవరి ప్రయోజనాలు కాపాడుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇక స్పోర్ట్స్ యూనివర్సిటీ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. పాఠశాల స్థాయి నుండి అన్ని వసతులతో కూడిన వ్యాయామ విద్య లేకుండా స్పోర్ట్స్ యూనివర్సిటీని స్థాపించడం అర్థరహితం. రాష్ట్రంలోని వేలాది స్కూళ్లలో పి.ఇటి, పి.డి.లు లేరు. ఆటలకు సంబంధించిన ఆట వస్తువులు కూడా లేవు.

ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం పేరు మీద ఏర్పడిన ఈ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి ప్రభుత్వం ఇచ్చే భూములతోపాటు, ఉచితంగా కల్పించే రోడ్లు, విద్యుత్, నీటి వసతి మొదలైన సౌకర్యాలన్నీ కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం అయినట్టే. ప్రజల అవసరాలను తీర్చడానికి రాష్ట్రంలో ఉన్న వనరులను ఉపయోగించుకొని ప్రభుత్వ రంగంలోనే వేలాది చిన్న, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేస్తే, వాటికి అవసరమైన నైపుణ్యాలను ఇప్పుడు ఉన్న ఐటీఐలూ పాలిటెక్నిక్‌లలో నేర్పించే విధానం ఏర్పాటు చేస్తే తెలంగాణలో నిరుద్యోగ నిర్మూలన జరిగేది. కానీ ఇక్కడ స్కిల్ యూనివర్సిటీ పేరిట కార్పొరేట్ కంపెనీలకు అవసరమైనట్టు సామాజిక భద్రత లేకుండా, తక్కువ జీతాలతో పనిచేసే కొద్దిమంది అసంఘటిత కార్మికుల తయారీ మాత్రమే జరుగుతుంది. దీని గురించి చర్చ జరగాలి.

■ ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్



నేడు పాఠశాలలకు సెలవు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హనుమకొండ జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో మంగళవారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని ఆరు మండలాల్లో పాఠశాలలకు డీఈవోలు సెలవు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి, ధర్మసాగర్, వరంగల్, ఖిలావరంగల్ మండలాల ఎంఈవోలకు డీఈవోలు జ్ఞానేశ్వర్, వాసంతి వాట్సాప్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఈ ఆరు మండలాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశాలు ఉండటంతో సెలవు ప్రకటిస్తున్నట్లు వారు వాట్సాప్ ఆదేశాల్లో పేర్కొన్నారు.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లు అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. దశాబ్దాల తరబడి కలగా మిగిలిన అభివృద్ధి పనుల్లో కదలిక మొదలైంది. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలనే తపనతో ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోంది. దీంతో 50ఏళ్లుగా ఎదురు చూస్తున్న నగర మాస్టర్ ప్లాన్.. 30ఏళ్లుగా పడకేసిన భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థపై మళ్లీ ఆశలు చిగురించాయి. ఎయిర్‌పోర్టు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, మాడవీధులు, కాళోజీ కళాక్షేత్రం కార్యరూపం దాల్చుతున్నాయి. ఇలా ఒక్కొక్కటిగా అభివృద్ధి పనులు పట్టాలెక్కుతుంటే.. మరుగున పడిన నియో మెట్రో రైల్ ప్రాజెక్టు.. మడికొండలో ఐటీ హబ్, సైనికల్ స్కూల్ లాంటి వాటిపై మంగళవారం హనుమకొండ సభలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇస్తారనే ఆశతో ఓరుగల్లువాసులు ఎదురుచూస్తున్నారు.



అభివృద్ధి.. పట్టాలెక్కుతోంది



- రెండో రాజధాని స్థాయిలో తీర్చిదిద్దేలా కార్యాచరణ
- పెండింగ్ పనులు పూర్తికి భారీగా నిధుల మంజూరు
- 50 ఏళ్ల తరువాత అమల్లోకి వరంగల్ మాస్టర్ ప్లాన్
- మూడుదశాబ్దాల కలను సాకారం చేస్తూ భూగర్భ డ్రెయినేజీకి రూ.4,170కోట్లు
- ఎయిర్‌పోర్టుకు ప్రధాన అడ్డంకుల తొలగింపులో ప్రభుత్వం సక్సెస్
- మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులపై కొరియా కంపెనీలతో చర్చలు
- రూ.వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారంతో ప్రజల పులకింత
- మడికొండ ఐటీ హబ్‌పై హామీలు లభించేనా.?
- నేడు కాంగ్రెస్ ప్రజాపాలన మహిళ శక్తి విజయోత్సవ సభ
- హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో విస్తృత ఏర్పాట్లు

ఓరుగల్లుపై సర్కారు ప్రత్యేక దృష్టి

భూగర్భ డ్రెయినేజీకి రూ.4,170కోట్లు

వరద భయంతో వణికిపోతున్న వరంగల్ వాసులకు ప్రభుత్వం భరోసా ప్రకటన చేసింది. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) నిర్మాణానికి రూ.4,170 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. 30 ఏళ్లుగా ఈ యూజీడీ కోసం ఎదురు చూస్తున్న నగరవాసుల కల ఎట్టకేలకు తీరనుంది. వరద ముంపును తప్పించేందుకు 1995లో అప్పటి అధికారులు వరంగల్‌లో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థపై పలుమార్లు సర్వేలు నిర్వహించారు. పెరగుతున్న జనాభా, కాలనీలకు అనుగుణంగా సుమారు రూ.125కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు తయారు చేశారు. అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికి ఫలితం లేకుండా పోయింది. ఆ తరువాత 2016లో అప్పటి కలెక్టర్ ఆమ్రపాలి నేతృత్వంలో ఈజీఐఎస్ సంస్థతో కలిసి కార్పొరేషన్ అధికారుల బృందం సర్వే నిర్వహించింది. మురుగునీటి పారుదల వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు డీపీఆర్‌ను సిద్ధం చేశారు. నగరంలో విలీనమైన 42 గ్రామాలతో పాటు నగరం మొత్తం భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సుమారు రూ.2,500కోట్లతో ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూగర్భ డ్రెయినేజీపై దృష్టిసారించకపోవటంతో అది మరుగున పడింది. గత పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 24, మే 7వ తేదీన జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా భూగర్భ డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. సీఎం తన హామీ మేరకు గత జూన్ 29వ తేదీన వరంగల్ పర్యటనలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీపై అధికారుల సమీక్షించారు. సీఎం ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు భూగర్భ డ్రెయినేజీపై ప్రాథమిక అంచనాలను రూపొందించటంతో ప్రభుత్వం రూ.4,170కోట్లు విడుదల చేసింది. దీంతో నగరవాసులకు 30ఏళ్ల కలను సీఎం రేవంత్‌రెడ్డి సాకారం చేశారనే టాక్ వినబడుతుంది.

ఎట్టకేలకు అమల్లోకి కొత్త మాస్టర్ ప్లాన్

వరంగల్ నగరాభివృద్ధిలో కీలకమైన మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయడానికి 52ఏళ్లు పట్టింది. 1972లో తయారు చేసిన మాస్టర్ ప్లాన్ మాత్రమే ఇప్పటికీ అమల్లో ఉండగా.. ప్రతీ 20ఏళ్లకు ఒకసారి మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంతో వరంగల్ మాస్టర్ ప్లాన్ అమల్లోకి రాకుండా పోయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2041 మాస్టర్ ప్లాన్ తయారు చేసినా 2016నుంచి పెండింగ్‌లో ఉంది. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా విస్తరణతో పాటు 2041 మాస్టర్‌ప్లాన్‌కు కొంత మార్పులు చేర్పులు చేసి ప్రభుత్వం ఆమోదించింది. దీంతో వరంగల్‌కు 52ఏళ్ల తరువాత కొత్త మాస్టర్ ప్లాన్‌ను


మిగతా 6వ పేజీలో...

ఏ పనులకు ఎంతంటే..

ప్రజాపాలన ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా విజయోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న క్రమంలో హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రై సిటీల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మహానగరం అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.4962.47 కోట్లు కేటాయించింది. వీటిలో కొన్ని పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

- వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ : రూ.4,170 కోట్లు
- మామునూరు ఎయిర్ పోర్ట్ భూసేకరణ: రూ.205కోట్లు
- కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్: 160.92 కోట్లు
- టెక్స్ టైల్ పార్కులో రోడ్లు, స్కూల్స్, సదుపాయాలు : రూ.33.60 కోట్లు
- టెక్స్ టైల్‌పార్క్ నిర్వాసిత రైతులకు ఇందిరమ్మ ఇళ్లు : రూ. 43.15 కోట్లు
- కాళోజీ కళాక్షేత్రం : రూ.85 కోట్లు
- పరకాల నుంచి ఎర్రగట్టు గుట్ట వరకు రోడ్డు విస్తరణ : రూ.65 కోట్లు
- నయీమ్ నగర్ బ్రిడ్జి నిర్మాణం: రూ.8.30కోట్లు
- వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ బిల్డింగ్‌కు : రూ. 32.50 కోట్లు
- ఇన్నర్ రింగ్ రోడ్: రూ.80 కోట్లు
- భద్రకాళి ఆలయం వద్ద పాలిటెక్నిక్ కాలేజీ కొత్త భవనానికి : రూ.28 కోట్లు
- గ్రేటర్ వరంగల్ పరిధిలో రోడ్లు : రూ. 49.50
- వరంగల్ ఉర్దూ భవన్, షాదీ ఖానాకు : రూ. 1.50 కోట్లు


ప్రజాపాలన విజయోత్సవ సభ కోసం హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లు


కాళోజీ కళాక్షేత్రం


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఏడాదిలోనే హామీలను నెరవేరుస్తున్నాం

- హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధి
- ఇదే ముఖ్యమంత్రి లక్ష్యం
- బీఆర్ఎస్‌వి మాటలు, మావి చేతలు
- మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ

6



‘నియో రైలు’ పరుగులుపెట్టేనా?

- వరంగల్ మహానగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్
- 2019లోనే రూ.1,341కోట్ల అంచనాలతో మెట్రోకు ప్రతిపాదనలు
- కాజీపేట నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు 15.5కి.మీ లైన్, 21స్టేషన్లు
- గ్రీన్‌సిగ్నల్ ఇవ్వని గత ప్రభుత్వం.. ఐదేళ్లుగా కలగానే ప్రాజెక్టు
- హైదరాబాద్‌లో రెండోదశ మెట్రోకు సన్నాహాలతో మళ్లీ తెరపైకి
- నగర విస్తరణ దృష్ట్యా మెట్రో రైలు మార్గాలను విస్తరించాలంటున్న ప్రజలు

4

ప్రజలు ఛీత్కరించినా సోయిరావట్లే


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

- మాస్టర్‌ప్లాన్ తేలేదు.. కళాక్షేత్రాన్ని నిర్మించలేదు
- సభను అడ్డుకుంటే మహిళలు చీపుళ్లతో కొడతారు
- బీఆర్ఎస్ నేతలపై పశ్చిమ ఎమ్మెల్యే నాయిని ఫైర్
- చరిత్రలో నిలిచే అభివృద్ధి వరాలను సీఎం కురిపించారని వెల్లడి

4

ప్రజలకు ఏంచేశారో సీఎం సమాధానం చెప్పాలి


మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- బూటకపు హామీలతో ఎన్నికల్లో గెలిచారు
- మహిళలకు రూ.2500, కల్యాణ లక్ష్మిలో తులం బంగారం ఏవీ?
- 2 లక్షల ఉద్యోగాల పేరిట విద్యార్థులను మోసం చేశారు
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

6

నెరవేరనున్న ‘డివిజన్’ కల

- కాజీపేట రైల్వే జంక్షన్‌కు త్వరలో హోదా
- విశాఖ జోన్‌తో కలిపి ప్రకటించే అవకాశం
- సరిహద్దులపై అధికారుల ఆరా

ముందే చెప్పిన ‘ఆంధ్రజ్యోతి’

కాజీపేట, నవంబరు 18 ఆంధ్రజ్యోతి): కాజీపేటకు రైల్వే డివిజన్ హోదాకు సుగమమైంది. కాజీపేట వాసుల చిరకాల వాంఛ అయిన రైల్వే డివిజన్ హోదా ప్రకటించడమే ఆలస్యంగా అన్న చందంగా రైల్వే ఉన్నతాధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇదే విషయాన్ని ఈ గతనెల 29న ‘ఆంధ్రజ్యోతి’ లో ‘డివిజన్ ప్రకటనే ఆలస్యం’ అనే కథనం ప్రచురితమైంది. ఇదిలా ఉండగా సోమవారం కేంద్ర రైల్వే మంత్రి కార్యాలయం నుంచి సికింద్రాబాద్ రైల్వే ఉన్నతాధికారులకు సూత్రప్రాయంగా సమాచారం అందినట్లు తెలుస్తోంది. దీంతో సికింద్రాబాద్, కాజీపేట రైల్వే ఉన్నతాధికారుల్లో చలనం మొదలైంది. కొంతకాలంగా విశాఖ (సౌత్ సెంట్రల్ కోస్టల్ రైల్వే) డిమాండ్‌తో ఈమధ్యనే విశాఖ జోన్ ప్రకటించడానికి రైల్వేశాఖ అన్ని చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో సికింద్రాబాద్‌లో అత్యంత ప్రాధాన్యం కలిగిన కాజీపేట జంక్షన్‌కు కూడా డివిజన్ హోదా డిమాండ్ ఉండడంతో దీనిని కూడా విశాఖజోన్‌తో కలిపి ప్రకటించడానికి రైల్వే అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.



సరిహద్దులపై ఆరా..

కాజీపేటకు రైల్వే డివిజన్ హోదాపై కేంద్ర రైల్వే శాఖ మంత్రిత్వశాఖ, రైల్వే ఉన్నతాధికారులు హద్దులపై ఆరాతీసి ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. భువనగిరి లేదా ఆలేరు నుంచి ఢిల్లీ వైపు ఉన్న బల్లార్షా, వరంగల్ మీదుగా విజయవాడ వైపు ఉండే కొండపల్లి వరకు, మణుగూరు - సత్తుపల్లి సెక్షన్, రామగుండం మీదుగా వయా మణుగూరు, మేడారం, నూతనంగా నిర్మించే డోర్నకల్ - గద్వాల, నూతనంగా నిర్మించే నష్కల్ - హసన్‌పర్తి, నష్కల్ - చింతలపల్లి రైల్వే లైన్‌లను కలిపే నైసర్గిక స్వరూపంతో డివిజన్ సరిహద్దులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో కొన్ని మార్పులు చేర్పులు ఉండే అవకాశం సైతం ఉందని చెబుతున్నారు. అన్ని అనుకూలిస్తే విశాఖ జోన్‌తో కాజీపేట డివిజన్ ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా కాజీపేట వాసుల చిరకాల వాంఛ అయిన కాజీపేటకు డివిజన్ హోదా త్వరలో నేరవేరబోతుందనే వార్తతో స్థానికులు సంతోషం వెలిబుచ్చుతున్నారు.

తెలంగాణ బాస్కెట్‌బాల్ కోచ్‌గా ప్రశాంత్

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19నుంచి 26వరకు పంజాబ్ రాష్ట్రంలో ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న అండర్-19 బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టు కోచ్‌గా హనుమకొండకు చెందిన డీఎస్ఏ కోచ్ కొత్త ప్రశాంత్ ఎంపికయ్యారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో, ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 కార్యదర్శి గుగులోత్ అశోక్‌కుమార్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు ప్రశాంత్‌ను అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో లవ్లీత్ ప్రతిభ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15నుంచి 17వరకు ఎస్‌జీఎఫ్ఐ అండర్-14 ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో వంగపహాడ్‌కు చెందిన కంచు లవ్లీత్ అత్యుత్తమ ప్రతిభ చాటి రెండు రజత పతకాలు కొల్లగొట్టాడు. అండర్-14 బాలు రు 400, 600 మీటర్ల పరుగు పందెంలో తనదైన ప్రతిభ కనబరిచి రెండిం టిలోనూ రెండు రజత పతకాలను సాధించి అందరి మన్ననలు పొందాడు. ప్రస్తుతం లవ్లీత్ జయగిరిలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ మేరకు రెండు రజత పతకాలు సాధించిన లవ్లీత్‌ను పాఠశాల అధ్యాపకులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ముగిసిన జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కమల్ కింగ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండ పంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ప్రభుత్వ న్యాయవాది నర్సింహారావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓరుగల్లు నుంచి ప్రపంచ స్థాయిలో రాణించిన ఇరిగేసి అర్జున్ నేటి వర్ధమాన చెస్ క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోని రాణించాలన్నారు. కమల్ కింగ్ చెస్ అకాడమీ డైరెక్టర్ రాంప్రసాద్ మాట్లా డుతూ.. ఉమ్మ డి వరంగల్ స్థాయిలో నిర్వహించిన అండర్- 6, 7, 9, 11, 13, 15 బాలబాలికల విభాగంలో నిర్వహించిన టోర్నీలో 300మంది విద్యార్థులు పాల్గొ న్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్. రామకృష్ణ, ఎం.మురళి, కమల్ కింగ్ చెస్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ సలీం, ఆర్బిటర్లు షేక్ ఇమాంబీ, బి.నిఖిత, సరళ, అనీల్, మణికంఠ, రవి, శ్రీకాంత్, తపస్వీ, నితిన్‌కుమార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంస్కృతి విహార్ టీటీడీ శిక్షణా కేంద్రం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణలో నిరుద్యోగ యువతులకు 30 రోజులపాటు మగ్గం వర్క్స్‌లో ఉచిత శిక్షణ నివ్వను న్నట్లు ఎస్‌బీఐ సంస్థ డైరెక్టర్ బాన రవి తెలిపారు. ఉమ్మడివరంగల్ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత డిసెంబరు 2వ నుంచి ప్రారంభం కానున్న శిక్షణ తరగతులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు డిసెంబరు 1 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి శిక్షణ సదుపాయాలతో పాటు కోర్సుకు సంబంధించిన మెటీరియల్ కూడా ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు సెల్: 98493 07873, 97040 56522, 62812 60878, 99491 08934 నెంబర్లను సంప్రదించవచ్చని సంస్థ డైరె క్టర్ బాన రవి తెలిపారు.

నాటక సమాజాలను ప్రభుత్వం ప్రోత్సహించాలి

వడ్డెపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాటక సమాజాలకు ఆర్థిక సహకారం అందించి ప్రోత్సహించాలని తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, రాష్ట్ర సలహాదారులు వనం లక్ష్మీకాంతారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం కళాకారులను విస్మరించిందని కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులకు కొత్తగా పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలోని థియేటర్లలో ప్రతీ ఆదివారం నాటకాలను ప్రభుత్వ ఖర్చుతో ప్రదర్శించి, నాటక వారంగా ప్రకటించాలని వారు విజ్ఞప్తి చేశారు. కాళోజీ కళాక్షేత్రం ముందు భాగంలో కాకతీయ కళా తోరణం ఏర్పాటు చేయాలని, కళాక్షేత్రంలో ఉచిత ప్రదర్శనలకు అనుమతి ఇవ్వాలని సీఎంని కోరారు. సమావేశంలో తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు డాక్టర్ ఓడపల్లి చక్రపాణి, మాడిశెట్టి రమేశ్, మారేడోజు సదానందాచారి, గూడూరు బాలాజీ, రాదారపు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

'నియో రైలు' పరుగులు పెట్టేనా?

- 2019లోనే రూ.1,341కోట్ల అంచనాలతో నియోకు ప్రతిపాదనలు
- కాజీపేట నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు 21స్టేషన్లు, 15.5కి.మీల లైన్
- గ్రీన్‌సిగ్నల్ ఇవ్వని గత ప్రభుత్వం.. ఐదేళ్లుగా కలగానే ప్రాజెక్టు
- హైదరాబాద్‌లో రెండోదశ మెట్రోకు సన్నాహాలతో మళ్లీ తెరపైకి
- నగర విస్తరణ దృష్ట్యా మెట్రో రైలు మార్గాలను విస్తరించాలంటున్న ప్రజలు





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లు గడ్డపై ఐదేళ్లుగా మెట్రో రైలు పరుగులు కలగానే మిగిలాయి. 2019లో హైదరాబాద్ తరహాలో చారిత్రక నగరంలో మెట్రో రైలు కోసం ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ట్రైసిటీని అనుసంధానిస్తూ 15.5కిలో మీటర్ల రైల్వే లైన్ నిర్మాణంతో పాటు ఇతర వాటికి కోసం రూ.1,341 కోట్లతో అధికారులు నియో ప్రాజెక్టు పేరుతో డీపీఆర్‌ను ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఐదేళ్లుగా మెట్రో ప్రయాణానికి అడుగులు ముందుకు పడలేదు.

2019లోనే ప్రతిపాదనలు

వరంగల్ నగరం విస్తరిస్తుండంతో హైదరాబాద్ తరహాలో వరంగల్ నగరంలో మెట్రో రైల్ ఏర్పాటుపై గత ప్రభుత్వం సర్వే నిర్వహించింది. 2019 డిసెంబరు 24వ తేదీన అధికారులు కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు 15.5కిలో మీటర్ల వరకు మెట్రో లైన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వరంగల్ మెట్రోకు నియో ప్రాజెక్టుగా నామకరణం కూడా చేశారు. కూడా నిర్వహణలో ఈ రైల్‌ను నిర్వహించాలని అప్పట్లో నిర్ణయించారు. లైట్ రైల్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఎల్ఆర్‌టీఎస్) ద్వారా ఒకే దశలో ప్రాజెక్టు పూర్తి చేయాలని డీపీఆర్ రూపొందించారు. 2025లో ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.1,341కోట్ల అంచనా వ్యయంతో వరంగల్ మెట్రో రైల్‌కు రూపకల్పన చేశారు. కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు 15.5కి.మీల దూరంలో 7.1కిలో మీటర్లు రోడ్డు మార్గంలో, 8.4కి.మీలు ఆకాశ మార్గంలో రైల్వేట్రాక్ నిర్మించాలని నిర్ణయించారు. 2041నాటికి వరంగల్ జనాభా 20లక్షలకు చేరుకుంటుందని అంచనాతో మహారాష్ట్రలోని నాసిక్ నియో మెట్రో తరహాలో వరంగల్‌లో నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు.

రబ్బరు టైర్లపై నడవటం నియో మెట్రో ప్రత్యేకత.

విద్యుత్ వ్యయం కూడా భారీగా ఆదా అవుతుందని అంచనా వేశారు. కాగా, 21 స్టేషన్లను ఏర్పాటుకు ప్రతి పాదనలు చేశారు. వీటిలో కాజీపేట రైల్వేస్టేషన్, ఫాతిమానగర్, ఎన్ఐటీ, అటవీశాఖ కార్యాలయం, సుబేదారి, రోహిణి అస్పత్రి, అదాలత్, నక్కలగుట్ట, అంబేద్కర్ జంక్షన్, పోలీస్ కమిషనరేట్, ప్రసూతి అస్పత్రి, హనుమకొండ చౌరస్తా, అలంకార్ జంక్షన్, ములుగు రోడ్డు, కేఎంసీ, ఎంజీఎం, పోచమ్మమైదాన్, ఎల్‌బీ నగర్, కాశిబుగ్గ, వెంకట్రామ టాకీస్, వరంగల్ రైల్వే స్టేషన్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేశారు. 2021 మార్చిలో వరంగల్ మెట్రో నియో రైలు కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. అయితే కేంద్రంపై ఒత్తిడి లేకపోవటంతో వరంగల్ మెట్రోకు ఐదే ళ్లుగా బ్రేక్ పడిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

మెట్రో.. రూట్ మారేనా?

వరంగల్ మహానగరం ఐదేళ్లలో భారీగా విస్తరించింది. హైదరాబాద్ తరువాత అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. మామునూరు ఎయిర్‌పోర్టు పూర్తయితే వరంగల్ పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే సిద్ధంగా ఉన్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుతో పాటు మడికొండలోని ఐటీ హబ్‌కు కొత్త కల వచ్చే అవకాశాలున్నట్టు భావిస్తున్నారు. దీంతో వరంగల్ విస్తరణకు తగ్గట్టుగా మెట్రో రైలను విస్తరించి కొత్తగా డీపీఆర్‌ను రూపొందించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి కాకుండా రాంపూర్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు ఒక రూట్, మామునూరు ఎయిర్‌పోర్టు నుంచి హంటర్ రోడ్డు మీదుగా అదాలత్ వరకు మెట్రో లైన్ కలిసేలా మరో రూట్, హసన్‌పర్తి నుంచి కాకతీయ యూనివర్సిటీ, పెద్దమ్మగడ్డ మీదుగా ములుగురోడ్డు నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు మరో రూట్‌ను, వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి స్టేషన్ రోడ్డు, వరంగల్ చౌరస్తా, జేపీ ఎన్ రోడ్డు, మండి బజారు, పోచమ్మమైదాన్ వరకు మరో రూటుగా ఏర్పాటుచేస్తే వరంగల్ నగరవాసు లతో పాటు ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వారికి ఉపయోగంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును కూడా దృష్టిలో పెట్టుకుని మెట్రో సేవలు అందుబాటులోకి తీసుకరావాలనే చర్చ జరుగుతోంది. 2041నాటికి వరంగల్ నగర జనాభా 20లక్షల చేరు తుందని అప్పట్లో డీపీఆర్ తయారు చేశారు. అయితే మాస్టర్ ప్లాన్‌ను దృష్టిలో పెట్టుకుని మెట్రో రైల్ డీపీఆర్‌ను మార్చాల్సి వస్తుందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై మెట్రో ఆశలు

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే 11 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు వరంగల్ మెట్రో రైల్‌పై దృష్టి పెట్టకపోవటం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్ తరహాలో మెట్రో రైల్ మార్గాలను ఏర్పాటు చేయాలనే నగరవాసులు కోరుతున్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో పట్టాలెక్కని మెట్రో రైల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టాలని కోరుతున్నారు. పెరుగుతున్న నగర అభివృద్ధికి తగ్గట్టుగా మెట్రో రైలు అవసరమని, ఓరుగల్లుకు ఎన్నో ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి మెట్రో రైలు ఏర్పాటుకు చొరవ చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రామా చంద్రమౌళికి జీవన సాఫల్య పురస్కారం

దోహా ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో ప్రదానం



హనుమకొండ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు, ఆంగ్ల భాషల్లో శతాధిక కవితలు, కథలు రాసిన బహు గ్రంథకర్త కాళోజీ నారాయణరావు సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ రామా చంద్రమౌళి.. జీవన సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ పుర స్కారాన్ని ఈనెల 22, 23 తేదీల్లో ఖతర్‌లోని దోహాలో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఆంధ్ర కళావేదిక సంయుక్త నిర్వహణలో జరిగే 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో ఆయన అందుకోబో తున్నారు. తెలుగు, ఆంగ్ల సాహిత్యంలో చేసిన కృషికి గుర్తింపుగా చంద్రమౌళిని ఇప్పటికే పలు సాహిత్య సంస్థలు జీవన సాఫల్య పురస్కారాలతో సత్కరించాయి.

సాహిత్య కృషీవలుడు

రామా చంద్రమౌళి ప్రసిద్ధ కవి, కథకుడు, నవలాకారుడు, విమర్శకుడు. ఇప్పటి వరకు 78 పుస్తకాలను ప్రచురించిన ఆయన 34 నవలలు, 427 కథలు, 17 కవిత్వ సంపుటాలు, 3 నాటకాలు, 4 విమర్శనా గ్రంథాలను వెలువరించారు. 2011లో గ్రీస్‌లో జరిగిన 11వ ప్రపంచ కవుల సదస్సులో భారత ప్రతినిధిగా పాల్గొన్నారు. 2016లో తైవాన్‌లో జరిగిన ప్రపంచ కవుల సదస్సులో కూడా భారత ప్రతినిధిగా పాల్గొని తన కవితలను వినిపించారు. తన భూమి దుఃఖం కథను హైదరాబాద్ దూరదర్శన్ టెలీఫిల్మ్‌గా నిర్మించింది. అది అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2011వ సంవత్సరం ఉత్తమ టెలీఫిల్మ్‌గా ఎంపిక చేసి స్వర్ణ నంది పురస్కారాన్ని అందచేసింది. 2007లో రాష్ట్రస్థాయి అత్యున్నత సాహిత్య పురస్కారం తెలుగు విశ్వవిద్యాలయం కవితా పురస్కారం, 2008లో ప్రతిష్ఠాత్మక సినారే కవిత్వ పురస్కారం, 2012లో డాక్టర్ అవంత్స సోమ సుందర్ కవిత్వ పురస్కారం, 2015లో గుంటూరు శేషేంద్రశర్మ కవిత్వ పురస్కా రం, 2012లో ప్రతిష్ఠాత్మక ఫ్రీవర్స్ పురస్కారం, అదే సంవత్సరం కొలుకలూరి భాగీరథీ కవిత్వ పురస్కారంతోసహా పలు అవార్డులను, సత్కారాలను అందుకున్నారు. ఇవికాక 2017లో పిలిపీన్స్ ప్రభుత్వ జీవిత సాఫల్య పురస్కారం, 2015లో ది ఆంధ్ర మహాసభ ముంబై జీవిత సాఫల్య పురస్కారం, 2018లో కళారత్న, అదే సంవత్సరం స్వర్ణలేఖిని వంటి పురస్కారాలను ఎన్నో పొందారు. 2020లో డాక్టర్ అమృతలత జీవన సాఫల్య పురస్కారాన్ని పొందారు. చంద్రమౌళి కథలు, కవిత్వం, నవలలు అనేకం పంజాబీ, తమిళ్, కన్నడ, బెంగాలీ, హిందీ వంటి తెలుగేతర భారతీయ భాషల్లోకి అనువదించ బడి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని సమకూర్చి పెట్టాయి. 2,386 ఎంట్రీలను పరిశీలించి ప్రపంచ వ్యాప్తంగా 60మందికి ప్రకటించిన ప్రతిష్ఠాత్మక నాజీ నామన్ లెబనాన్ నుంచి ప్రపంచస్థాయి జీవి తకాల సాఫల్య పురస్కారం 2019లో భారత దేశం లో ఒక్క రామా చంద్రమౌళికే మాత్రమే దక్కింది.

ఉత్తమ అధ్యాపకుడు

చంద్రమౌళి వృత్తిరిత్యా ఇంజనీరింగ్ అధ్యాపకుడు. ప్రవృత్తిరిత్యా సాహితీవేత్త. అటు ఆధ్యాపక వృత్తిని కొనసాగిస్తూనే ఇటు సాహితీరంగంలో రాణిస్తున్నారు. కథలు, కవిత్వాలు రాయడంతో పాటు విద్యార్థుల కోసం పలు పాఠ్యపుస్తకాలను కూడా రాశారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆరు పాఠ్య గ్రంథాలను రచించినందుకు 1999లో రాష్ట్రపతి నుంచి జాతీయ ఉత్తమ ఇంజనీరింగ్ అధ్యాపక పురస్కారాన్ని అందుకున్నారు. 2000లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నుంచి ఉత్తమ ఇంజనీరింగ్ అధ్యాపక పురస్కారాన్ని కూడా స్వీకరించారు. 1950లో జన్మించిన ప్రొఫెసర్ రామా చంద్రమౌళి మెకానికల్ ఇంజనీరింగ్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ప్రస్తుతం వరంగల్‌లోని గణపతి ఇంజనీరింగ్ కాలేజీలో వైస్‌ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. దోహ సదస్సులో రామా చంద్రమౌళి రచించిన రెండు పుస్తకాలు మదర్స్ రూమ్ అండ్ అదర్ స్టోరీస్, శిశువు చిత్ర నిద్ర కవిత్వం ఆవిష్కరణలు ఉంటాయి.



సదస్సులో ఆవిష్కరించనున్న పుస్తకం

దోహా సదస్సు ప్రత్యేకాంశాలు

మధ్య ప్రాశ్చ దేశాల తెలుగువారి భాషా, సాహిత్య పురోభివృద్ధికి ప్రపంచ స్థాయిలో తొలిసారి గుర్తింపుగా ఈ సదస్సు జరుగుతోంది. 10 దేశాల నుంచి సుమారు 250 మంది తెలుగు కవులు, రచయితలు, పండితులు, సినీ, రాజకీయ ప్రముఖులు, విశ్లేషకులు, పత్రికా ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. మాజీ ఉపరాష్ట్రపతి పద్మవిభూషణ్ ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రధాన ఉపన్యాసం చేస్తారు. ప్రసిద్ధ సాహితీవేత్తలతో పాటు సుమారు 80మంది ఆహ్వానిత వక్తలు సాహిత్య ప్రసంగాలు, కథా, కవితా పఠనాలు చేస్తారు. 33 నూతన తెలుగు గ్రంథాల ఆవిష్కరణ ఉంటాయి. దావోస్ సాహితీ సదస్సులో చంద్రమౌళి ప్రసంగిస్తారు. ఆయన ప్రసంగ పాఠాన్ని ఈ సందర్భంగా ముద్రించే సావనీర్‌లో ప్రచురిస్తున్నారు. అంతేకాకుండా ప్రముఖమైన డయాస్పోరా కథల్లో ఒకటిగా ఆయన కథను కూడా ముద్రిస్తున్నారు.



వీసీ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రాన్ని ఇస్తున్న ప్రైవేట్ కళాశాల యాజమాన్యాల నాయకులు

నేటి నుంచి ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు బంద్

కేయూ క్యాంపస్, నవంబరు 18:(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల ఫీజుల బకాయిల చెల్లింపుపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా నవంబరు 19 మంగళవారం నుంచి నిరవధిక బంద్‌కు దిగనున్నాయి. అలాగే ఈనెల 26 నుంచి కేయూ పరిధిలో జరిగే డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు సహకరించమని తేల్చి చెప్పాయి. ఈ మేరకు సోమవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలను ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల నాయకులు కలిసి వినతి పత్రాలను అందచేశారు.

ఈ సందర్భంగా కేయూ ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోషియేషన్ అధ్యక్షకార్యదర్శులు పబ్బతి ఉపేందర్ రెడ్డి, ఎం.ప్రభాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు చెల్లించాల్సిన ఆర్‌టీఎఫ్ బకాయిలను విడుదల చేయాలని గతంలో నిరసనకు దిగినట్లు తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల్లో బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చి నెల రోజులు గడుస్తున్నప్పటికీ పట్టించుకోకుండా వ్యవరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజుల బకాయిలు రాకపోవడంతో కళాశాల భవనాల అద్దె, సిబ్బందికి జీతాలివ్వలేని దృష్ట్యా కళాశాలలు నడపలేని అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఆర్‌టీఎఫ్ బకాయిలను ప్రభుత్వం చెల్లించిన తర్వాతనే కళాశాలలను తెరువాలని రాష్ట్రంలోని అన్ని వర్సిటీల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నిర్ణయించినట్లు వెల్లడించారు. కళాశాల బంద్‌తో పాటు సెమిస్టర్ పరీక్షలను కూడా నిర్వహించలేమని స్పష్టం చేశారు. కేయూ పరిపాలన అధికారులు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డిలను కోరారు. ఈ కార్యక్రమంలో కేయూ ప్రైవేట్ కళాశాల యాజమాన్యాల అధ్యక్షకార్యదర్శులు పబ్బతి ఉపేందర్ రెడ్డి, సెక్రటరీ ఎం.ప్రభాకర్‌రెడ్డి, ట్రెజరర్ జి.వేణుమాధవ్, ఇతర నాయకులు గోలి వెంకట్, సదానందం, రవీంద్రనాథ్, సంపత్‌రెడ్డి, శ్రీనివాస్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఛీత్కరించినా సోయిరావట్లే

- మాస్టర్‌ప్లాన్ తేలేదు.. కళాక్షేత్రాన్ని నిర్మించలేదు
- సభను అడ్డుకుంటే మహిళలు చీపుళ్లతో కొడతారు
- బీఆర్ఎస్ నేతలపై పశ్చిమ ఎమ్మెల్యే నాయిని ఫైర్
- చరిత్రలో నిలిచే అభివృద్ధి వరాలను సీఎం కురిపించారని వెల్లడి

హనుమకొండ సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఛీత్కరించినా బీఆర్ఎస్ నాయకులకు ఇంకా సోయి రావడం లేదని, మాస్టర్‌ప్లాన్ తేలేదని, కళాక్షేత్రాన్ని నిర్మించలేదని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. సోమవారం హనుమకొండలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, వినయ్ భాస్కర్, పల్లా రాజేశ్వరరెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ అభివృద్ధి కోసం వేలకోట్ల అభివృద్ధి నిధులు కేటాయిస్తూ ఏకంగా జీవోలే జారీ చేశారని, మామునూరు ఎయిర్‌పోర్టు భూ నిర్వాసితులకు రూ.210కోట్ల కేటాయింపు, వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్ అడ్మినిస్ట్రేషన్ భవనానికి రూ.32కోట్ల కేటాయింపు, భద్రకాళి మాఢవీధుల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఇన్నర్ రింగ్ రోడ్డు తదితర పనులకు రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని వివరించారు. అలాగే మాస్టర్‌ప్లాన్-2041 విడుదల చేశారన్నారు. ఏడాదిలోనే నగరాన్ని అభివృద్ధి చేసి తాము మాట నిలబెట్టుకున్నామన్నారు.

బీఆర్ఎస్ పదేళ్లలో మాస్టర్‌ప్లాన్ తీసుకురాలేదని, కాళోజీ కళాక్షేత్రాన్ని మధ్యలోనే నిలిపేసిందని, దాంతో తాను సీఎం దృష్టికి తీసుకెళ్లి రూ.70కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చి పూర్తి చేశానన్నారు. అదే విధంగా నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఇలా అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో పాటు కనీవిని ఎరగని రీతిలో వరంగల్ నగరానికి ఎయిర్‌పోర్టు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, ఇన్నర్ రింగ్.. ఇలా మహోత్తర ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం ఇస్తూ నగర ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు. నగరాభివృద్ధికి సీఎం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే బీఆర్ఎస్ నేతలు సిగ్గులేకుండా అవాస్తవాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అభివృద్ధి పనులను వేగిరం చేస్తుంటే అభినందించాల్సింది పోయి విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు దయాకర్‌రావు, వినయ్‌భాస్కర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తదితర బీఆర్ఎస్ నాయకులు ప్రజల సొమ్మును అప్పనంగా దోచుకుతిన్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ నేతలు కబ్జాలతో దండుకుతిన్నారని, కానీ తమ ఏడాది పాలనలో కాంగ్రెస్ నేతలపై ఒక్క కబ్జా మచ్చ కూడా పడలేదని, అందే తమ పాలన స్వచ్ఛతను నిరూపిస్తోందన్నారు.

కాంగ్రెస్ విజయోత్సవ సభను అడ్డుకుంటామని చెబుతున్న బీఆర్ఎస్ నేతలను మహిళలు చీపుళ్లతో తరిమికొడతారన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతల రౌడీయిజాన్ని సహించేది లేదని, సభను అడ్డుకుంటామని ప్రకటిస్తున్న బీఆర్ఎస్ నేతలకు దేహశుద్ధి తప్పదని హెచ్చరించారు. చరిత్రలో నిలిచిపోయేలా వరంగల్‌కు ముఖ్యమంత్రి వరాలు కురిపిస్తే.. బీఆర్ఎస్ నేతలు అవరోధకులుగా మారుతున్నారన్నారు. మూసీ ప్రక్షాళన చేస్తామని సీఎంగా ఉన్నప్పుడు కేసీఆరే ప్రకటించారని, కానీ ఇప్పుడు తాము చేస్తుంటే బీఆర్ఎస్ వారు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ సీఎంగా వరంగల్‌కు వరాలు కురిపించడంతోనే పరిమితమయ్యారని, గరీబ్‌నగర్‌లో నిరుపేదలకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం చేసి దావత్ చేసుకుంటామని ప్రకటించిన సంగతిని బీఆర్ఎస్ నేతలు మరిచారా? అని ప్రశ్నించారు. ఏడాదికి రూ.300కోట్లు సీఎం ఆస్యూరెన్స్‌గా ఇస్తామని ప్రకటించి కేసీఆర్ చేతులెత్తేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని కేటీఆర్, హరీశ్‌రావు అడ్డుకునే చర్యలకు పాల్పడుతున్నారని రేవూరి మండిపడ్డారు.

కాంగ్రెస్ అభివృద్ధి వరాలతో బీఆర్ఎస్ నేతలకు నిద్రపట్టడం లేదని ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్, వంద పడకల ఆస్పత్రి, ఆర్‌టీసీ బస్టాండ్ ఆధునీకరణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు రేవంత్‌రెడ్డి ఆమోదం తెలుపడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు అభివృద్ధిని కాగితాలకే పరిమితం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణలో చూపుతోందన్నారు. బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలపై ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి మండిపడ్డారు. జీడబ్ల్యూఎంసీ పరిపాలన భవనానికి రూ.32 కోట్లు కేటాయించడంపై మేయర్ గుండు సుధారాణి సీఎంకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సమావేశంలో బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తోట వెంకటేశ్వర్లు, కూచన రవళి, దొమ్మాటి సాంబయ్య, ఈవీ శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్, బంక సరళా, బత్తిని శ్రీనివాస్, డాక్టరు పులి అనిల్‌కుమార్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంబురాలు

వరంగల్ నగరానికి వరలు కురిపించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ నేతలు అభినందనలు తెలియచేస్తూ సంబురాలు జరిపారు. హనుమకొండ అశోకా జంక్షన్‌లో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బాణాసంచా పేల్చారు. మిఠాయిలను పంపిణీ చేశారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2425	2080
పల్లికాయ (సూక)	6000	4000
పల్లికాయ (పచ్చిది)	-	-
కందులు	-	-
పెసళ్లు	5289	5250
పత్తి	6750	5800
కొత్తపతి	-	-
పసుపు (కాడి)	-	-
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి కొత్తది	14000	13000
తేజ ఏసీ	15500	14000
వండర్‌హాట్ ఏసీ	15000	11000
యూఎస్341ఏసీ	14000	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

- ఆర్ట్స్ కాలేజీ వద్ద ఆంక్షలు మరింత కఠినం
- వాహనదారులు అవసరముంటేనే బయటకు రావాలి
- సీపీ అంబర్ కిశోర్ ఝా సూచన

హనుమకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనను పురస్కరించుకొని వరంగల్, హనుమకొండ, కాజీపేట పట్టణాల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. కొన్ని రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలను విధిస్తున్నారు. హైదరాబాద్, ఖమ్మం, హుజూరాబాద్, ములుగు ఆ పైప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు ఏ ఏమార్గాల్లో ప్రయాణించాలో వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా నిర్దేశించారు. వాహనదారులు సూచనలను పాటించాలని కోరారు.

● హుజూరాబాద్ నుంచి హైదరాబాద్, ఖమ్మం ప్రాంతాలకు వెళ్లే వాహనాలు చింతగట్టు ఓఆర్ఆర్, కరుణాపురం మీదుగా హైదరాబాద్‌కు వెళ్లాలి. కరుణాపురం, ఐనవోలు, పున్నేలు మీదుగా ఖమ్మం వెళ్లాలి.

● పరకాల, ములుగు మార్గాల నుంచి హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్ ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఓఆర్ఆర్, కరుణాపురం మీదుగా హైదరాబాద్‌కు వెళ్లాలి. కరుణాపురం, ఐనవోలు, పున్నేలు మీదుగా ఖమ్మం వెళ్లాలి. వర్ధన్నపేట, ఆపై మార్గాల నుంచి హైదరాబాద్, కరీంనగర్, ములుగు, పరకాల, భూపాలపల్లి వెళ్లే వాహనాలు పున్నేలు క్రాస్ నుంచి డైవర్షన్ తీసుకొని ఐనవోలు, కరుణాపురం, ఓఆర్ఆర్ మీదుగా పోవాలి. పైన సూచించిన మార్గాల మీదుగా వారి వారి గమ్యస్థానాలకు చేరుకోవాలి. ముఖ్యంగా హనుమకొండ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కాలేజీలో జరిగే సీఎం బహిరంగ సభకు వచ్చే వాహనాలు కూడా నిర్దేశిత మార్గాల రావాల్సి ఉంటుంది.

● హుజూరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలు చింతగట్టు వద్ద ఆర్ఆర్ఆర్‌పై ఎక్కి ఉనికిచర్ల క్రాస్ రోడ్డు, వడ్డేపల్లి చర్చి, రిజిస్ట్రేషన్ ఆఫీసు, తెలంగాణ జంక్షన్, వడ్డెపెల్లి రోడ్ నుంచి సర్క్యూట్ గెస్ట్ హౌస్ వద్ద ప్రజలను దింపి ఖాళీ వాహనాలను ఓల్డ్ బస్ డిపో వద్ద తమ వాహనాలను పార్కింగ్ చేయాలి.

● హనుమకొండ, ములుగు, భూపాలపల్లి నుంచి వచ్చే వాహనాలు పెద్దమ్మగడ్డ డైవర్షన్ నుంచి కేయూసీ జంక్షన్, 100 ఫీట్ల రోడ్డు మీదుగా గోపాల్‌పూర్ జంక్షన్, తిరుమల జంక్షన్, ఎక్సైజ్ కాలనీ ఐలాండ్ వద్ద దించి ఖాళీ వాహనాలను ఎక్సైజ్‌కాలనీ-1లో పార్కింగ్ చేయాలి.

● నర్సంపేట వైపు నుంచి వచ్చే వాహనాలు చింతల్ బ్రిడ్జి ఆర్‌టీఏ, హంటర్ రోడ్డు మీదుగా నీలిమా జంక్షన్, తెలంగాణ జంక్షన్ వద్ద దింపి తమ వాహనాలను సూచించిన ప్రదేశంలో పార్కింగ్ చేయాలి.

● మామునూరు నుంచి వచ్చే వాహనాలు ఆర్‌టీఏ జంక్షన్, ఉర్సు గుట్ట సీఎస్ఆర్ గార్డెన్స్ మీదుగా హంటర్ రోడ్డు నీలిమా జంక్షన్, తెలంగాణ జంక్షన్ వద్ద దించి ఖాళీ వాహనాలను విష్ణుప్రియ గార్డెన్స్‌లో తమ వాహనాలను పార్కింగ్ చేయాల్సి ఉంటుంది.

● స్టేషన్‌ఘన్‌పూర్, ఆపై మార్గాల నుంచి వచ్చే వాహనాలు ఓఆర్ఆర్ మీదుగా ఉనికిచెర్ల ఎక్స్‌రోడ్, వడ్డేపల్లి చర్చి, ప్రశాంత్ నగర్ పార్క్, తెలంగాణ జంక్షన్ మీదుగా ఏ టూ జెడ్ వద్ద దించి ఖాళీ వాహనాలను తెలంగాణ జంక్షన్ వద్ద తమ వాహనాలను పార్కింగ్ చేయాలి.

● భారీ వాహనాలకు నో ఎంట్రీ

ట్రాఫిక్ ఆంక్షలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం మీటింగ్ ముగిసే వరకు కొనసాగుతాయి. వాహనదారులు అవసరం ఉంటే తప్ప తమ వాహనాలను రోడ్‌పైకి తీసుకురావద్దని, మరీ ముఖ్యంగా బహిరంగ సభ జరిగే ఆర్ట్స్ అండ్ కాలేజీ పరిసరాల వద్ద కఠినమైన ఆంక్షలు ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. అలాగే 19వ తేదీన ట్రైసిటీలోకి ఎటువంటి భారీ వాహనాలను అనుమతించబోమని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు.

నేడు కేయూ జర్నలిజం విభాగంలో సదస్సు

కేయూ క్యాంపస్, నవంబరు 18:(ఆంధ్రజ్యోతి): కేయూ క్యాంపస్‌లోని జర్నలిజం విభాగంలో నవంబరు 19న మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు కుల గణన- సామాజిక న్యాయం అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు సంగాని మల్లేశ్వర్ తెలిపారు. దీనికి రాష్ట్ర విద్యాకమిషన్ ఛైర్మన్ విశ్వేశ్వర్‌రావు, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కూరపాటి వెంకట్ నారాయణ, రాజారాం తదితరుల హాజరై మాట్లాడుతారని వెల్లడించారు. పూలే ఆశయ సాధన సమితి నేతృత్వంలో సదస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ఖిలావరంగల్, నవంబర్ 18(ఆంధ్రజ్యోతి): నగరంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం ఖిలావరంగల్ శాఖ కార్యదర్శి నలిగంటి అనిల్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. సోమవారం ఖిలావరంగల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ ఇల్లు ఇవ్వలేదన్నారు. గతంలో నిర్మించిన డబ్బుల్ బెడ్‌రూం ఇళ్ళను మరమ్మతు చేసి నిరుపేదలకు ఇవ్వాలని, డిగ్రీ పూర్తిచేసిన యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, మునిసిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంపెల్లి అనిత, ఎన్.రామకృష్ణ, గద్దల వసంత, కె.మస్తాన్, మేకల బాబు, కాంపెల్లి కర ుణాకర్, కాంపెల్లి బాబు, మేత రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు పంపిణీ చేయాలి

బాలసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో నిర్మించిన 594 డబుల్‌బెడ్‌రూమ్‌లు, న్యూశాయంపేటలో నిర్మించిన 1500 డబుల్ బెడ్‌రూమ్‌లు అర్హులైన పేదలకు, భూములు కోల్పోయిన దళితులకు పంపిణీ చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి సాంబయ్య, దూడపాక రాజేందర్, గడ్డం అశోక్, రేణిగుంట చందర్, రాజు, సుకన్య, సుభద్ర, రామంచ సారంగపాణి, రవీందర్, శ్రీను, రాజేష్ పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

జులైవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెడ్ల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుచేసినా ఇప్పటివరకు ఛైర్మన్‌ను నియమించకపోవడం బాధా కరమని తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ పోస్టల్‌కాలనీలోని రెడ్డి సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల పోరాటాల ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో రెడ్డి కార్పొరేషన్‌కు ఛైర్మన్‌తోపాటు నిధులు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి, రావుల నర్సింహారెడ్డి, నల్ల రాజిరెడ్డి, చాడ జైహిందర్‌రెడ్డి, గణపతిరెడ్డి, ముదిరెడ్డి వెంకట్‌రెడ్డి, కామిడి సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించాలి: కాంట్రాక్టర్లు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలో చేసిన అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు పెండింగ్ బిల్లులు రావడం లేదని, సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే వాటిని ఇప్పించాలని బల్దియా కాంట్రాక్టర్ల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం బల్దియా కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు కర్రు రమేష్ మాట్లాడారు. చేసిన పనులకు రెండేళ్లుగా బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని, ముఖ్యమంత్రి వెంటనే రూ.100 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చేసిన పనులకు ఇప్పటికి బిల్లులురాలేదని అన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి సంతోష్‌నాయక్‌తో పాటు కాంట్రాక్టర్లు రాజు, శ్రీనివాస్, పూర్ణచందర్‌రావులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 18: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) వరంగల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వహణ అధికారిగా ఎస్.కవిత, పరిశీలకులుగా కడారి భోగేశ్వర్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా టిట్యూకారి అశోక్, ప్రధానకార్యదర్శిగా ఈదుల వీరస్వామి, ఉపాధ్యక్షులుగా జె.స్వామి, డి.మల్లయ్య, ముజాహిద్ అలీ, కార్యదర్శులుగా బెల్లంకొండ పూర్ణచందర్, పి.సురేష్, మనుపాటి వెంకట్, బి.ప్రసాద్, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా కె.బుచ్చాచారి, రాజన్న, జీవోల కమిటీ కన్వీనర్లుగా బి.జగన్మోహన్, పి.మల్లికార్జున్, అకడమిక్ సెల్ కన్వీనర్లుగా తన్వీర్, కె. ఉమేష్ ఎన్నికయ్యారు.

ఓరుగల్లుకు మహర్దశ

అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు మోక్షం
రూ.4,170 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
మూడు నెలల్లో పనులు చేపట్టాలని ఆదేశాలు



వరంగల్ కార్పొరేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గ్రేటర్ వరంగల్ నగరంతో పాటు 32 విలీన గ్రామాలలో అండర్ గ్రౌండ్ పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. గ్రేటర్ వరంగల్ పరిధిలో మూడు మాసాల్లో అండర్ గ్రౌండ్ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం రూ.4,170 కోట్ల నిధులు కేటాయిస్తూ జీవో నెంబరు 573ను విడుదల చేశారు. కాగా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం 1996 నుంచి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్)లు సమర్పిస్తూనే ఉన్నారు. ప్రజల చిరకాలవాంఛపై రాష్ట్రానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉండేది. 2015లో అప్పటి సీఎం కేసీఆర్ హనుమకొండలో నిర్వహించిన బహిరంగసభలో వరంగల్‌లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేపడుతామని వాగ్దానం చేశారు. కానీ కేసీఆర్ హామీ నెరవేరలేదు. ఈ క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరంగల్ నగరంలో ఈ యేడు జూన్ 29న సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, బల్దియా, కుడా అధికారులతోపాటు ఆర్‌అండ్‌బీ, నీరుపారుదల శాఖ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వరంగల్ నగరానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తే ఇక్కడి ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని ఏకరువు పెట్టారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి వరంగల్ నగరానికి సంబంధించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేసి పంపించాలని సూచించారు. నెల తర్వాత బల్దియా ఇంజనీర్ల సహాయంతో భూగర్భ మురుగు నీటి కాలువను ఎక్కడి నుంచి ఎక్కడికి వేయాలి అని సూత్రప్రాయ ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించారు.

● వరంగల్‌పై ప్రత్యేక శద్ధ

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్ద నగరంగా ప్రసిద్ధిగాంచిన వరంగల్ నగరంపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. దీంతో బల్దియా కమిషనర్ పెట్టిన ప్రతిపాదనకు గ్రీల్ సిగ్నల్ ఇచ్చి రూ.4,170 కోట్ల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రేనేజీ పనులు చేపట్టాలని రాష్ట్ర పురపాలక శాఖను ఆదేశించడంతో వేగవంతంగా జీవోను విడుదల చేశారు.

కాగా, పనులు చేపట్టేందుకు టెండర్ పిలువగా వరంగల్‌లో పనులుచేసేందుకు శుభ్ కన్సల్టెంట్, టెక్నోక్రాట్స్ కంపెనీలు ముందుకు వచ్చాయి. తక్కువ కొటేషన్ వేసిన వారు పనులు దక్కించుకుని మూడుమాసాల తర్వాత పనులకు శ్రీకారం జరుగుతుందని బల్దియా ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.


● రూ.4,170కోట్లతో చేపట్టే పనులు..

గ్రేటర్ వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.4,170 కోట్లతో నిర్మాణం జరిపే పనులను రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించి జీవోలో పొందుపరిచింది. పార్ట్-1 కింద మౌలిక సదుపాయాల పనుల కోసం సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను రూపొందించింది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నీటి పారుదల, నీటి సరఫరా వ్యవస్థ, నీటి వనరుల పునరుజ్జీవనం, జలాశయ నిర్వాహక ప్రణాళిక, బ్లూ-గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూపకల్పన, పవన్ టెలికామ్, కేబుల్, ఇంటర్నెట్ సేవల కోసం భూగర్భ నాలాలు నిర్మాణం చేపట్టాలి. అంతే కాకుండా ఈ పనులను మూడు విడతల్లో పనులు ముగించాలని జీవోలో అదేశించారు. అయితే దశల వారిగా పనులను బట్టి నిధులు విడుదల చేస్తారు. మొదటి విడత రూ.3,087 కోట్లు రెండో విడత రూ.597కోట్లు మూడో విడత రూ. 486 కోట్లు మొత్తంగా రూ.4,170 కోట్లను విడుదల చేస్తుంది. ఇంకా చివరి దశలో మిగిలే పనులకు అదనపు నిధులను కేటాయిస్తారని అధికారులు తెలిపారు.

● ప్రయోజనాలు..

గ్రేటర్ వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించడం వల్ల ప్రధానంగా దోమలు, క్రిమీకీటకాలు బారి నుంచి ప్రజలు సురక్షితంగా ఉంటారని అధికారులు తెలిపారు. అంతేకాకుండా ప్రస్తుతం మురుగు కాల్వలు, డ్రైనేజీలు కనిపించకుండా పోతాయి. ఇళ్లలో నుంచి వెలువడే మొత్తం మురుగు నీరు ఆయా ప్రాంతాలకు అనుసంధానం చేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపుల ద్వారా నగరం బయటకు వెళ్లిపోతాయి. అక్కడ మురుగు నీటిని ప్రత్యేక మిషన్ల ద్వారా నీటి శుద్ధీకరణ చేస్తారు. పైపులలో చెత్త చిక్కి ఇబ్బంది ఏర్పడకుండా ప్రతీ కాలనీలో చెత్తను తొలించేందుకు మ్యాన్‌హోల్స్ వేస్తారు. దీంతో శానిటేషన్ కార్మికులకు శ్రమ తగ్గుతుంది. భూగర్భ గ్రేనేజీ నిర్మించిన తర్వాత ప్రజల నుంచి సెవరేజ్ ట్యాక్స్ (మురుగు నీరు) తరలింపు పన్ను కూడా విధిస్తారనే ప్రచారం జోరుగా సాగుతుంది.

సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు



కాళోజీ కళాక్షేత్రం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు

- నిరసనకారులపై ప్రత్యేక నిఘా, ముందస్తు అరెస్టులు
- బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు
- కమిషనరేట్‌తో పాటు ఇతర జిల్లాల నుంచి బందోబస్తు

హనుమకొండ టౌన్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి మగళవారం హనుమకొండ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో వరంగల్ కమిషనరేట్ పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కుడా గ్రౌండ్‌లో హెలిప్యాడ్ దిగి ఆర్ట్సకళాశాల సభాస్థలికి చేరుకొని తిరిగి హైదరాబాద్‌కు పయన మయ్యే వరకు ఎలాంటి అలజడికి తావు ఇవ్వకుండా పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అవలంబి స్తున్న తీరుపై కొద్ది రోజులుగా విమర్శలు చేస్తున్న వివిధ పార్టీల నాయకులతో పాటు నిరసనకారులపై ప్రత్యేక నిఘా వేసింది. సీఎం పర్యటించే కాళోజీ కళాక్షేత్రం, ఆర్ట్స్ అండ్ సైన్స్ గ్రౌండ్, సీఎం కాన్వాయి ప్రయాణించే మార్గంలో ఎస్‌బీ, ఇంటెలిజెన్స్, స్థానిక పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఉగ్రవాద చర్యల నుంచి ముప్పు లేకుండా డాగ్‌స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌తో సీఎం పర్యటించే ప్రాంతాలను జల్లెడ పడుతు న్నారు. రెండు, మూడు అంచెల్లో భద్రత చర్యలు తీసుకున్నట్లుగా నిఘా వర్గాలు తెలిపాయి. అపరిచిత వ్యక్తుల కదలికలను పసిగట్టేందుకు టాస్క్ ఫోర్స్ టీంలతో పాటు క్రైం పోలీసులు, లాఅండ్‌ఆర్డర్ పోలీసులు మఫ్టీలో విధులకు హాజరుకానున్నారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొనే ఈ పర్యటన ప్రశాంతంగా జరిగేందుకు సీపీ అంబర్ కిషోర్ ఝా పర్యవేక్షణలో ఎస్పీల నుంచి హోంగార్డుల వరకు సుమారు 1500 పోలీసులను వినియోగిస్తున్నట్లుగా విశ్వసనీయమైన సమాచారం. 1500 మందిలో వరంగల్ కమిషనరేట్ నుంచి 800 మంది. ఇతర జిల్లాల నుంచి 700 మంది సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటుండగా వారిలో ఏడుగురు ఎస్పీలు, 20 మంది డీఎస్పీలు, మిగతా వారిలో సీఐల నుంచి హోంగార్డుల వరకు ఉన్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి.

● పోలీసుల వలయంలో కాళోజీ కళాక్షేత్రం

బాలసముద్రం: సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనలో భాగంగా పోలీసులు సోమవారం కాళోజీ కళాక్షేత్రం వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ములుగు ఏఎస్పీతోపాటు, పరకాల, నర్సంపేట ఏసీపీలు వివిధ పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్సైలు, వందలాది మంది పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహించడంతో కళాక్షేత్రం పోలీసు వలయంలోకి వెళ్లింది. ఒకవైపు బీఆర్ఎస్, మరోవైపు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమాలను అడ్డుకుంటామని ప్రకటనలు చేస్తుండడంతో హనుమకొండలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్న ప్రాంతాలలో పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. కాళోజీ కళాక్షేత్రం వద్దకు వస్తున్న వారి వివరాలను పోలీసులు అడిగి తెలుసుకున్నారు. సీఎం పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు.

సభా ఏర్పాట్లను పరిశీలించిన అదనపు డీజీపీ

● బందోబస్తు నిర్వహణపై దిశా, నిర్దేశం



సభ ఏర్పాట్ల పరిశీలనలో అదనపు డీజీపీ మహేశ్ భగవత్

కాళోజీ జంక్షన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ విజయోత్సవ సభ భద్రతా ఏర్పాట్లను అదనపు డీజీపీ మహేశ్ భగవత్ సోమవారం రాత్రి పరిశీలించారు. హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం జరిగే కాంగ్రెస్ విజయోత్సవ సభ బందోబస్తు, భద్రతా, పార్కింగ్ ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించారు. జిల్లా పోలీస్ అధికార యంత్రాంగాన్ని ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సభ ముగిశాక కూడా ట్రాఫిక్ క్లియరెన్స్ పూర్తయ్యే వరకు పోలీసులు విధుల్లో నిమగ్నం కావాలని దిశా, నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీ అంబర్ కిషోర్ ఝా, ఏసీపీ దేవేందర్‌రెడ్డి భద్రతా చర్యలను అదనపు డీజీపీకి వివరించారు.

● అధికారులతో చిత్రారాంచంద్రన్ సమీక్ష

ముఖ్యమంత్రి సభ కార్యక్రమాల నిర్వహణ అంశాలపై మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిత్రారాంచంద్రన్ జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు. సభ వేదికపైనే గంటకు పైగా వివిధ అంశాలపై వారితో చర్చించారు.

● మహిళా కళాకారుల రిహార్సల్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభ వేదికకు చేరే క్రమంలో స్వాగతం పలికే కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను మహిళా కళాకారులు సోమవారం రాత్రి వరకు రిహార్సల్ చేశారు. మహిళా కళాకారులు ప్రదర్శించిన డప్పు వాయిద్యం వేదిక వద్ద ఉన్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులను ఆకర్షించింది.

నాడు కాంగ్రెస్ 300 గజాల స్థలం ఇవ్వలేదు

బాలసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం కోసం మూడు వందల గజాల స్థలం ఇవ్వలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ వరంగల్ నగరంలోని ముఖ్యమైన స్థలాన్ని కేటాయించి నిర్మాణాలు చేసినట్లు మాజీ ఎంపీ బోయినపెల్లి వినోద్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు కాకముందు కాళోజీ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు హైదరాబాద్ వెళ్లి కాంగ్రెస్ పెద్దలను గతంలో కలిసి మూడు వందల గజాల స్థలం కేటాయించాలని అడిగినా ఇవ్వకుండా తిరస్కరించినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కాళోజీ కళాక్షేత్రం చూసి ఏం సమాధానం చెబుతారో చెప్పండి అని ప్రకటనలో వినోద్‌కుమార్ ప్రశ్నించారు.

ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన నాయిని

హనుమకొండ సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగే కాంగ్రెస్ విజయోత్సవ సభ క్రమంలో ఏర్పాటైన మహిళా శక్తి ఫోటో ఎగ్జిబిషన్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్లు ప్రావీణ్య సత్యశారద తదితర అధికారులతో పాటు టీపీసీసీ నాయకుడు బొద్దిరెడ్డి ప్రభాకర్, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు పాల్గొన్నారు. ఎగ్జిబిషన్‌లో మహిళా సంఘాల ద్వారా ఏర్పాటైన వివిధ స్టాల్స్‌ను రాజేందర్‌రెడ్డి పరిశీలించారు.

హామీలను అమలు చేయాలి

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ నాయకులు ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పొదిల సాయిబాబా మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలందరికీ ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, ఒక ఎకరం సాగుభూమి, నాలుగు గదుల ఇల్లు అందజేయాలని కోరారు.

విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం

● సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

బాలసముద్రం, ననవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్రంలో అతిపెద్ద నగరం హైదరాబాద్ తరహాలో వరంగల్ మహానగరంలో భారీ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మండల సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రె భిక్షపతి మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన హామీలు కాజీపేటలో రైల్వే కోచ్ పరిశ్రమ ఎప్పుడు ఏర్పాటు చేస్తారో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమం మరిచి కార్పొరేట్ పెట్టుబడి వ్యవస్థకు అనుకూలంగా ప్రభుత్వం రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. సీపీఐ పార్టీ శత ఆవిర్భవ దినోత్సవ వేడుకలను డిసెంబరు 10 నుంచి 26 వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామ, గ్రామాన నగరంలో జెండా అవిష్కరణలు చేయడంతో పాటు, ప్రజల సమస్యలను పరిష్కారం చేసి పార్టీని విస్తరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గుండి రాజేందర్, జిల్లా నాయకులు తోట భిక్షపతి, శ్రీనివాస్, కొట్టెపాక రవి, సుదార్శన్, కండె నర్సయ్య, దేవ, రాము, ప్రశాంత్, కంచర్ల ప్రభాకర్ లావుడ్య రమ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కళాకారులు

బాలసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కాళోజీ కళాక్షేత్రం పూర్తి కావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉమ్మడి వరంగల్ జిల్లా కళాకారులు రుణపడి ఉంటారని రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాధారపు సంజీవరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకుగాను సోమవారం కాళోజీ కళాక్షేత్రం ఎదుట సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం రంగస్థల, జానపద కళాకారులు స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కాజీపేట తిరుమలయ్య, బాలాజీనాయక్, చక్రపాణి, కాంతారావు, శ్యామలరావు, సదానందచారి, రమేష్, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, పిట్టల కృష్ణ, ప్రసాద్, సుధాకర్, సారంగపాణి, బిక్షపతి, మక్బూల్‌లు పాల్గొన్నారు.

● న్యాయవాదుల ఆధ్వర్యంలో..

వరంగల్ లీగల్: హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ ఛైర్మన్ తోట రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు రూ.205కోట్ల నిధులు, మాస్టర్‌ప్లాన్ ఆమోదం, నిధుల కేటాయింపును పురస్కరించుకొని న్యాయవాదులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ స్టేట్ మాజీ జాయింట్ సెక్రటరీ తొగరు జగన్‌మోహన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ మెంబర్ భైరపాక జయాకర్, వేముల రమేశ్, నరసింహారావు, నల్ల మహాత్మా, పనుల యాకస్వామి, భాస్కర్‌రెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిది మహిళలను దగా చేసిన సభ

బాలసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న మహిళ ప్రగతి సభ కాదని, మహిళలను దగాచేసే సభా అని మాజీ రైతుబంధు జిల్లా సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎల్లావుల లలిత ఒక ప్రకటనలో విమర్శించారు. అమలుకానీ హామీలతో ఎన్నికల్లో మహిళల ఓట్లతో గెలిచిన సీఎం రేవంత్‌రెడ్డి మహిళల సంక్షేమం కోసం విస్మరించారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుమార్‌యాదవ్, హరికృష్ణ, రాజు, బండి రజిని, చిన్న స్వామి ఎదాసు, జి. రామ్మూర్తి, ప్రభాకర్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 19 మందికి జరిమానా

మట్టెవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 19 మందికి రూ.21,600 జరిమానా పడింది. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఇద్దరికి రూ. 1000 జరిమానా విధిస్తూ సోమవారం మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ తీర్పు చెప్పారు.

మెట్టుగుట్టపై కార్తీక పూజలు

మడికొండ, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మెట్టుగుట్టపై స్వామివారికి ప్రాతఃకాల రుద్రాభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం రుద్రాభిషేకం, పవళింపు సేవ నిర్వహించారు. ఛైర్మన్ పైడిపాల రఘుచందర్, ఈవో శేషుభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ, ఓం నమశ్శివాయ గురూజి, పెద్ది ప్రభాకర్, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, భైరి రాజు, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, కేదారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దశాబ్దాల కలను నెరవేర్చిన సీఎం

హనుమకొండ సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర వాసుల దశాబ్దాల కలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెరవేర్చారని టీపీసీసీ నాయకులు బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం వారు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నగరవాసుల కలలను రేవంత్‌రెడ్డి నిజంచేశారని, రూ.4వేలకోట్లకు పైగా నిధులు కేటాయించారని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ద్వారా ముంపు సమస్య పరిష్కారం అవుతుందన్నారు. మాస్టర్‌ప్లాన్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ద్వారా వరంగల్ రూపురేఖలు మారిపోతాయన్నారు.

పొదుపుతో ప్రగతి.. జాతీయస్థాయి కీర్తి

ఆదర్శం

స్వయం ఉపాధిలో రాణిస్తున్న మహిళలు

జాతీయ స్థాయిలో మొదటి స్థానం దక్కించుకున్న ఎల్కతుర్తి సమాఖ్య



విజయానందంలో ఎల్కతుర్తి సమాఖ్య సభ్యులు

ఎల్కతుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నెలనెల పొదుపుతో పాటు బ్యాంకులు ఇచ్చిన రుణా టలను తీసుకుని వాటిని సద్వినియోగం చేసుకున్న ఎల్కతుర్తి మండల సమాఖ్య సభ్యులు ఆర్థిక ప్రగతి, స్వావలంబన సాధించడంతో పాటు జాతీయస్థాయిలోనే ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. ఇతర మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆదర్శంగా నిలిచారు. ఎల్కతుర్తి మండల సమాఖ్య పరిధిలో 942 గ్రామైక్య సంఘాలున్నాయి. ఒక్కో సంఘంలో 10 నుంచి 15 మంది సభ్యులు ఉన్నారు. మండల వ్యాప్తంగా 10,422 మంది సభ్యులు ఈ సంఘాల్లో కొనసాగుతున్నారు. ప్రతీ నెల పొదుపులతో పాటు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని అనేక కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకున్నారు. పాఠశాలలకు యూనిఫామ్‌లు, దుస్తుల వ్యాపారం, కూరగాయల పంటల సాగు, పిండి వంటల తయారీ కేంద్రాలు, పేపర్ ప్లేట్ల తయారీ, పిండి గిర్నీలు, కిరాణా షాపులు ఏర్పాటు చేసుకుని వాటిని మార్కెటింగ్ చేస్తూ లబ్ధి పొందుతున్నారు. వీటితో పాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తూ స్వయం సమృద్ధి సాధిస్తున్నారు. మండల సమాఖ్య అధ్వర్యంలో రూ.7.70లక్షలతో వ్యవసాయ పరికరాలను కొనుగోలు చేసి వాటిని కిరాయికి ఇస్తూ లాభాలు ఆర్జిస్తూ ఔరా అనిపిస్తున్నారు. ఎల్కతుర్తి మండల పరిధిలోని మహిళ స్వయం సహాయక సంఘాలు క్రమ శిక్షణకు మారుపేరుగా నిలిచాయి. క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవడం, అధికారుల సూచనలు పాటించడం, రుణాల తిరిగి చెల్లింపుల్లో వంద శాతం వృద్ధి, క్రమం తప్పకుండా పొదుపు చేసుకోవడం, రికార్డులను నమోదు ప్రక్రియ, ఆర్థిక లావాదేవీలను పారదర్శకంగా నిర్వహించడం ఈసమాఖ్య విజయానికి కారణాలుగా చెబుతున్నారు.

ఉత్తమ సమాఖ్యగా జాతీయ స్థాయికి..

ఉత్తమ పనితీరు కలిగిన ఎల్కతుర్తి మండల ఎస్‌హెచ్‌జీ (మండల మహిళ సమాఖ్య) జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. దేశ వ్యాప్తంగా ఉత్తమ పనితీరు కనబరిచిన ఎస్‌హెచ్‌జీల నుంచి ఏపీ మాస్ (ఆంధ్ర ప్రదేశ్ మహిళ అభివృద్ధి సంస్థ), ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), ఇతర ఏజెన్సీల మద్దతుతో దేశ వ్యాప్తంగా గత అగస్టులో మొదటి విడత, సెప్టెంబరు 9న రెండవ విడతలో ఎస్‌హెచ్‌జీ (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్) ఫెడరేషన్ల నుంచి 200 నామినేషన్లను స్వీకరించింది. ఇందులో ఎల్కతుర్తి ఎస్‌హెచ్‌జీ - 2024కు దేశవ్యాప్తంగా మొదటి స్థానంలో ఎంపికైంది. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి సారిగా ఎల్కతుర్తి ఎస్‌హెచ్‌జీ ఎంపిక కావడం విశేషం.



పిండి వంటలు తయారు చేసిన గ్రామ సంఘం



జిల్లులలో పెరటి కోళ్ల మదర్ యూనిట్

22న అవార్డు అందుకోనున్న అధ్యక్షురాలు స్వర్ణలత



ఏపీ మాస్, ఎస్‌బీఐలతో పాటు మరిన్ని ఏజెన్సీలు ఎల్కతుర్తి ఎస్‌హెచ్‌జీని జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక చేయగా ఈ నెల 22న హైదరాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి సదస్సులో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆర్. స్వర్ణలత అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా స్వర్ణలత 'ఆంధ్రజ్యోతి'తో తమ ఆనందాన్ని పంచుకున్నారు. మండల పరిధిలోని 10,422 మంది సభ్యులు క్రమ శిక్షణ, సమైక్య లావాదేవీలను పారదర్శకంగా నిర్వహించడం, అధికారుల సూచనల మేరకు పనిచేయడంతో జాతీయ స్థాయి అవార్డు ఎంపికయ్యామన్నారు. ఈ అవార్డు తమలో మరింత ఉత్సాహం నింపిందని, ఇదే స్ఫూర్తితో మరింతగా శ్రమించి ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు.

సమష్టి కృషితోనే జాతీయ స్థాయి గుర్తింపు

రవిందర్, ఏపీఎం




స్వశక్తి సంఘాలు, వీవోలు, సీసీలు, ఐకేపీ సిబ్బంది సమష్టి కృషితోనే ఎల్కతుర్తి ఎస్‌హెచ్‌జీకి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించడానికి శక్తి వంచన లేకుండా కుటీర పరిశ్రమలు నడిపించి లబ్ధిపొందుతున్నారు. ఉన్నతాధికారుల సూచనలతో మండల సమాఖ్య సభ్యులకు సూచనలు, సలహాలు ఇస్తూ వారిని ముందుకు తీసుకెళ్లడం జరుగుతోంది. ఎల్కతుర్తి ఎస్‌హెచ్‌జీకి జాతీయ స్థాయిలో అవార్డు దక్కించుకోవడం గర్వకారణంగా ఉంది.

ఐదేళ్లలో పొందిన రుణాలు, గడించిన లాభాలు

ఏడాది	సంఘాలు	పొందిన రుణాలు	లాభాలు
2020-21	806	రూ. 23.57కోట్లు	రూ. 12.08కోట్లు
2021-22	524	రూ. 30.56కోట్లు	రూ. 8.81కోట్లు
2022-23	430	రూ. 36.17కోట్లు	రూ. 5.41కోట్లు
2023-24	489	రూ. 36.77కోట్లు	రూ. 7.27కోట్లు
2024-25	203	రూ. 28.33కోట్లు	రూ.4.64లక్షలు

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు బీమా ధీమా

- రూ.10లక్షల మేరకు వర్తింపు
- మరణించిన సభ్యురాలి రుణం మాఫీ
- బకాయిలు మినహాయించి మిగతా సొమ్ము చెల్లింపు
- ఉమ్మడి జిల్లాలో 10 లక్షల మంది సభ్యులకు లబ్ధి
- మృతిచెందిన సభ్యుల కుటుంబాలకు నేడు చెక్కులు అందించనున్న సీఎం



హనుమకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లో పభ్యులుగా ఉన్న మహిళలకు ఆపన్న హస్తం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. సంఘ సభ్యురాలిగా ఉండి రుణ తీసుకున్న మహిళ ఏదైనా కారణంతో చనిపోతే ఆ రుణం మొత్తం మాఫీ అయ్యేలా వారి పేరిట బీమా చేయాలని నిర్ణయించింది. వారిపై భారం పడకుండా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరించేందుకు ఇప్పటికే రూ.50.41 కోట్లు మంజూరు చేసింది. అంతేగాక ఈ బీమా ప్రయోజనాలను ఈ ఏడాది మార్చి 14నుంచే వినియోగించుకునే వెలుసుబాటు కల్పించింది. బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు స్త్రీనిధి రుణాలకు కూడా రుణ బీమా వర్తించనుంది. క్షేత్రస్థాయిలో బీమా క్లెయిమ్ చేసే విధానంపై ఇప్పటికే సెర్ప్, మెప్మా సిబ్బందికి మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఈ పథకం వచ్చే నెల నుంచి అమలులోకి తీసుకువచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. బీమా పథకం గురించి మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమం చేపట్టేందుకు డీఆర్‌డీఏ ఏర్పాట్లు చేస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు ఆర్థికంగా చేయూతనిస్తూ వారిని అన్ని రంగాల్లో చైతన్య పరిచేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా వారిని మరింతగా ఆదుకునేందుకు తాజాగా సురక్ష బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. సభ్యురాలు ఎవరైనా మరణిస్తే వారు కట్టాల్సిన బకాయిలను బీమా సొమ్ము నుంచి మినహాయించుకొని మిగతా డబ్బు కుటుంబానికి చెల్లిస్తారు.

ఈ ఏడాది మార్చి నుంచి ఈ పథకాన్ని వర్తింపజేయనున్న దృష్ట్యా అప్పటి నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎందరు స్వయం సహాయక సంఘ సభ్యులు మృతి చెందారో వారి వివరాలు సేకించారు. మంగళవారం జరిగే ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయం సహాయక సం ఘాల సభ్యులతో ఇష్టాగోష్ఠి నిర్వహించడంతో పాటు సురక్ష బీమా పథకం కింద గత మార్చి నెల నుంచి ఇప్పటి వరకు మృతి చెం దిన సభ్యుల కుటుంబాలకు బీమా చెక్కు లను అందజేయనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1.26 లక్షల స్వయం సహాయక సంఘాలు ఉండగా వీటిలో 10 లక్షల మందికి పైగా సభ్యులు ఉన్నారు. రూ.800 కోట్ల మేరకు రుణలావా దేవీలు నడుస్తున్నాయి. ఇక సభ్యురాలు ఎవరైనా ప్రమాదంలో మృతి చెందితే ఆమె రూ.10లక్షలు, సాధారణ మరణానికి అయితే రూ.2లక్షల బీమా వర్తిసుతంది.

బీమా సొమ్ము కోసం ఇలా...

సభ్యురాలు చనిపోతే ఆ సమాచారం గ్రామం, పట్టణాల్లోని ఐకేపీ, మెప్మా సిబ్బందికి తెలియజేయాలి. సభ్యురాలి వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. ఆ వివరాలు స్త్రీనిధి సహాయ మేనేజర్‌కు, ఇక్కడి నుంచి జనరల్ మేనేజర్‌కు వెళ్తాయి. మరణ ధ్రువీకరణ పత్రం, సంఘం సభ్యురాలి వివరాలు సరిగా ఉన్నాయో ? లేదో ? జీఎం పరిశీలించి బీమా సొమ్ము మంజూరు చేస్తారు. ఇప్పటికే ఐకేపీ సిబ్బందికి దీనిపై శిక్షణ ఇచ్చారు.

ఉమ్మడి జిల్లాలో మహిళా శక్తి భవనాలు

రూ.25కోట్లతో నిర్మాణం

నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న సీఎం

హనుమకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం వరంగల్ పర్యటన సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నిర్మించనున్న 22 ఇందిరా మహిళా శక్తి సంఘాలకు శంకుస్థాపన చేయనున్నారు. జిల్లాకు ఒకటి చొప్పున వీటిని నిర్మిస్తారు. ప్రస్తుతం పది జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలు ఉన్నాయి. మిగిలిన 22 జిల్లాలకు సంబంధించి హనుమకొండ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కాలేజీలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల మేళా వేదికగా వర్చువల్‌గా వీటికి శంకుస్థాపన చేస్తారు. వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి ఐదు ఉన్నాయి. హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒక్కొక్కటి చొప్పున వీటిని నిర్మించనున్నారు. వరంగల్ జిల్లాలో జిల్లా మహిళా సమాఖ్యకు సొంత భవనం ఉన్నది. ఒక్కో భవనాన్ని రూ.5కోట్లతో నిర్మిస్తారు. మొత్తం రూ.25కోట్లతో ఈ భవనాల నిర్మాణం జరుగుతుంది. జిల్లా మహిళా సమాఖ్య కోసం ప్రధాన కార్యాలయం, శిక్షణ కేంద్రం, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్, కామన్ వర్క్‌షెడ్ తదితర అవసరాలకు అనువుగా ఈ ఇందిరా మహిళా శక్తి భవన్‌లను నిర్మిస్తారు. హనుమకొండ జిల్లాకు సంబంధించి హసనపర్తిలోని సంస్కృతి విహార్ ప్రాంగణంలోనే ఈ ఇందిర మహిళా శక్తి భవన్‌ను నిర్మిస్తారు. ఇందుకోసం ఎకరం స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది.

ఏడాదిలోనే హామీలను నెరవేరుస్తున్నాం

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగర అభివృద్ధి : మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి కొండా సురేఖ


హనుమకొండ సిటీ/వడ్డెపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో వరంగల్ నగర అభివృద్ధికి ఇచ్చిన హామీలను ఏడాదిలోనే నెరవేరుస్తున్నామని, బీఆర్ఎస్ మాటలతో పదేళ్ల వెళ్లదీస్తే.. తాము అభివృద్ధి చేసి చూపుతున్నామని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ వెల్లడించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న విజయోత్సవ సభ ఏర్పాట్లను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి వారు పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. తొలుత శ్రీధర్‌బాబు మట్లాడుతూ రాష్ట్ర ఏర్పడ్డాక అనేక సమస్యలు పరిష్కారానికి నోచు కోలేదని, పదేళ్ల బీఆర్ఎస్ పాలన నిర్లక్ష్యం, స్వార్థపూరిత పాలనలో రాష్ట్రం అప్పులమయమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సమస్యల పరిష్కారాన్ని సవాల్‌గా తీసుకుని.. ప్రజలకు ఇచ్చిన ప్రతీ మాటను నిలబెట్టుకుంటున్నామన్నారు. సంవత్సరంలోగా టనే వరంగల్ నగరానికి ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకొచ్చామని చెప్పారు. మామునూరు ఎయిర్‌పోర్టు, మాస్టర్‌ప్లాన్ ఆమోదం, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ తదితర పనులతో వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. మంత్రి సురేఖ మాట్లాడుతూ తమది చేతల ప్రభుత్వమని, రాష్ట్రం అప్పుల ఊబిలోకి పోయినా ప్రజలకు ఇచ్చిన మాటే శాసనంగా భావించి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పరిపాలిస్తున్నామన్నారు. మైకుల ముందు ఊదరగొట్టిన బీఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు చెమటలు పడుతున్నాయని దుయ్యబట్టారు. చరిత్రలో నిలిచేలా సభను నిర్వహించనున్నట్లు మంత్రి సురేఖ పేర్కొన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాటాడుతూ.. ముఖ్యమంత్రికి వరంగల్ నగరం రుణపడి ఉంటుందని అన్నారు. నగరాభివృద్ధికి వేలకోట్ల నిధులు కేటాయించారని, అడిగిన వెంటనే మంజూరు చేశారన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండు సుధారాణి, టీపీసీసీ నాయకుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈవీ శ్రీనివాస్, డాక్టర్ పులి అనిల్ కుమార్, మీసాల ప్రకాశ్, మండల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అలాగే కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హన్మంతరావు పలువురు జిల్లా నాయకులతో కలిసి సభాస్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. ఇందిరాగాంధీ నిరుపేద ప్రజలకు కేటాయించిన భూములను సైతం బీఆర్ఎస్ నాయకులు లాగేసుకున్నారని ఆరోపించారు.

బీఆర్ఎస్ ఇక మూట ముల్లె సర్దేసుకోవాల్సిదే అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే విజయమన్నా రు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలన స్వార్థ పూరితమైందన్నారు. జనాభా ప్రాతిపదికన కేం ద్రంలో పదవుల కేటాయింపు జరగలేదన్నారు.

ప్రజలకు ఏంచేశారో సీఎం సమాధానం చెప్పాలి

- బూటకపు హామీలతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

బాలసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలకు ఏం చేశారో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని, మహిళలు, విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయో సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ తదితరులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి అబద్ధపు వాగ్దానాలు చేసి గెలిచారని, మహిళలకు రూ.2,500 సాయం, కల్యాణలక్ష్మిలో తులం బంగారం, స్కూటీలు ఇస్తానని ఇవ్వకుండా.. వరంగల్‌లో ప్రజాపాలన పేరుతో విజయోత్సవ సభ పెడుతున్నావని విమర్శించారు. జిల్లాకో మహిళా సంఘం భవనం నిర్మిస్తామంటున్నది ప్రభుత్వ నిధులతో కాదని, స్వయం సహాయక బృందం కొనుగోలు చేసిన భూముల్లోనేనని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణవాదులపై తుపాకులు ఎక్కుపెట్టిన వారు కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తే కాళోజీ ఆత్మ ఘోషిస్తుందన్నారు. 95 శాతం పనులు తమ బీఆర్ఎస్ ప్రభుత్వంలో పూర్తి చేసినవేనని, దీని నిర్మాణం కోసం రూ.75కోట్లు ఖర్చు చేశామన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్కవర్గం సంతోషంగా లేరన్నారు. ఏడాది గడవకముందే 600 మంది రైతులు, 87 మంది ఆటోడ్రైవర్లు, 26 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. పురుగుల అన్నం, విషాహారం తిని వందల మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని, 350పైగా విద్యార్థులు మరణించారని తెలిపారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్ చొరవతో వస్త్రపరిశ్రమ ఏర్పాటుకు 1,350 ఎకరాల భూసేక రణ చేశారని తెలిపారు. తమ హయాంలోనే టెక్స్‌టైల్ పార్కులో పలు కంపెనీలు ఏర్పాటయ్యా యని, ఇప్పుడు నూతనంగా ఏర్పాటైన కంపెనీల ను ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ యేడాది పాలన సందర్భంగా సభకు రైతులు వచ్చే పరిస్థితి లేదు కనుకే మహిళలతో సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. 42 లక్షలమంది రైతులలో 40శాతం మందికే రుణమాఫీ జరిగింద న్నారు. తెలంగాణ సంపదను హెలికాప్టర్లు వేసుకొనిపోయి రాహుల్‌గాంధీకి దోచిపె డుతున్నారని ఆరోపించారు.

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వ రంతోనే వ్యవసాయ రంగానికి ఒక గుర్తింపు వచ్చిందని, సంక్షోభంలో ఉన్న విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య మాట్లాడు తూ సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీలకు చేసింది గుండు సున్న అని అన్నారు. కడియం శ్రీహరి కులగణన లో ఏ కులం రాసిస్తాడో చూడాలన్నారు. మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. లగచర్ల లో లంబాడీలను తుపాకులతో బెదిరిస్తే భయపడరని అన్నారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. వరంగల్ ఎంజీఎంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. చేనేత బీమా గురించి, వరంగల్ బస్టాండ్ నిర్మాణం గురించి అడగలేని చేతకాని మంత్రి వరంగల్‌లో ఉన్నారని విమర్శించారు. ఈ సమావేశంలో 'కుడా' మాజీ చైర్మన్లు సుందర్‌రాజ్‌యాదవ్, మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మేడిపెల్లి శోభన్‌బాబు, నయీముద్దీన్ బీఆర్ఎస్ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి.. పట్టాలెక్కుతోంది!

(3వ పేజీ తరువాయి)

అమల్లోకి తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుంది.

ఎయిర్‌పోర్టుకు తొలగిన అడ్డంకులు

వరంగల్ ఎయిర్‌పోర్టుకు ప్రధాన అడ్డంకిగా ఉన్న భూసేకరణ సమస్యకు ప్రభుత్వం తెర దించింది. వరంగల్ ఎయిన్‌పోర్టుకు 253 ఎకరాల భూసేకరణకు రూ.205కోట్లు కేటాయిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎయిర్‌పోర్టు నిర్మాణంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు. అలాగే హైదరాబాద్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పందం మేరకు 150కి.మీ పరిధిలో 2038 వరకు మరో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మామునూరు 145కిలో మీటర్ల లోపే ఉంది. ఈ నిబంధనల సడలింపుపై ప్రభుత్వం అభ్యర్థన మేరకు జీఎంఆర్ నుంచి సానుకూలంగా స్పందించి ఎన్‌వోసీ కూడా ఇచ్చింది. దీంతో వరంగల్ ఎయిర్ పోర్టుకు దశాబ్ధకాలంకు పైగా 150కి.మీ నిబంధనతో పాటు భూసేకరణే ప్రధాన అడ్డంకిగా ఉండేది. అయితే ఈ రెండు అడ్డంకులు తొలగటతో వరంగల్ ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ఓరుగల్లు వాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

వస్త్రనగరికి మంచి రోజులు

కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కును 1,350 ఎకరాల విస్తరణలో గత ప్రభుత్వం నిర్మాణం చేసింది. రూ.567కోట్లతో టెక్స్‌టైల్ పార్కులో టీఎస్‌ఐఐ ద్వారా రహదారులు, ఇతర మౌళిక వసతులు కల్పించారు. అయితే వరంగల్‌కు మరో వస్త్రనగరిగా అభివృద్ధి జరుగుతుందని భావించినప్పటికి ఆశించిన స్థాయిలో పెట్టుబడులు రాలేదు. కేవలం కైటెక్స్, గణేషా ఎకోపెట్, ఎకోటెక్, కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీలు మాత్రమే పరిశ్రమలు స్థాపించాయి. అయితే వీటిలో స్థానికులకు పెద్దగా ఉపాధి అవకాశాలు రాలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి టెక్స్‌టైల్ పార్కును సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. మొదటి భూ నిర్వాసితులకు ఇంటి స్థలాలను కేటాయించారు. ఇటీవల 836మందికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున మంజూరు చేశారు. తాజాగా ఆదివారం మెగా టెక్స్‌టైల్ పార్కులో అభివృద్ధి పనులకు రూ. 160.99కోట్లు మంజూరు చేస్తు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో పాటు ఆగస్టు 12వ తేదీన దక్షిణ కొరియాలో ఐటీ మంత్రి శ్రీధర్‌బా బుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కులో పెట్టుబడులకు అక్కడి కంపెనీలతో జరిపిన చర్చలు ఫలించాయి. దీంతో త్వరలోనే భారీగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉండటంతో స్థానికులు ఉపాధి అవకా శాలు పెరగనున్నాయి.

మరిన్ని అభివృద్ధి అడుగులు..

వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పట్టుబట్టి అండర్ గ్రౌండ్ డ్రైయినేజీని సాధించారు. అలాగే వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి రూ.32.50కోట్లు విడుదల చేస్తూ జీవో విడుదల చేసింది. కాళోజీ కళాక్షేత్రానికి రూ.92కోట్లు ఖర్చు కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.45కోట్లు, భద్రకాళి మాఢవీధులకు రూ.30కోట్లు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి రూ.22.50కోట్ల నిధులు కేటాయించారు. వరంగల్ నగర అభివృద్ధికి సుమారు రూ.6వేల కోట్లకు పైగా నిధులు కేటాయించారు.

ఐటీ అభివృద్ది దృష్టి పెట్టండి సారూ..

వరంగల్‌ను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేస్తామని గత ప్రభుత్వం హడవుడి చేసింది. మడికొండలో శివారుల్లో 27 ఎకరాల్లో ఐటీ పార్కును 2016లో అభివృద్ధి చేశారు. బెంగుళూరు, మైసూరు తరహాలో వరంగల్‌లో ఐటీని అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చారు. అయితే ఆశించిన స్థాయిలో కంపెనీలు వరంగల్‌కు రాలేదు. దీంతో వచ్చిన కంపెనీల్లో కొన్ని సౌకర్యాలు లేవంటూ హైదరాబాద్‌కు తరలిపోయాయి. దీంతో ఐటీ ఉద్యోగాల కోసం వరంగల్ యువత హైదరాబాద్, బెంగుళూరు లాంటి నగరాలకు వెళ్లాల్సి వస్తుంది. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపితే వరంగల్‌కు ఐటి కంపెనీలు వచ్చే అవకాశం ఉంది. హైదరాబాద్-వరంగల్ రహదారిని ఇండస్ట్రీయల్ కారిడార్‌గా అభివృద్ధి చేసే అవకాశం ఉంది. ఆ దిశగా సీఎం చొరవ తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

భద్రకాళి ఆలయాన్ని పట్టించుకోండి..

వరంగల్‌లోని చారిత్రక ఆలయాల్లో ఒకటైన భద్రకాళి ఆలయ అభివృద్ధి సంబంధించి కూడా పట్టించుకోవాలని భక్తులు కోరుతున్నారు. విజయవాడ దుర్గాదేవి తరహాలోనే తెలంగాణలో భద్రకాళిని భక్తులు కొలుస్తుంటారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలొస్తుంటారు. అలాగే యాదగిరిగుట్ట, వేములవాడ, కొండగట్టు ఆలయాల అభివృద్ధికి నిధులిచ్చినట్టుగానే భద్రకాళి దేవస్థానం అభివృద్ధికి కూడా రూ.100కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించాలని భక్తులు కోరుతున్నారు.



హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్టాళ్లు

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న నేపథ్యంలో మంగళవారం హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ప్రజాపాలన విజయోత్సవ సభను నిర్వహిస్తున్నారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. వరంగల్ సెంట్‌మెంట్‌ను కొనసాగిస్తున్నారని, ఆయన టీపీసీసీ అధ్యక్షుడిగా రైతు డిక్లరేషన్ సభ నిర్వహించిన మైదానంలోనే ఈ సభను నిర్వహిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. రాష్ట్రంలోనే నిర్వహిస్తున్న తొలి సభలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న తీరు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ప్రగతిని వివరించనున్నారు. సుమారు రెండున్నర గంటలు వరంగల్‌లో సీఎం పర్యటన కొనసాగనుండగా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ పోలీసు బందోస్తుతో ఏర్పాటు చేయడంతోపాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ సభలో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.


పర్యటన జరగనుందిలా..

మంగళవారం మధ్యాహ్నం 2.30గంటలకు హయగ్రీవచారి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకోనున్న సీఎం 3గంటలకు కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం కళాక్షేత్రాన్ని పరిశీలించి, కవులు, కళాకారులతో ముచ్చటిస్తారు. అనంతరం మ.3.10గంటలకు కాళోజీ కళాక్షేత్రం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి మ.3.20కి ఆర్ట్స్ కాలేజీకి చేరుకోనున్నారు. మధ్యాహ్నం 3.20గంటల నుంచి 3.50గంటల వరకు ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన మహిళ శక్తి స్టాళ్లను పరిశీలించి, ఎస్‌హెచ్‌జీ, ఎంఎస్, జడ్ఎస్ మహిళ గ్రూపు సభ్యులతో మాట్లాడనున్నారు. మ.3.55 ఆర్ట్స్‌కాలేజీలో విజయోత్సవ సభ వేదికపైకి చేరుకోనున్నారు. సీఎస్ శాంతకుమారి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో సాయంత్రం 4గంటల నుంచి 4.20 వరకు మంత్రులు ప్రసంగించనున్నారు. సా.4.20గంటల నుంచి 4.30గంటల వరకు 22 మహిళ శక్తి భవనాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఎంజీఎంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ జెండర్ క్లినిక్‌ను వర్చువల్‌గా ప్రారంభిచడంతో పాటు మహిళలకు బ్యాంకు లింకేజీ చెక్కులను పంపిణీ చేయనున్నారు. సా.4.30గంటల నుంచి 4.40గంటల వరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రసంగించనున్నారు. సా.4.40గంటల నుంచి సా.5గంటల వరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు. సాయంత్రం 5గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.

ఆంధ్రజ్యోతి
7
నవ్య
డాక్టర్
మంగళవారం • 19 నవంబరు 2024

ఫార్మ + జీనోమిక్స్ =
ఫార్మకొజీనోమిక్స్.
ఫార్మ (ఔషధాలు), జీనోమిక్స్
(ఒక వ్యక్తి జన్యువుల ఆధారంగా
అందించగలిగే వ్యక్తిగత
ఔషధాలు, వాటి మోతాదులు)





జన్యువులు | మందులు

ఏ ఇద్దరి వేలి ముద్రలూ ఒకేలా ఉండవు. అలాగే ఔషధాలకు స్పందించే స్వభావాలు కూడా! ఎవరికి ఏ ఔషధం, ఏ మోతాదులో కచ్చితమైన ఫలితాన్నిస్తుందో కనిపెట్టగలిగితే, చికిత్స సులభమవుతుంది, రోగికి ప్రయోజనం చేకూరుతుంది. అందుకోసం అక్కరకొస్తున్న ఔషధరంగమే 'ఫార్మకొజీనోమిక్స్'. ఈ రంగంలో భాగంగా, సులువైన జన్యు పరీక్షతో నప్పే ఔషధాలను కనిపెట్టే వీలుంది. ఆ జన్యుపరీక్ష ప్రయోజనాల గురించి నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం!

ముక్కుసూటి మందుల కోసం...

ఔషధాలను శరీరం తనకనుగుణంగా మలుచుకునే ప్రక్రియను, జన్యు అమరిక ప్రభావితం చేస్తుంది. మన శరీరంలోని కొన్ని జన్యువులు ఔషధాలను శరీరం వినియోగించుకోవడంలో కీలక పాత్ర పోషిస్తూ ఉంటాయి. మరీ ముఖ్యంగా రక్తం పలుచబడే మందులు, అధిక రక్తపోటు, మధుమేహం, అసిడిటీ, జ్వరం, నొప్పి మొదలైన సాధారణ మందుల వినియోగంలో 26 నుంచి 30 జన్యువుల పాత్ర ముఖ్యమైనది. వీటిలో స్వల్ప తేడాలున్నప్పుడు, తీసుకునే మందుల సక్రమ పనితీరుకు అవసరమైన ఎంజైమ్స్ విడుదలకు ఈ జన్యువులు తోడ్పడకపోవచ్చు. ఫలితంగా ఆ మందుల సామర్థ్యం తగ్గడం, లేదా పూర్తిగా నిర్వీర్యమైపోవడం లేదా అరుదుగా కొన్ని సందర్భాల్లో వికటించడం లాంటివి జరుగుతూ ఉంటాయి.

ఫార్మకోజీనోమిక్స్ ఎందుకు?

'నాకీ మందు పడలేదు. నాకు ఫలానా మందు చాలా బాగా పని చేసింది' అనే మాటలను మనం తరచూ వింటూ ఉంటాం. ఈ పని చేయడం, పడకపోవడం, బాగా పని చేయడం లాంటి వాటన్నిటి వెనకా మన జన్యు అలంకరణ ప్రధాన పాత్ర పోషిస్తూ ఉంటుంది. అందుకే ప్రతి ఒక్కరి జన్యు అమరికనూ పరిశీలించి, ఔషధాలను తయారుచేసే వెసులుబాటు అందుబాటులో లేదు. కాబట్టి ఒకే రకమైన రుగ్మతకు వేర్వేరు మందులు రూపొందుతూ ఉంటాయి. ఒకరికి సమర్థంగా ఫలితాన్నిచ్చే మందు, ఇంకొకరికి ప్రభావం కనబరచకపోవచ్చు. అందువల్లే సాధారణ రుగ్మతలైన అధిక రక్తపోటు, మధుమేహం లాంటి వాటికి వేర్వేరు మందులు మార్కెట్లో దొరుకుతున్నాయి. అవి కనబరిచే ప్రభావం ఆధారంగా వాటి వాడకంలో వైద్యులు మార్పులు చేర్పులు చేస్తూ ఉంటారు. అయితే ఇలా అన్ని రకాల మందులు వాడుకుని ఫలితాన్నిచ్చే ఔషధమేదో కనిపెట్టే బదులు, మొదటి విడతలోనే కచ్చితమైన ఔషధాన్ని కనిపెట్టగలిగితే, సమయం, డబ్బు, అన్నిటికంటే ముఖ్యంగా ఆరోగ్యాన్నీ ఆదా చేసుకోవచ్చు. అందుకోసం అందుబాటులోకొచ్చినదే 'ఫార్మకోజీనోమిక్స్'.

సులువైన రక్త పరీక్షతో...

రక్త నమూనాను సేకరించి, దాన్లోని డిఎన్ఎను వేరు చేయడం ద్వారా జన్యువులను సేకరించవచ్చు. ఒకవేళ తరచూ రక్త మార్పిడి అవసరమయ్యే రోగులైతే, వాళ్ల లాలాజలం, కణజాలాన్ని సేకరించి జన్యు పరీక్ష చేపట్టవచ్చు. ఈ పరీక్షను రెండు విధాలుగా చేపట్టవచ్చు. వైద్యులు సూచించే మందుల ఆధారంగా ఆ మందులతో సంబంధమున్న జన్యువును నేరుగా పరీక్షించి, స్పందిస్తున్న స్వభావాన్ని పరీక్షించవచ్చు. జన్యు స్పందన అనుకూలంగా ఉన్నప్పుడు, ఆ మందులను కొనసాగించవచ్చని రోగులకు సూచించవచ్చు. ప్రతికూలంగా ఉన్నప్పుడు, ప్రత్యామ్నాయ ఔషధాన్ని సూచించవచ్చు. రెండో తరహా పరీక్షలో జన్యువులను పరీక్షించి, ఏ ఔషధాలు శరీరానికి సరిపడవో/మెరుగైన ఫలితాన్ని ఇవ్వవో ముందుగానే తెలుసుకోవచ్చు. ఇలా ముందుగానే తెలుసుకోగలిగితే, భవిష్యత్తులో ఏ రుగ్మతకైనా వైద్యులను కలిసినప్పుడు, జన్యుపరీక్ష ఫలితం ఆధారంగా తదనుకూల ఔషధాలను సూచించమని వైద్యులకు చెప్పవచ్చు. ఈ పరీక్ష ఫలితానికి రెండు వారాల సమయం పడుతుంది. ప్రస్తుతం ఈ పరీక్ష రోగులకు అందుబాటులో ఉంది.



ప్రయోజనాలు ఇవే!

జన్యు పరీక్ష ఆధారంగా కచ్చితమైన ఔషధాలను తెలుసుకోవడం వల్ల కొన్ని ఉపయోగాలున్నాయి. అవేంటంటే...

- అనవసరమైన మందుల వాడకం ఉండదు
- మందులు వికటించే ప్రమాదం ఉండదు
- తగిన మందు, తగిన మోతాదులో తీసుకునే వెసులుబాటు ఉంటుంది
- మందుల దుష్ప్రభావాలకు లోనయ్యే ప్రమాదం ఉండదు

ఈ పరీక్ష ఎవరికి?

- మూర్ఛ వ్యాధితో బాధపడే పిల్లలు
- క్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయించుకోబోతున్నవాళ్లు
- దీర్ఘకాల రుగ్మతలతో బాధపడుతున్న వాళ్లు
- కుటుంబ చరిత్రలో తీవ్ర వ్యాధులున్నవాళ్లు
- బహుళ రుగ్మతలున్నవాళ్లు
- అవయవ మార్పిడి అవసరమైన వాళ్లు

ఇలా జన్యు పరీక్షతో కచ్చితమైన మందులను కనిపెట్టడం వల్ల విలువైన సమయం వృథా అవకుండా ఉండడంతో పాటు, వ్యాధులు అదుపులోకొచ్చి, రోగులు మెరుగైన జీవితం గడపగలుగుతారు.

నా అనుభవం

2008లో అమెరికాలో జరిగిన ఒక ప్రమాదంలో మా అబ్బాయి నోటికి పెద్ద గాయమైంది. పెదవులు చీలిపోయి, దంతాలు ఊడిపోయి, తీవ్ర రక్తస్రావమైంది. ఆ సమయంలో వైద్యులు సర్జరీ చేసి, నొప్పి నివారిణి 'కోడిన్' ఔషధాన్ని సూచించారు. అయితే దాంతో మా అబ్బాయి నొప్పి తగ్గకపోగా, చిత్తభ్రమకు లోనవడం మొదలుపెట్టాడు. అలాగే విపరీతమైన కడుపునొప్పి వల్ల ఏమీ తినలేకపోయేవాడు. ఇలా ఎందుకు జరుగుతోందని వైద్యులను ప్రశ్నించినప్పుడు, దెబ్బ తీవ్రత మూలంగా మెదడు కూడా దెబ్బ తిని ఉండొచ్చనీ, ఎమ్మారై పరీక్ష చేయించమనీ చెప్పారు. "కానీ సర్జరీకి ముందు ఇలాంటి లక్షణాలేవీ కనిపించనప్పుడు, సర్జరీ తర్వాత కొత్తగా చిత్రభ్రమ ఎందుకు కలుగుతోంది? బహుశా అది కోడిన్ ప్రభావమై ఉంటుందా?" అని వైద్యులను ప్రశ్నించాను. అందుకు వాళ్లు 'మేం సురక్షితమైన మందులే సూచించాం' అన్నారు. కానీ నాకు ఆ ఔషధం మీదే అనుమానం మొదలైంది. 'అది సురక్షితమైనదే కావచ్చు. కానీ మా అబ్బాయికి సురక్షితమైనది అయి ఉండకపోవచ్చు' అని చెప్పి, మందు వాడకం మానేసి, బాబుకు జన్యుపరీక్ష చేయించాను. ఆ పరీక్షలో 'సివైపి2డి6' అనే జన్యువులో సమస్య ఉన్నట్టు తేలింది. అందువల్లే నొప్పి నివారిణి, మార్ఫిన్‌గా మారి ఆ తరహా ప్రభావాన్ని కనబరచడం మొదలుపెట్టింది. ఈ విషయం గ్రహించిన తర్వాత, ఆ మందుల వాడకం మానేసిన వెంటనే అబ్బాయిలో చిత్తభ్రమలు పూర్తిగా తొలగిపోయాయి. కోడిన్ మా సరిపడదని ముందే తెలిసి ఉంటే, మా బాబు ఇంత ఇబ్బంది పడి ఉండేవాడు కాదు. ఔషధాల మీద జన్యువుల ప్రభావం ఏ మేరకు ఉంటుందో, జన్యుపరీక్షతో సరిపడే/సరిపడని మందులను ముందుగానే కనిపెట్టడం ఎంత అవసరమో గ్రహించడానికి ఇదొక ఉత్తమమైన ఉదాహరణ.

నప్పే మందులు కనిపెట్టాలి

మార్కెట్లో దొరికే 80 నుంచి 100 శాతం మందులన్నీ కొన్ని ప్రాథమిక దినుసుల ఆధారంగానే తయారవుతూ ఉంటాయి. ఉదాహరణకు అసిడిటీని తీసుకుంటే, రాబిప్రజోల్, పాంటాప్రజోల్ మొదలైన వేర్వేరు ఔషధాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. వీటన్నిట్లో ప్రధానంగా సోడియం ఉంటుంది. అలాగని ఇవన్నీ అందరికీ ఒకే విధమైన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. అధిక రక్తపోటు కలిగిన వాళ్లకు కూడా ఒకే ఔషధం సమాన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. ఈ సమస్యకు మార్కెట్లో దాదాపు 20 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అయితే వైద్యులను కలిసినప్పుడు, వాళ్లు వాళ్ల అనుభవం ఆధారంగా ఉత్తమమైన ఔషధాన్ని సూచిస్తూ ఉంటారు. అయితే ఆ నిర్దిష్ట ఔషధం సదరు వ్యక్తికి సరైనది కాకపోవచ్చు. అలాంటప్పుడు అదనంగా ఇంకొక ఔషధాన్ని జోడించవలసి వస్తూ ఉంటుంది. లేదా ఔషధాన్ని మార్చవలసి వస్తూ ఉంటుంది. అలాంటప్పుడు ఎవరికి, ఏది సమర్థమైన ఫలితాన్నిస్తుందో, ఏది శరీరానికి నప్పుతుందో కచ్చితంగా తెలుసుకోవడంలో జన్యు పరీక్ష ఉపయోగపడుతుంది. ఒక ఔషధాన్ని శరీరం సద్వినియోగం చేసుకోవాలంటే, అందుకు తగిన ఎంజైమ్స్ విడుదలయ్యేలా జన్యువులు స్పందించాలి. అలా జరగనప్పుడు, తీసుకున్న ఔషధం ఫలితాన్నివ్వకపోవచ్చు, దాని సామర్థ్యం తగ్గవచ్చు, కొన్ని సందర్భాల్లో, చర్మం మీద దద్దుర్లు, కడుపునొప్పి, విరోచనాలు లాంటి లక్షణాల రూపంలో ప్రతికూల ప్రభావాన్ని (డ్రగ్ రియాక్షన్) కూడా కనబరచవచ్చు.



- డాక్టర్ ఆనీ క్యు హాసన్
సీనియర్ కన్సల్టెంట్ అండ్ హెచ్ఒడి,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ జెనెటిక్స్ అండ్ మాలిక్యులర్ మెడిసిన్,
కామినేని హాస్పిటల్స్,
హైదరాబాద్.

అపోహ | వాస్తవం

మాత్రలు ఏ మేరకు?

పోషకలోపాన్ని భర్తీ చేసే అనుబంధ మాత్రల పట్ల సర్వత్రా కొన్ని అపోహలుంటాయి. వాటి గురించిన వాస్తవాలను తెలుసుకుందాం!

అపోహ: బి విటమిన్ సప్లిమెంట్ శరీరం మీద ఒత్తిడిని తగ్గిస్తుంది.

వాస్తవం: ప్రమాదాల దెబ్బలు, రుగ్మతలు, కాలిన గాయాలు, సర్జరీల నుంచి త్వరితంగా కోలుకోవడం కోసం బి విటమిన్లు అవసరమే! అయితే బి కాంప్లెక్స్ మాత్రలతో సరిపడా బి విటమిన్లను పొందే వీలుండదు. కాబట్టి పోషకాహారంతో పాటు అదనంగా వీటిని తీసుకోవాలి. అంతే తప్ప పూర్తిగా వీటి మీదే ఆధారపడకూడదు.



అపోహ: సరిగా తినకపోయినా ఫర్వాలేదు. ఒక మల్టీ విటమిన్ మాత్ర వేసుకుంటే సరిపోతుంది.

వాస్తవం: ఎంతటి విటమిన్ సప్లిమెంట్ అయినా ఆహారంలోని పోషకా లన్నింటినీ భర్తీ చేయలేదు. ప్రకృతిసిద్ధ పోషకాలు లోపించిన ఆహారం తింటూ, మాత్రలను వాడుకోవడం వల్ల ఏ మాత్రం ప్రయోజనం ఉండదు.

అపోహ: విటమిన్ సప్లిమెంట్లతో అదనపు శక్తి సమకూరుతుంది

వాస్తవం: శరీరానికి క్యాలరీల ద్వారా శక్తి సమకూరుతుంది. విటమిన్ సప్లిమెంట్లలో క్యాలరీలు ఉండవు. అయితే తిన్న ఆహారంలోని పోషకాలను శరీరం శోషించుకోవడానికి ఈ మాత్రలు సహాయపడతాయి. ఆహారం తీసుకోకుండా ఈ మాత్రలను తీసుకోవడం... ఇంధనం లేకుండా వాహనాన్ని నడిపించే ప్రయత్నం చేయడంతో సమానం. కాబట్టి వీటిని భోజనంతో పాటు తీసుకోవాలి.

పోషక | లోపం

సిలీనియం తగ్గితే?



థైరాయిడ్ హార్మోన్ క్రమబద్ధీకరణలో కీలక పాత్ర పోషించే సిలీనియం అనే మూలకం, వేర్వేరు శరీర జీవక్రియల పనితీరుకు కూడా ఉపయోగపడుతూ ఉంటుంది. ఈ పోషకం లోపంతో గుండె ఆరోగ్యం దెబ్బతింటుంది. అదెలాగో తెలుసుకుందాం!

సిలీనియం కలిగి ఉండే యాంటీఆక్సిడెంట్ లక్షణాలు, ఆక్సిడేటివ్ ఒత్తిడి నుంచి గుండెకు రక్షణనిచ్చి, మెరుగైన పనితీరుకు దోహదపడతాయి. ఈ మూలకం లోపంతో థైరాయిడ్ గ్రంథి, కండరాలు, గుండె దెబ్బతింటాయి. ప్రత్యేకించి ఈ మూలకం లోపంతో గుండె, కేషన్ వ్యాధి బారిన పడుతుంది. చైనాలోని కేషన్ అనే ప్రాంతం నుంచి ఈ వ్యాధికి ఈ పేరొచ్చింది. అక్కడి నేలల్లో సిలీనియం మోతాదు తక్కువగా ఉండడంతో, ఆ ప్రాంతంలోని ప్రజలు 'కార్డియొమయోపతి'ని పోలిన గుండె జబ్బు బారిన పడుతూ ఉండడంతో ఈ వ్యాధికి ఆ ప్రాంతం పేరును పెట్టడం జరిగింది. గుండె పెరగడం, గుండె కండరాలు బలహీనపడడం, గండె పనితీరులో హెచ్చుతగ్గులు తలెత్తి అంతిమంగా గుండె విఫలమైపోవడం ఈ రుగ్మత ప్రధాన లక్షణాలు. ఈ లోపాన్ని అరికట్టడం కోసం పొట్టు తీయని ధాన్యాలు, గుడ్లు, బీన్స్, బఠాణీ, పుట్ట గొడుగులు, పొద్దుతిరుగుడు విత్తనాలు, ఓట్స్ ఎక్కువగా తీసుకోవాలి.

మీకు | తెలుసా?

రాత్రివేళల్లో ఉద్యోగం చేస్తున్నారా?

రాత్రివేళ వృత్తుల్లో కొనసాగే వారి శరీరాలు ప్రతికూల ప్రభావాలకు లోనవుతూ ఉంటాయి. విదేశాల సమయవేళలకు తగ్గట్టు రాత్రివేళ మేలుకుని ఉద్యోగాలు చేసే వాళ్లు ముంచుకొచ్చే ఈ ఆరోగ్య ముప్పులను దృష్టిలో పెట్టుకోవాలి.

మెటబాలిజం

ఆహారాన్ని శక్తిగా మలిచే ఈ ప్రక్రియ దెబ్బతింటుంది. శరీర జీవగడియారంలో అవకతవకల వల్ల హార్మోన్ల విడుదల క్రమం తప్పుతుంది. వీటికి తోడు వేళ కాని వేళల్లో ఆహారం తినడం, వ్యాయామం లోపించడం, దురలవాట్లు సమస్యను మరింత క్లిష్టం చేస్తాయి.

నిద్ర సమస్యలు

మన శరీరం వెలుగుకు, సూర్యరశ్మికి స్పందించేలా పరిణామం చెందింది. కానీ రాత్రివేళ మేలుకునే ఉద్యోగాల వల్ల, నిద్రపట్టకపోవడం లేదా నిద్రను కొనసాగించలేకపోవడం అనే రెండు సమస్యలు వేధిస్తాయి.

జీర్ణ సమస్యలు

పొట్టలో అసౌకర్యం, మలబద్ధకం, వాంతులు, విరోచనాలు, ఇర్రిటబుల్ బొవెల్ సిండ్రోమ్ లాంటి జీర్ణాశయ సమస్యలు మొదలవుతాయి.



గుండె జబ్బులు

పగటి ఉద్యోగాలు చేసే వాళ్లతో పోలిస్తే, ఐదు నుంచి ఆరేళ్ల పాటు రాత్రివేళ విధుల్లో కొనసాగేవాళ్లలో గుండె జబ్బులు ఎక్కువ అని పరిశోధనల్లో తేలింది.

క్యాన్సర్

జీవగడియారంలో అవకతవకలు కణపనితీరును ప్రభావితం చేస్తాయి. దాంతో డిఎన్ఎ మరమ్మతు, కణ చక్రాలు, కణ మరణాలకు అంతరాయం ఏర్పడుతుంది. ఫలితంగా క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది.

ఇలా సరిదిద్దాలి

ఇతర దేశాల సమయాలకు అనుగుణంగా పని చేసే ఉద్యోగులు, ఆరోగ్యం దెబ్బతినకుండా చూసుకోవడం కోసం కొన్ని నియమాలను పాటించాలి. అవేంటంటే...

- పగటివేళ 7 నుంచి 8 గంటల పాటు నిద్రపోవాలి
- నిద్రకు రెండు గంటల ముందు కాఫీ, కెఫిన్ ఆధారిత పానీయాలకు దూరంగా ఉండాలి
- ఆహారవేళలను పాటించాలి, వ్యాయామం చేయాలి
- వృత్తిలో తీసుకునే అల్పాహారాల్లో భాగంగా మాంసకృత్తులు, పీచు సమృద్ధిగా ఉండే పదార్థాలు తినాలి.

డయాగ్నస్టిక్స్


చలి కాలం ఊపిరితిత్తులు నిక్షేపం

చలికాలంలో శ్వాసకోస సమస్యలు వేధించడం సహజం. అయితే ఈ సమస్యలు 20 ఏళ్లలోపు పిన్న వయస్కులు, 60ఏళ్లు పైబడిన పెద్దలు, వ్యాధినిరోధక వ్యవస్థ క్షీణించిన వాళ్లు, ఊపిరితిత్తులు బలహీనపడిన వాళ్లలో ఎక్కువ. ఈ సమస్యలను ఎలాంటి పరీక్షలతో కనిపెట్టవచ్చో తెలుసుకుందాం!

ప్రత్యేకించి శీతాకాలంలో అలర్జిక్ బ్రాంకైటిస్, అలర్జిక్ రైనైటిస్, అలర్జిక్ సైనసైటిస్ ఎక్కువ. ఈ కాలంలో వైరల్ ఇన్‌ఫెక్షన్లు కూడా విజృంభిస్తూ ఉంటాయి. కాబట్టి వీటి వల్ల ముందు నుంచి ఉన్న ఊపిరితిత్తుల సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశాలుంటాయి. కాబట్టి శ్వాసకోస సమస్యల ముప్పు ఎక్కువగా ఉండేవాళ్లు, అందుబాటులో ఉన్న టీకాలతో రక్షణ పెంచుకోవాలి. అయితే టీకాలను ఆరు నుంచి 8 వారాల ముందు తీసుకోగలిగినప్పుడే వ్యాధినిరోధకశక్తి చలికాలం సమీపించే నాటికి బలం పుంజుకుంటుంది. మధుమేహం, మూత్రపిండాల వ్యాధులు, అధిక రక్తపోటు లాంటి దీర్ఘకాల ఆరోగ్య సమస్యలున్నవాళ్లలో ముందు నుంచే వ్యాధినిరోధకశక్తి సన్నగిల్లి ఉంటుంది. కాబట్టి ఈ కోవకు చెందిన వాళ్లు, రుగ్మతలను నియంత్రణలో పెట్టుకోవడం మీద దృష్టి పెట్టాలి. అలాగే విటమిన్ లోపాలు లేకుండా చూసుకోవాలి. ప్రత్యేకించి బి, బి12 విటమిన్ల లోపాలు వ్యాధినిరోధకశక్తి పరంగా ముఖ్యమైన పాత్రను పోషిస్తూ ఉంటాయి. కాబట్టి ఈ విటమిన్ లోపాలు తలెత్తకుండా జాగ్రత్తగా ఉండాలి.

కొవిడ్ జాగ్రత్తలు కొనసాగించాలి

అవసరంలేని ప్రదేశాలకు వెళ్లకపోవడం మనం కొవిడ్ నుంచి నేర్చుకున్నాం. శ్వాసకోస సమస్యల ముప్పు పొంచి ఉన్నవాళ్లు చలికాలంలో ఇలాంటి కొవిడ్ నియమాలనే పాటించాలి. ముఖానికి మాస్క్ పెట్టుకోవాలి. సామాజిక దూరం పాటించాలి. ఇంట్లో ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ సోకిన వాళ్లను వాళ్ల గదికే పరిమితం చేయడం, బయటకు వెళ్లొచ్చిన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవడం, స్నానం చేయడం లాంటి జాగ్రత్తలు పాటించాలి. అలాగే సమయానికి ఆహారం తీసుకోవాలి, నిద్రపోవాలి. సరిపడా నీళ్లు తాగడంతో పాటు జీర్ణ ప్రక్రియను క్రమబద్ధీకరించుకోవడం, ఒత్తిడి తగ్గించుకోవడం కూడా అవసరమే! ఇలాంటి జీవనశైలిని పాటించడం వల్ల అప్పటికే ఉన్న దీర్ఘకాలిక రుగ్మతలు అదుపులో ఉండి, వ్యాధినిరోధకశక్తి మెరుగ్గా ఉంటుంది.



ఇన్‌ఫెక్షన్ల నిర్ధారణ ఇలా...

ఇన్‌ఫెక్షన్, అలర్జీల మోతాదులు, అవి సోకిన అవయవాల మీదే చికిత్సలు ఆధారపడి ఉంటాయి. కాబట్టి వీటిని కనిపెట్టడం కోసం సిబిపి, సిఆర్‌పి పరీక్షలు చేయవలసి ఉంటుంది. అలాగే విటమిన్ మోతాదులను కూడా పరీక్షించుకోవలసి ఉంటుంది. కొంతమందిలో అలర్జీలు ఉంటాయి. కాబట్టి వాళ్లకు ఈసినోఫిల్స్, ఇమ్యునోగ్లాబ్యులిన్ మోతాదులు పరీక్షించుకోవాలి. వీటితో పాటు అవసరాన్ని బట్టి ఎక్స్‌రేలు, సిటి స్కాన్ కూడా అవసరమవుతాయి. శ్వాసకోస సమస్యలకు అలర్జీ, ఇన్‌ఫెక్షన్ అనే రెండు కారణాలుంటాయి. వీటిలో కారణాన్ని బట్టి వైద్యులు తగిన చికిత్సను ఎంచుకుంటూ ఉంటారు. సిబిపి, సిఆర్‌పి, ఈసినోఫిల్స్, ఇమ్యునోగ్లాబ్యులిన్ పరీక్షల్లో అసలు కారణం తెలిసిపోతుంది. ఈ ఫలితాల ఆధారంగా యాంటీబయాటిక్స్ సూచించాలా లేదంటే అలర్జీ వ్యతిరేక మందులు సూచించాలా అన్నది వైద్యులు నిర్ణయిస్తారు. అలాగే ఊపిరితిత్తులకు బ్యాక్టీరియల్, వైరల్ అనే రెండు రకాల ఇన్‌ఫెక్షన్లు సోకుతూ ఉంటాయి. అదనంగా ఫంగల్ ఇన్‌ఫెక్షన్ కూడా సోకుతూ ఉంటుంది. వీటిని నిర్ధారించడం కోసం కఫ పరీక్ష చేయవలసి ఉంటుంది. ఇన్‌ఫెక్షన్ రకాన్ని నిర్ధారించుకోవడం కోసం, దగ్గడం ద్వారా స్వతహాగా బయటకు తెప్పించిన కఫాన్ని పరీక్షించడం, ఊపిరితిత్తుల నుంచి నీటిని సేకరించి పరీక్షించడం, బ్రాంకోస్కోపీ ద్వారా ఊపిరితిత్తుల్లోని స్రావాలను సేకరించి పరీక్షించడం ఇలా వేర్వేరు విధానాలను అనుసరిస్తారు. ఈ పరీక్షల ఫలితాల ఆధారంగా సమర్థమైన చికిత్సల సహాయంతో ఇన్‌ఫెక్షన్లను తగ్గించే మందులను వైద్యులు సూచిస్తారు.



- డాక్టర్ రాజేష్ వుక్కల
చీఫ్ కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్,
రెనోవా హాస్పిటల్స్,
సనత్ నగర్, హైదరాబాద్

నారా లోకేష్ ఔదార్యం

» టీడీపీ కార్యకర్త కుమారుడి వైద్యానికి ఆర్థిక సాయం

నేరేడుగొమ్ము, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఔదార్యం ప్రదర్శించారు. ఓ టీడీపీ కార్యకర్త కుమారుడి వైద్య ఖర్చుల నిమిత్తం ఆయన రూ.2.60 లక్షల ఆర్థికసాయం చేశారు. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్‌కు చెందిన పసుపులేటి ఆంజనేయులు టీడీపీలో క్రియాశీలకంగా పనిచేసేవారు. ఆయనకు దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో నెల రోజుల క్రితం రెండో సంతానంగా కొడుకు పుట్టాడు. అనారోగ్యంగా ఉన్న ఆ చిన్నారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి శిశువు గుండెలో మూడు గదులు మూసుకుపోయినట్లు గుర్తించారు. మెరుగైన చికిత్స కోసం చిన్నారిని హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రికి తీసుకెళ్లగా, శస్త్రచికిత్సకు రూ.3.50లక్షల ఖర్చవుతుందని తెలిపారు. దాంతో ఆంజనేయులు.. టీడీపీ నాయకుడు జమాల్‌పురి వంశీని సంప్రదించారు. ఆయన వంశీ పరిస్థితిని వివరిస్తూ సహాయం చేయాలని కోరుతూ ఈనెల 6న ఎక్స్‌లో నారా లోకేష్‌ను ట్యాగ్ చేశారు. స్పందించిన లోకేష్.. ఆంజనేయులు కుమారుడి వైద్యం కోసం ఆయన ఖాతాలో రూ.2.60 లక్షలు జమ చేయించారు. ఆ చిన్నారికి 5 రోజుల క్రితం శస్త్రచికిత్స పూర్తవగా, సోమవారం డిశ్చార్జి చేశారు. నారా లోకేష్‌కు ఆంజనేయులు కుటుంబ సభ్యులు, వంశీ, నేరేడుగొమ్ము నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ఆక్రమించి నిర్మాణం.. ఇల్లు కూల్చివేత!

» అమీన్‌పూర్‌లో కాలనీవాసుల ఫిర్యాదుతో హైడ్రా కొరడా

» భారీ యంత్రాలతో నేలమట్టం.. స్థానికుల హర్షం

పటాన్‌చెరు, నవంబరు, 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డును ఆక్రమించి ఓ లేఅవుట్‌లో నిర్మించిన ఇంటిని సోమవారం ఉదయం హైడ్రా బృందాలు కూల్చివేశాయి. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని బీరంగూడ వందనపురి కాలనీలో సర్వేనంబర్ 848 పరిధిలోకి వచ్చే రోడ్డును ఆక్రమించి రిజిస్టర్ డాక్యుమెంట్ సృష్టించారు. అందులో నిబంధనలకు విరుద్ధంగా ఇంటిని నిర్మించడం ప్రారంభించారు. రోడ్డు ఆక్రమణపై స్థానిక మునిసిపాలిటీకి పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. వందనపురి కాలనీలోని రోడ్డును ఆక్రమించడంతో కాలనీ వాసులతో పాటు పొరుగున మరో కాలనీ వారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఈ మేరకు స్థానిక మునిసిపాలిటీకి ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫలితం లేకపోవడంతో కోర్టును సైతం ఆశ్రయించారు. ఇటీవల కాలనీ వాసులు హైడ్రాకు ఫిర్యాదులు చేయంతో పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి రోడ్డు ఆక్రమణను నిర్ధారించారు. నోటీసులు జారీ చేసి కూల్చివేతకు ఉపక్రమించారు. సోమవారం ఉదయం భారీ బుల్డోజర్లతో హైడ్రా సిబ్బంది వందనపురి కాలనీకి చేరుకుని కూల్చివేతలు ప్రారంభించారు. హైడ్రాకు ఫిర్యాదు చేసిన మరుక్షణం ఆక్రమణను తొలగించడంతో తమకు న్యాయం జరిగిందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

వాట్సాప్‌లో అసభ్యకర సందేశాలు..
మనస్తాపంతో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

భువనగిరి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలిసిన ఓ యువకుడు వాట్సాప్‌కు అసభ్యకర మెసేజ్‌లు పంపడంతో మనస్తాపానికి గురై ఓ డిగ్రీ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన భువనగిరి జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగింది. భువనగిరిలోని విద్యానగర్‌కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు ఎలగందుల సతీష్‌కు కుమారుడు, కుమార్తె హాసిని(20) ఉన్నారు. హాసిని హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతోంది. భువనగిరిలో వలిగొండ మండలం టేకుల సోమారానికి చెందిన బీటెక్ విద్యార్థి నారగోని నిఖిల్‌తో ఆమెకు రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. నిఖిల్ కూడా మేడిపల్లిలో ఉంటూ చదువుకుంటున్నాడు. అయితే కొద్దిరోజులుగా నిఖిల్.. హాసినికి వాట్సాప్‌లో మెసేజ్‌లు పెడుతూ వేధిస్తున్నాడు. ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను హ్యాక్ చేసి ఆమె పేరిట పోస్టులు పెట్టేవాడు. ఈ క్రమంలో సెలవులకు రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చిన హాసినికి అసభ్యకర మెసేజ్‌లు పెట్టాడు. దాంతో మనస్తాపానికి గురైన యువతి ఆదివారం రాత్రి ఉరేసుకుంది. గమనించిన తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆమె అప్పటికే మృతి చెందింది. హాసిని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు నిఖిల్‌ను అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచారు.

వైద్యశాఖ బదిలీల్లో
భారీగా అక్రమాలు?

తాజాగా డీహెచ్ కార్యాలయంలో మరో ఏడుగురికి చార్జి మెమోలు

» ఇటీవలే ఓ విభాగాధిపతికి కూడా


» పూర్తి ఆధారాలతో రంగంలోకి సర్కారు



హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలోని వైద్యవిద్య సంచాలకులు, ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల్లో భారీగా అక్రమాలు జరిగాయన్న నాటి ఆరోపణలు ఇప్పుడు ఒక్కొక్కటిగా నిజమవుతున్నాయి. ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో చేపట్టిన ఉద్యోగుల బదిలీల వ్యవహారంలో తాజాగా మరో ఏడుగురికి ప్రభుత్వం చార్జి మెమోలు జారీ చేసింది. ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖలోని ఓ కీలక విభాగాధిపతికి చార్జి మెమో జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో వరుసగా చార్జి మెమోలు రావడం వైద్య ఆరోగ్యశాఖలో కలకలం రేపుతోంది. ఈ ఏడాది జూలైలో వైద్య ఆరోగ్యశాఖలో సర్కారు సాధారణ బదిలీలు చేపట్టింది. ఆ బదిలీల్లో భారీగా మోసం జరుగుతున్నట్లు అప్పట్లోనే 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. ప్రధానంగా డీహెచ్ పరిధిలో స్టాఫ్ నర్సులు, ఇతర పారామెడికల్ సిబ్బంది బదిలీల జాబితాలో పెద్దయెత్తున గోల్‌మాల్ జరిగింది. రాత్రి విడుదల చేసిన ట్రాన్స్‌ఫర్ జాబితాలోని పేర్లు ఉదయానికి మారిపోయేవని ఉద్యోగులే ఆరోపించారు. హైదరాబాద్‌లోని ప్రధానాస్పత్రుల్లో 15-20 ఏళ్లుగా పాతుకుపోయిన స్టాఫ్‌నర్స్‌లకు మళ్లీ అక్కడికే బదిలీ చేయడం వెనుక భారీగా డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపించాయి. ఆ విభాగంలో కీలక అధికారికి ఉస్మానియా ఆస్పత్రిలో పనిజేసే ఇద్దరు నర్సులు బదిలీలకు సంబంధించిన డబ్బులు స్వయంగా వసూలు చేసి అప్పగించినట్లు ప్రభుత్వానికి సమాచారం అందింది. బదిలీల వ్యవహారంలో తమకు అన్యాయం జరిగిందని, కొందరికి కావాల్సిన చోట పోస్టింగ్స్ ఇస్తున్నారని ఆరోపిస్తూ నర్సులంతా ఏకంగా రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగారు. దీంతో పాటు యూనియన్ నేతల పేరిట పెద్దసంఖ్యలో కొందరు నర్సులు, పారామెడికల్ సిబ్బంది బదిలీల నుంచి మినహాయింపు పొందారు. ఇందుకు అవసరమైన యూనియన్ లేఖలు ఇచ్చేందుకు ఒక్కొక్కరి దగ్గర రూ.2-3 లక్షల వరకు వసూలు చేశారు. అసలు యూనియన్స్‌లో పనిజేయని వారు కూడా పెద్దయెత్తున డబ్బులిచ్చి ఆ లేఖలు పొంది బదిలీల నుంచి మినహాయింపు పొందారు. బదిలీలల్లో జరిగిన అక్రమాలపై వైద్యమంత్రి దామోదర రాజనర్సింహకు పెద్దఎత్తున లిఖితపూర్వక ఫిర్యాదులందంతో ఇంటెలిజెన్స్ నివేదికలు తెప్పించుకున్నారు. దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. అదే సమయంలో ఓ ఐఏఎస్ అధికారిని దీనిపై విచారణ జరిపి నివేదికివ్వాలని సర్కారు ఆదేశించింది. అటు విజిలెన్స్, ఇటు ఐఏఎస్ అధికారి విచారణలో భాగంగా బదిలీల్లో అక్రమాలు జరిగినట్లు సర్కారుకు నివేదికలందాయి. దీంతో అక్రమాలకు పాల్పడిన వారికి వైద్యశాఖ నుంచి వరుసగా చార్జి మెమోలు వస్తున్నాయి. తాజాగా డీహెచ్ కార్యాలయంలో పనిజేస్తున్న ఉద్యోగులు, ఉన్నతాధికారులకు కలిపి ఒక రోజు నలుగురికి, మరొక రోజు మరో ముగ్గురికి చార్జి మెమోలు వచ్చినట్లు వైద్యవర్గాలు ధ్రువీకరించాయి. అయితే ఇందులో కొందరికి సాధారణ బదిలీల్లో అక్రమాలకు పాల్పడినందుకు ఇవ్వగా మరికొందరికి మాత్రం గడిచిన రెండు నెలల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా డిప్యూటేషన్స్ ఇవ్వడం, ఉద్యోగులు సరెండర్ అయితే వారికి పోస్టింగ్స్ ఇవ్వడం, అనధికారికంగా డుమ్మా కొట్టిన వైద్యులకు పోస్టింగ్స్ ఇచ్చి భారీగా డబ్బులు దండుకున్న అంశాలపై చార్జి మెమోలిచ్చినట్లు తెలుస్తోంది.

ఆర్టీఐకూ సమాచారమివ్వని డీఎంఈ, డీహెచ్

డీఎంఈ, డీహెచ్ పరిధిలో సాధారణ బదిలీల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో పలువురు సమాచార హక్కు చట్టం కింద సమాచారం కోరారు. డీఎంఈ, డీహెచ్, తెలంగాణ వైద్యవిధాన పరిషత్తు పరిధిలో జరిగిన వైద్యులు, స్టాఫ్‌నర్స్, ఇతర పారామెడికల్ సిబ్బంది బదిలీలు, ఎంతమందిని ట్రాన్స్‌ఫర్స్ చేశారు? యూనియన్ లేఖల పేరుతో బదిలీల నుంచి మినహాయింపు పొందిన ఉద్యోగుల వివరాలు కావాలని ఆ మూడు విభాగాధిపతులకు దరఖాస్తులు వచ్చాయి. ఇందుకు సంబంధించి ఒక్క తెలంగాణ వైద్యవిధాన పరిషత్తు కమిషనర్ ఒక్కరే బదిలీలకు సంబంధించిన సమాచారాన్ని ఆర్టీఐ కింద సమాచార కార్యకర్తలకు పంపారు. కాగా డీఎంఈ, డీహెచ్ విభాగాధిపతులు మాత్రం అసలు బదిలీల సమాచారాన్ని ఆర్టీఐ కింద కోరడాన్నే తప్పుబట్టారు. ఇవి ఆర్టీఐ కింద ఇవ్వాల్సిన సమాచారం కాదని తిరస్కరించారు. బదిలీలు అనేవి వ్యక్తిగత సమాచారం కిందకు వస్తుందని, కాబట్టి సమాచారం ఇవ్వబోమని డీఎంఈ, డీహెచ్ కార్యాలయాలు తేల్చిచెప్పాయి. దీంతో డీఎంఈ, డీహెచ్ పరిధిలో సాధారణ బదిలీల్లో భారీగా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు బలం చేకూరినట్లు అయింది. అలాగే తాజాగా ఓ విభాగాధిపతికి, ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో మరి కొందరికి ఈ విషయంలో చార్జి మెమోలు జారీ కావడంతో అక్రమాలు జరిగినట్లు తేటతెల్లం అవుతోంది. ఇప్పటికే ప్రజారోగ్య సంచాలకుల పరిధిలోని బదిలీల అక్రమాలపై విచారణ జరగ్గా డీఎంఈ పరిధిలోని ట్రాన్స్‌ఫర్స్‌పై కూడా సమగ్ర విచారణ జరపాలని తాజాగా వైద్యవిద్య అధ్యాపకులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన అధికారులను గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



దివంగత పోలవరపు కోటేశ్వరరావు సాహిత్య సర్వస్వం మూడో సంపుటి ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమెస్కో విజయకుమార్, 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ, నటుడు నాగార్జున, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

ఇంటర్ వరకూ
తెలుగును తప్పనిసరి చేయాలి

» 2 రాష్ట్రాలనూ ఆంగ్ల వ్యామోహం కమ్మేసిందని ఆవేదన


» దక్షిణాదిన మరే రాష్ట్రంలో మాతృభాషకు ముప్పు లేదని వ్యాఖ్య

» పోలవరపు కోటేశ్వరరావు సాహిత్యసర్వస్వం మూడో సంపుటి ఆవిష్కరణ

» కార్యక్రమంలో పాల్గొన్న నాగార్జున, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): "తెలుగు రాష్ట్రాలను ఇంగ్లిష్ అనే వ్యామోహం కమ్మేసింది" అని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మినహా మరే రాష్ట్రంలోనూ మాతృభాషకు ప్రమాదం లేదని, ఈ విషయంలో ఒడిశా కూడా మనకన్నా మెరుగ్గానే ఉందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్న తేడా లేకుండా, సిలబస్ ఏదైనా.. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ తెలుగును తప్పనిసరి చేయడం ద్వారా మాత్రమే ఉభయ రాష్ట్రాల్లో మాతృభాష బతుకుతుందని పేర్కొన్నారు. అప్పుడే సాహిత్యానికి మంచి రోజులొస్తాయని, తెలుగు జాతి మనుగడ అద్భుతంగా ఉంటుందని బలంగా నొక్కిచెప్పారు. లోక్‌నాయక్ ఫౌండేషన్ నిర్వహణలో.. దివంగత పోలవరపు కోటేశ్వరరావు సాహిత్య సర్వస్వం మూడో సంపుటిని సోమవారం మాదాపూర్‌లోని దస్‌పల్లా హోటల్‌లో వేమూరి రాధాకృష్ణ ఆవిష్కరించారు. పుస్తక ప్రతులను పోలవరపు కోటేశ్వరరావు కుటుంబ సభ్యులకు హీరో అక్కినేని నాగార్జున అందించారు. పుస్తకాన్ని ముద్రించిన రైతునేస్తం వెంకటేశ్వరరావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన వేమూరి రాధాకృష్ణ.. ఆనాటి గ్రామీణ సంస్కృతి ఇతివృత్తంగా పోలవరపు కోటేశ్వరరావు రాసిన కథలు ఎంతో పఠనాసక్తి కలిగిస్తాయని కొనియాడారు. అయితే ఇప్పుడు మన గ్రామాలను ఇంగ్లిష్ కమ్మేసిందని.. గ్రామీణ జీవితమే దాదాపుగా కనుమరుగవుతున్న పరిస్థితిని చూస్తున్నామని విచారం వ్యక్తం చేశారు. "తెలుగు సాహిత్యం వర్ధిల్లాలంటే, ముందు తెలుగు భాష మనుగడ సాగించాలి. అలాంటిది తెలుగు భాషకే మరణం దాపురించినప్పుడు, ఇక సాహిత్యం పరిస్థితి ఏమిటనేది పెద్ద ప్రశ్న. ఇప్పటి తరంలో తెలుగు అంటే దాదాపుగా ఏమిటి అనే దుస్థితి దాపురించింది" అని ఆవేదన వెలిబుచ్చారు. తెలుగునాట తెలుగులో తప్ప అన్ని భాషల్లో బోర్డులుంటున్నాయని విమర్శించారు. పొరుగు రాష్ట్రాల వారు మాతృభాషతో పాటు ఇతర భాషలు కూడా నేర్చుకోడానికి ఆసక్తి చూపుతుంటే, మనం మాత్రం 'తెలుగు వద్దు - ఇంగ్లిష్ మాత్రమే కావాలి' అనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఒకవేళ ఎవరైనా దీన్ని ఆక్షేపిస్తే, వాళ్లను పేదల వ్యతిరేకి, పెత్తందారీల ప్రతినిధి అంటున్నారని ఆక్షేపించారు. తెలుగు భాష కోసం పత్రిక, చానల్ ద్వారా తనవంతు కృషిచేస్తానని రాధాకృష్ణ అన్నారు. శేష జీవితాన్ని భాష కోసం అంకితంచేయాల్సిందిగా యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు సూచించారు. ఇక.. పోలవరపు కోటేశ్వరరావు చేసిన సాహిత్య సేవ గురించి సభాధ్యక్షత వహించిన యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ వివరించారు. వేమూరి రాధాకృష్ణ సూచన మేరకు తాను తెలుగు భాషాభివృద్ధి కోసం పనిచేస్తానని ప్రకటించారు. సాహితీ, సినీ, మీడియా రంగాలు కలిస్తే తెలుగు భాషకు, సాహిత్యానికి మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కోటేశ్వరరావు సమగ్ర సాహిత్యాన్ని ప్రచురించిన ఆయన కుటుంబ సభ్యులను అభినందించారు. ఇక.. ఈ శతాబ్దపు ఉత్తమ కథకుల్లో ఒకరు పోలవరపు కోటేశ్వరరావు అని ఎమెస్కో సంస్థల నిర్వాహకుడు దూపాటి విజయకుమార్ కొనియాడారు. ఆయన అన్ని ప్రక్రియల్లో సాహిత్య సృజన చేశారని ప్రశంసించారు. ప్రజలను మంచివైపు మళ్లించే శక్తి సినిమా రంగానికి ఉందిగనుక.. నాగార్జున లాంటి సినీ ప్రముఖులు సాహిత్యాభిరుచిని వ్యక్తం చేయడం వల్ల తెలుగు భాషా, సాహిత్యాలకు మరింత మేలు జరుగుతుందన్నారు. కాగా.. తెలుగులో సాహిత్యానికి ప్రాధాన్యమిస్తున్న పత్రిక 'ఆంధ్రజ్యోతి' మాత్రమే అని వక్తలు కొనియాడారు.

నవ్య | చిత్రజ్యోతి



ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లాలోని డి.మచ్చిలేశం గ్రామంలో జరిగిన కొన్ని సంఘటనల స్ఫూర్తితో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'తండేల్'. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. అల్లు అరవింద్ సమర్పణలో రూపొందుతున్న ఈ సినిమాకు చందు మొండేటి దర్శకుడు. దేవిశ్రీప్రసాద్ స్వరపరిచిన ఫస్ట్ సింగిల్ 'బుజ్జి తల్లి'ని ఈ నెల 21న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన సాంగ్ పోస్టర్‌లో నాగచైతన్య రగ్గడ్ లుక్‌తో కనిపించగా, హాఫ్ శారీలో అందంగా ఉన్నారు సాయిపల్లవి. లవ్, యాక్షన్, డ్రామా కలిగిన 'తండేల్' చిత్రాన్ని బన్నీ వాసు నిర్మిస్తున్నారు.

అన్నపూర్ణ స్టూడియోలో వివాహం



నాగచైతన్య, శోభిత ధూళిపాళ్ల వివాహం డిసెంబర్ 4న అన్నపూర్ణ స్టూడియోస్ వేదికగా జరుగనుంది. ఆ రోజు రాత్రి 8.13 నిముషాలకు వీరిద్దరూ వివాహబంధంతో ఒక్కటి కానున్నారు. ఇటీవల శోభిత కుటుంబం నుంచి ఇస్తున్న వెడ్డింగ్ కార్డ్ వైరల్ కాగా, తాజాగా అక్కినేని కుటుంబం పంచుతున్న వెడ్డింగ్ కార్డు కూడా అందరినీ ఆకట్టుకుంటోంది.

వీర వనిత



ప్రస్తుత తరంలో ఏ హీరోయిన్‌కూ సాధ్యంకాని అపారమైన ఫ్యాన్ బేస్‌ను సొంతం చేసుకున్న నయనతార నటిస్తున్న నూతన చిత్రం 'రక్కయి'. సోమవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ సినిమా టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. సెంథిల్ నల్లస్వామి దర్శకత్వంలో వేదిక్కరన్ పట్టి ఎస్.శక్తివేల్, ఆదిత్య పిట్టీ నిర్మిస్తున్నారు. ఈ పాన్ ఇండియా ప్రాజెక్టులో ఆమె వీర వనితగా కనిపించనున్నారు. టీజర్‌లో కూతురు కోసం ఎంతకైనా తెగించి పోరాడే శక్తిమంతమైన తల్లి పాత్రలో ఆమె కనిపించి సినిమాపై అంచనాలను రెట్టింపు చేశారు. నయనతార ఇందులో శత్రుమూకలతో చేసిన భీకర పోరాట దృశ్యాన్ని చూసి ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అయిపోయారు. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ ఆంటోని, డీఓపీ: గౌతమ్ రాజేంద్రన్, సంగీతం: గోవింద్ వసంత. కాగా, నయనతార జీవితకథ ఆధారంగా అమిత్‌కృష్ణన్ తెరకెక్కించిన 'నయనతార: బియాండ్ ఏ ఫేరీ టేల్' డాక్యుమెంటరీ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది. ఆమె మంచువిష్ణు హీరోగా ముకేశ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'కన్నప్ప'.. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో యశ్ నటిస్తున్న 'టాక్సిక్'.. చిత్రాలతో ప్రేక్షకులను పలకరించనున్నారు. అలాగే, సుజోయ్ ఘోష్ దర్శకత్వంలో షారుక్‌ఖాన్ నటించనున్న 'కింగ్' చిత్రంలోనూ కథానాయికగా ఎంపికయ్యారని టాక్.

సత్యభామగా గుర్తుండిపోతా



'మిస్ ఇండియా' టైటిల్ విజేత మానస వారణాసి హీరోయిన్‌గా తెరంగేట్రం చేస్తున్న చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. 'హీరో' ఫేమ్ అశోక్ గల్లా కథానాయకుడు. ప్రశాంత్ వర్మ కథ అందించగా.. అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో సోమినేని బాలకృష్ణ నిర్మించారు. ఈ నెల 22న సినిమా విడుదలవుతున్న సందర్భంగా హీరోయిన్ మానస వారణాసి మీడియాతో ముచ్చటించారు. "దేవకి నందన వాసుదేవ' లాంటి డివైన్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇందులో నా పాత్ర పేరు 'సత్యభామ'. ఎలాంటి కష్టం వచ్చినా ధైర్యంతో ముందుకు సాగే పాత్ర ఇది. తొలి సినిమాలోనే ఇంత మంచి ప్రాధాన్యం ఉన్న పాత్ర దక్కడం నా అదృష్టం. 'సత్యభామ' క్యారెక్టర్ అందరికీ గుర్తుండిపోతుంది. మొదటి సినిమా కావడంతో ఎన్నో సవాళ్లు ఎదురైనా.. చిత్ర బృందం అందించిన ప్రోత్సాహంతో వాటిని సులువుగా అధిగమించాను. దర్శకుడు ఈ సినిమాను అద్భుతంగా తయారు చేశారు. ఆయన సినిమా తీసిన విధానం కచ్చితంగా అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. అశోక్ గల్లాతో పనిచేయడం మరిచిపోలేని అనుభవం. భీమ్స్ ఇచ్చిన సంగీతం సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లింది" అని చెప్పారు.

హరుడు ఫస్ట్‌లుక్



శ్రీహరి, హెబ్బా పటేల్, వెంకట్ లీడ్ రోల్స్‌లో రాజ్ తాళ్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'హరుడు'. డాక్టర్ లక్ష్మణరావు డిక్కల, డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తిచేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. శ్రీహరి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను, గ్లింప్స్‌ను డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో శ్రీహరి ఇంటెన్స్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ' మా ఫస్ట్ పోస్టర్, టీజర్ ఆర్జీవి చేతుల మీదుగా రిలీజ్ చేయడం సంతోషంగా ఉంది. ప్రొడ్యూసర్ లక్ష్మణరావు ఈ సినిమాని ప్యాషనేట్‌గా నిర్మించారు. అవుట్‌పుట్ బాగా వచ్చింది. అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. నిర్మాత లక్ష్మణరావు మాట్లాడుతూ 'సినీ పరిశ్రమలోకి శ్రీహరి ప్రోద్భలంతో అడుగుపెట్టాం. మా బేనర్ విజయవంతంగా సాగాలని ఆశిస్తున్నా' అని అన్నారు.

కడప దర్గాను సందర్శించిన రామ్‌చరణ్



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహ్మాన్ ఆహ్వానం మేరకు నటుడు రామ్ చరణ్ కడపలోని దర్గాను సోమవారం సందర్శించారు. ఆల్ ఇండియా 80వ ఉర్దూ కవి సమ్మేళనాన్ని రామ్‌చరణ్ ప్రారంభించారు. అయితే దీనికంటే ముందు డైరెక్టర్ బుచ్చిబాబు సానాతో కలిసి రామ్ చరణ్ కడపలోని విజయ దుర్గా దేవీ ఆలయాన్ని సందర్శించారు. తన తదుపరి సినిమా 'ఆర్‌సి16' స్క్రిప్ట్‌ని అమ్మవారి పాదాల వద్ద ఉంచి పూజలు చేయించారు. అనంతరం దర్గాకు చేరుకున్న రామ్‌చరణ్ మాట్లాడుతూ '12ఏళ్ల క్రితం మగధీర సినిమా రిలీజ్‌కు ముందు దర్గాను సందర్శించాను. అయ్యప్పమాల వేసుకుని దర్గాకు రావడం చాలా సంతోషంగా ఉంది' అన్నారు.

కుందాపూర్‌లో కదంబ సామ్రాజ్యం



భారీ నిర్మాణ విలువలతో ప్రేక్షకులు మెచ్చే సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన హోంబలే ఫిల్మ్స్ సంస్థ ఇప్పుడు కాంతార చాప్టర్ వన్‌ని అందించనుంది. దాదాపు రెండేళ్ల క్రితం విడుదలై దేశవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించిన కన్నడ చిత్రం 'కాంతార'కు ప్రీక్వెల్‌గా 'కాంతారా చాప్టర్ వన్'ని రూపొందిస్తున్నారు. రిషబ్ శెట్టి నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా కోసం కుందాపూర్‌లో చారిత్రక కదంబ సామ్రాజాన్ని చిత్ర నిర్మాణ సంస్థ మళ్లీ సృష్టించింది. ఇక హీరో రిషబ్ శెట్టి కేరళ పురాతన యుద్ధ విద్యల్లో ఒకటైన కలరిపయట్టులో శిక్షణ పొంది, సినిమా కోసం సిద్ధమయ్యారు. 'కాంతార చాప్టర్ వన్' కొంకణ్ జానపద గొప్పతనాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తుంది. గ్రిప్పింగ్ కథనం, అద్భుతమైన విజువల్స్ ప్రేక్షకుల్ని అలరిస్తాయి' అని నిర్మాణ సంస్థ వెల్లడించింది. శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది అక్టోబర్ 2న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది.

ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు..



మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా రూపుదిద్దుకున్న చిత్రం 'ఎమర్జెన్సీ'. ఇందులో ఇందిరాగాంధీ పాత్రను కంగన పోషిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. భారతదేశంలో చీకటి రోజులుగా పిలిచే ఎమర్జెన్సీ నాటి పరిస్థితుల్ని ఈ సినిమాలో చూపించారు. 'ఎమర్జెన్సీ' సినిమా ప్రారంభించినప్పటి నుంచి కంగనాకు చిక్కులు మొదలయ్యాయి. చంపేస్తామని హెచ్చరికలూ వచ్చాయి. అన్నీ తట్టుకుని సినిమా పూర్తి చేసి, సెన్సారుకు వెళితే, అక్కడ కూడా అభ్యంతరాలు వెల్లడయ్యాయి. చివరకు సెన్సార్ బోర్డ్ సూచనలకు చిత్ర నిర్మాణ సంస్థ అంగీకరించడంతో అడ్డంకులు తొలగిపోయాయి. 'భారతదేశంలో శక్తిమంతమైన మహిళ కథ, దేశ విధిని మార్చిన క్షణాలు మీ ముందుకు రానున్నాయి' అని పేర్కొంటూ వచ్చే ఏడాది జనవరి 17న 'ఎమర్జెన్సీ' విడుదలవుతుందని వెల్లడించారు కంగన.

ప్రతీ ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది



సత్యదేవ్, డాలీ ధనంజయ, ప్రియా భవానీశంకర్ నటించిన చిత్రం 'జీబ్రా'. ఈశ్వర్‌కార్తీక్ దర్శకత్వంలో ఎస్ఎన్‌రెడ్డి, ఎస్.పద్మజ, బాల సుందరమ్, దినేశ్ సుందరమ్ నిర్మించారు. ఈ నెల 22న చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా డైరెక్టర్ ఈశ్వర్‌కార్తీక్ మీడియాతో ముచ్చటించారు. "జీబ్రా' ప్రేక్షకులకు సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు ఆర్టిస్టిక్ ఎలిమెంట్స్‌ను బ్లెండ్ చేసిన చిత్రమిది. ఇందులో ఉన్న అన్ని అంశాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటాయి. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ కథను రాసుకున్నాను. కామన్ మ్యాన్ వ్యూ పాయింట్ నుంచి మొదలయ్యే ఈ సినిమా కథాంశం బ్యాంకింగ్, మనీ ల్యాండరింగ్ ఆధారంగా నడుస్తుంది. ప్రతీ ఒక్కరికీ కనెక్ట్ అయ్యే చిత్రమిది. రవి బస్రూర్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు.

మనసుల్ని కదిలిస్తుంది



ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'డ్రింకర్ సాయి'. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవ రాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. సామాన్యులే సెలబ్రిటీలుగా భావిస్తూ ఆటో డ్రైవర్, ఎలక్ట్రీషియన్, ఏసీ మెకానిక్, మోటార్ మెకానిక్, వెయిటర్, కూలీల చేతుల మీదుగా మేకర్స్ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో ధర్మ మాట్లాడుతూ ' ఇది యూత్‌ను చెడగొట్టే సినిమా అనుకోకండి. మంచి లవ్ స్టోరీ ఉంది. అలాగే మీకు నచ్చే ఎన్నో ఎలిమెంట్స్ కథలో ఉన్నాయి' అని అన్నారు. దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి మాట్లాడుతూ 'సాయి అనే పేరున్న యువకుడు దాదాపు ఇంటికొకరు ఉంటారు. ఈ చిత్రంలో హీరో ఎక్స్‌ప్రెస్‌లా తాగుతుంటాడు. అందుకే మూవీకి 'డ్రింకర్ సాయి' అనే పేరు పెట్టాం' అన్నారు.

బెంగాలీ నటి ఉమాదాస్ గుప్తా మృతి



ప్రముఖ బెంగాలీ నటి ఉమాదాస్ గుప్తా(85) సోమవారం ఉదయం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఇటీవల ఆస్పత్రిలో చేరారు. 1955లో సత్యజిత్ రే దర్శకత్వం వహించిన ప్రతిష్ఠాత్మక చిత్రం 'పథేర్ పాంచాలి'లో ఉమాదాస్ గుప్తా నటించారు. బిభూతి భూషణ్ బంధోపాధ్యాయ్ రాసిన 'పథేర్ పాంచాలి' నవల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. చిన్ననాటి నుంచే ఉమాదాస్ గుప్తా నాటక ప్రదర్శనలపై ఆసక్తి చూపేవారు. స్కూల్లో ప్రదర్శించిన ఒక నాటకంలో ఉమాదాస్ గుప్తా నటనను చూసిన సత్యజిత్ రే... 'పథేర్ పాంచాలి'లో దుర్గ పాత్రకు ఆమెను ఎంపిక చేశారు. ఈ చిత్రం తర్వాత ఆమె నటిగా కొనసాగకుండా ఉపాధ్యాయ వృత్తికే అంకితమయ్యారు.

దేశ భక్తిని పెంచే చిత్రం



దర్శకనిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్ తెరకెక్కించిన చిత్రం 'అభినవ్'. ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ 'పిల్లల్లో చిన్నప్పటి నుంచే దేశభక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని రూపొందించాను. విదేశాల్లో పిల్లలకు చిన్నప్పటి నుంచే దేశ రక్షణ విషయంలో అవగాహన కల్పించి, శిక్షణ ఇస్తుంటారు. అలా మన పిల్లలను కూడా తీర్చిదిద్దాలి' అని అన్నారు.

బీఆర్ఎస్ హయాంలో సర్వేతో దోపిడీ

- నాటి వివరాలు ఎక్కడున్నాయో తెలియడం లేదు
- ప్రజల కష్టాలు తెలుసుకునేందుకే తాజా సర్వే: పొంగులేటి



హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్ని వ్యవస్థలను స్తంభింపజేసి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టిందని, దాని ద్వారా ప్రజల ఆస్తులను గుర్తించి వాటిని కొల్లగొట్టారని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. చాలా గొప్ప సర్వే చేశామని చెప్పిన బీఆర్ఎస్ నేతలు ఉద్దేశపూర్వకంగానే వివరాలను బయటపెట్టలేదని అన్నారు. నాటి సర్వే ద్వారా బీఆర్ఎస్ నాయకులు ఆస్తులు పెంచుకున్నారని విమర్శించారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఎక్కడ ఉన్నాయో తమకూ తెలియడం లేదని పేర్కొన్నారు. సర్కారు చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే)పై విమర్శలు వస్తున్న నేపథ్యంలో పొంగులేటి సచివాలయంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రగతికి ఏం చేయాలి? భవిష్యత్తులో ప్రజలకు ఏం అవసరం? అనేది తెలుసుకునేలా సర్వేను శాస్త్రీయంగా చేపట్టామన్నారు. ప్రజల వ్యక్తిగత, కుటుంబ అవసరాలు ఏమిటి, పంచాయతీలు, వార్డులు, డివిజన్లు, నియోజకవర్గాల అవసరాలు ఏమిటి, మారుమూల ప్రాంతాల్లోని ఇబ్బందులు ఏమిటి? తదితర 75 అంశాలపై దృష్టిసారించేందుకే సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 1,16,14,349 కుటుంబాలకు గాను ఆదివారం వరకు 58.3 శాతం (67,72,246) కుటుంబాల సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. నెలాఖరు నాటికి పూర్తిచేస్తామని వివరించారు. విద్యావేత్తలు, మేధావులు సహా అన్ని వర్గాల నుంచి సానుకూల స్పందన వస్తుంటే.. ప్రతిపక్ష బీఆర్ఎస్ మాత్రం సర్వే అసత్య ప్రచారం చేస్తోందని పొంగులేటి మండిపడ్డారు. సంక్షేమ పథకాలు తొలగిస్తారంటూ గందరగోళానికి గురిచేస్తోందని విమర్శించారు. పేదలకు అందించే ఏ పథకాన్నీ సర్వే అనంతరం ఉపసంహరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళనకు గురికావొద్దని సూచించారు. కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవిత వివరాలు ఇచ్చినందుకు అభినందనలు తెలిపారు. కర్ణాటకలో సర్వేను కాంగ్రెస్ ప్రభుత్వం గోప్యంగా ఉంచడంపై ప్రశ్నించగా అక్కడి విషయాలు పూర్తిగా తెలియవని మంత్రి చెప్పారు.



సురేశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కోదండరాం, ఉద్యోగ సంఘాల నేతలు

సచివాలయ అధికారుల సంఘం అధ్యక్షుడిగా సురేశ్ కుమార్

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం తరువాత ఎట్టకేలకు సచివాలయ అధికారుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది తరువాత కొత్త సంఘానికి సోమవారం ఎన్నికలు జరిగాయి. కొత్తగా ఎన్నికైన సంఘం 2025 నుంచి 2027 వరకు మూడేళ్లపాటు పదవిలో కొనసాగనుంది. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా జి.సురేశ్ కుమార్ ఎన్నికయ్యారు. అనుబంధ అధ్యక్షుడిగా కే.ఎస్.ప్రసాద్, ఉపాధ్యక్షుడు-1గా డి.అంజన్‌కుమార్, ఉపాధ్యక్షుడు-2గా ఎం.రామ్‌సింగ్, ఉపాధ్యక్షురాలు-3గా డి.లలితకుమారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పి.లింగమూర్తి ఎన్నికయ్యారు. నూతన సచివాలయ అధికారుల సంఘాన్ని ఎమ్మెల్సీ కోదండరామ్, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు అభినందించారు.

చివరి గింజ ఇవ్వగానే బ్యాంకు గ్యారెంటీ వాపస్: డీఎస్ చౌహాన్

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణలో కొత్త విధానాన్ని రూపొందించి విప్లవాత్మకమైన మార్పులు చేపట్టామని, బ్యాంకు గ్యారెంటీ విషయంలో రైస్‌మిల్లర్లు అపోహలకు గురికాకుండా ధాన్యం సేకరణలో భాగస్వాములు కావాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి, పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ కోరారు. దొడ్డు ధాన్యం మరాడించి భారత ఆహారసంస్థకు, సన్న ధాన్యం మరాడించి రాష్ట్ర ప్రభుత్వానికి బియ్యం అప్పగించిన మరుక్షణమే బ్యాంకు గ్యారెంటీ పత్రాలు మిల్లర్లకు వాపస్ ఇస్తామని, ఇతర ఏ అంశాలతో బ్యాంకు గ్యారెంటీకి ముడిపెట్టే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు. మిల్లింగ్ సామర్థ్యానికి అనుగుణంగా రొటేషన్ పద్ధతిలో ఎన్నిసార్లయినా ధాన్యం కేటాయింపులు చేస్తామని తెలిపారు. 50 శాతం ప్రభుత్వ ధాన్యం మిల్లింగ్ చేయకపోయినా, ఏ-రిజిస్టర్ నిర్వహణ చేయకపోయినా లైసెన్సులు రద్దుచేసి రైస్‌మిల్లులకు తాళంవేసే అధికారం ప్రభుత్వానికి ఉందని హెచ్చరించారు. రూ. 3,200 కోట్ల బకాయిలున్న 362 రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయింపులు నిలిపివేసినట్లు తెలిపారు. ఏడాదిలో రూ.11,600 కోట్లు రైస్‌మిల్లర్ల నుంచి రికవరీ చేసినట్లు తెలిపారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో సంబంధం లేకుండా రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో కోటిన్నర మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యిందని, ఇదొక అరుదైన ఘనత అని తెలిపారు.

తుది మెరిట్ జాబితా ఇప్పుడే ఖరారు చేయం

- పీజీ మెడికల్ కౌన్సెలింగ్‌పై హైకోర్టుకు హెల్త్ వర్సిటీ హామీ

మెడికల్ పీజీ అడ్మిషన్లకు సంబంధించిన తుది మెరిట్ జాబితాను ఇప్పుడే ఖరారు చేయబోమని కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సోమవారం హైకోర్టుకు హామీ ఇచ్చాయి. కౌంటర్ దాఖలు చేసే వరకు ఎలాంటి చర్యలు తీసుకోబోమని తెలిపాయి. కొత్తగా తీసుకొచ్చిన స్థానికత నిబంధనలపై కౌంటర్ దాఖలు చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని కోరాయి. దాంతో గడువు ఇచ్చిన హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 25కు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 28న జీవో 148 జారీ చేసి.. వైద్య కళాశాలల్లో పీజీ ప్రవేశాల నిబంధనల్లో కొత్త అంశాలను జోడించింది. దీని ప్రకారం పీజీలో ప్రవేశం పొందాలంటే వరుసగా 4 సంవత్సరాలు ఎంబీబీఎస్ ఇక్కడే చదివి ఉండాలి. తెలంగాణ కోటా కింద ఇతర రాష్ట్రాల్లో చదివిన వారు కూడా తెలంగాణ స్థానికతకు అర్హులే. నాన్‌లోకల్ కోటాలో తెలంగాణలో చదివిన వారు మాత్రం స్థానిక కోటాకు అర్హులు కాదు. దీనిని సవాలు చేస్తూ దాదాపు వంద వరకు పిటిషన్‌లు దాఖలయ్యాయి. వీటిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుల ధర్మాసనం విచారణ చేపట్టింది.

ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర!

- అందుకే బీఆర్ఎస్ లగచర్ల రైతుల్ని రెచ్చగొడుతోంది
- ఎస్టీ కమిషన్‌కు కాంగ్రెస్ గిరిజన ఎమ్మెల్యేల ఫిర్యాదు

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీఆర్ఎస్ నేతలు కుట్ర చేస్తున్నారని, అందులో భాగంగానే లగచర్లలో అమాయక గిరిజన రైతుల్ని రెచ్చగొడుతున్నారని ప్రభుత్వ విప్ రాంచంద్రనాయక్, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే బాలూ నాయక్ ఆరోపించారు. ఈ మేరకు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు.. ఈ మేరకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు సంకెళ్లు వేశారని, దళితులను ట్రాక్టర్లతో తొక్కించారని చెప్పారు. తమ ప్రభుత్వం రైతుల సమస్యలు విని, పరిష్కరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. లగచర్లలో ప్రజలు, రైతుల సమస్యలు తెలుసుకునేందుకు కలెక్టర్, అధికారులు వెళితే..ఎలాంటి చర్చకూ ఆస్కారం ఇవ్వకుండా దాడి చేశారని, దీన్నిబట్టే దాడి వెనక కుట్ర కోణం ఉందని అర్థమవుతోందని చెప్పారు. రైతుల ముసుగులో అధికారులను చంపే ప్రయత్నం చేశారని ఆరోపించారు. లగచర్ల ఘటనలో అరెస్టయిన వారిలో ఏడుగురికి అసలు భూమే లేదని ఎంపీ బలరాంనాయక్ చెప్పారు. అక్కడ సేకరించాలనుకున్న 1350 ఎకరాల్లో గిరిజన భూములు 200 ఎకరాలు మాత్రమేనన్నారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలిసిన అనంతరం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎవరికీ ఇబ్బంది లేకుండా భూసేకరణ జరపాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. అమాయక గిరిజనులను అడ్డం పెట్టుకొని పబ్బం గడపాలని కేటీఆర్ చూస్తున్నారని రాంచంద్రనాయక్ ఆరోపించారు. కేటీఆర్, పట్నం నరేందర్‌రెడ్డి ఉసిగొల్పితేనే గిరిజనులు అధికారులపై దాడి చేశారని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకునేందుకే కేటీఆర్ లంబాడీలను ఉసిగొలిపే ప్రయత్నం చేస్తున్నాడని బాలూ నాయక్ ఆరోపించారు. అక్కడ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటైతే గిరిజనులకు ఉద్యోగాలు వస్తాయని, వారికి ఉద్యోగాలు రావడం కేటీఆర్‌కు ఇష్టం లేదని చెప్పారు. లగచర్లలో రాళ్లు, కర్రలు దొరకవని, ముందస్తు వ్యూహంతోనే వాటిని తెప్పించుకుని అధికారులపై దాడులు చేశారని మందుల సామేలు అన్నారు.

నేరెళ్ల దాడిపై విచారణ నివేదిక ఏది?

కేటీఆర్ నియోజకవర్గంలోని నేరెళ్లలో దళితులపై జరిగిన దాడి ఘటనపై విచారణ జరిపిన జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆ నివేదికను ఇంత వరకు ఎందుకు బయట పెట్టలేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేరెళ్ల బాధితులను పరామర్శించామే కానీ, బీఆర్ఎస్ నేతల్లా అధికారులపై దాడులు చేయించలేదని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు.

అరెస్టులు ఆపండి

దోషుల్ని వదిలి.. నిర్దోషుల్ని అరెస్ట్ చేశారు

- లగచర్ల ఘటనపై నివేదిక ఇవ్వాలని సీఎస్, డీజీపీని ఆదేశించాం
- ఎవరైనా ఇబ్బంది పెడితే నాకు ఫోన్ చేయండి
- బాధితులతో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్



రోటిబండ తండాలో గిరిజనులతో మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్

వికారాబాద్/కంది/పరిగి/బొంరాస్‌పేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో పోలీసులు వ్యవహరించిన తీరుపై జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దోషుల్ని వదిలేసి, నిర్దోషులను అరెస్టు చేశారని మండిపడ్డారు. గ్రామంలోని అమాయకులపై పోలీసులు ఇష్టారీతిలో దాడి చేసినట్లు విచారణలో తెలిసిందన్నారు. అక్కడ ఉండాలంటేనే ప్రజలు జంకుతున్నారని తెలిపారు. లగచర్ల ఘటనలో బాధిత గిరిజన, రైతు కుటుంబాలను పరామర్శించి.. అధికారులపై దాడికి దారి తీసిన పరిస్థితుల గురించి తెలుసుకునేందుకు ఆయన కమిషన్ డైరెక్టర్ వీకే రెడ్డితో కలిసి సోమవారం దుద్యాల మండలంలో పర్యటించారు. రోటిబండ తండా, లగచర్ల గ్రామాల్లో బాధిత రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సంగారెడ్డి సెంట్రల్ జైల్లో ఉన్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ.. లగచర్ల ఘటనలో అరెస్టులను ఆపేయాలని జిల్లా ఎస్పీకి సూచించారు. దాడి తర్వాత లగచర్ల, రోటిబండ తండాలో పోలీసుల తీరు గిరిజనులను తీవ్ర భయాందోళనల్లోకి నెట్టేసిందన్నారు. లగచర్ల ఘటనపై తమకు పది రోజుల్లో సమగ్ర నివేదిక అందజేయాలని సీఎస్, డీజీపీలను కోరామని, తమకు నివేదిక అందే వరకు ఎవరిపైనా చర్యలు తీసుకోవద్దని అధికారులకు స్పష్టం చేశారు. కమిషన్ ఆదేశాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని, సస్పెండ్ చేయిస్తామని హెచ్చరించారు. కమిషన్‌కు చెప్పకుండా ఏమీ చేయొద్దన్నారు. గ్రామాలు, తండాల్లో పోలీసు పికెటింగ్‌లను తొలగించాలని చెప్పారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసే పరిశ్రమలపై ప్రజల్లో గందరగోళం నెలకొందని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని సూచించారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే అమాయక గిరిజనులు నష్టపోకుండా ప్రభుత్వ చర్యలు ఉండాలని చెప్పారు.

ఆడ, మగ అనే తేడా లేకుండా..

దాడి ఘటన జరిగిన రోజు అర్ధరాత్రి పోలీసులు కరెంట్ తీసేసి ఇళ్లలోకి వచ్చి ఆడ, మగ, పెద్ద, చిన్న అనే తేడా లేకుండా కుళ్ల బొడిచారని పలువురు గిరిజన మహిళలు హుస్సేన్ ఎదుట వాపోయారు. మహిళలు, యువతుల పట్ల పోలీసులు అసభ్యంగా వ్యవహరించారన్నారు. అధికారులపై దాడి అనుకోకుండా జరిగిందని, లొల్లి చేసింది కొందరైతే అన్యాయంగా వేరే వారిని కొట్టి జైలుకు పంపించారని ఆరోపించారు. అధికారులపై జరిగిన దాడికి, తమకు సంబంధం లేదని చెప్పారు. తనపై దాడి జరగలేదని కలెక్టర్ చెబుతున్నా.. అర్ధరాత్రి 1.30 గంటలకు వచ్చి పోలీసులు తమ ఇళ్ల మీద పడ్డారని వాపోయారు. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి ఎంత ముఖ్యమో తమకు తమ భూములు అంతే ముఖ్యమని వారు స్పష్టం చేశారు. తమ భూములు ఇచ్చేది లేదని తండా వాసులు స్పష్టం చేశారు. అయితే అధికారులు వస్తే రానివ్వాలని.. మీకు ఇష్టమైతేనే భూములు ఇవ్వాలని, లేకపోతే లేదని హుస్సేన్ చెప్పారు. సరైన బందోబస్తు లేకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని ఎస్పీని ప్రశ్నించారు. మరోసారి రైతులను బెదిరిస్తే బాగోదని హెచ్చరించారు. బాధిత రైతుల ఆవేదనను తాను అర్థం చేసుకున్నానని, ఇంకా ఎవరైనా ఇబ్బంది పెడితే నేరుగా తనకు ఫోన్ చేయాలంటూ స్థానికులకు తన ఫోన్ నంబర్ ఇచ్చారు. స్థానికంగా ఓ పార్టీ కార్యకర్త ఎనిమిది నెలలగా ఆ ప్రాంత ప్రజలను పార్మా కంపెనీ కోసం భూముల ఇవ్వాలని ఇబ్బందులకు గురిచేసినట్లు తనకు తెలిసిందన్నారు. జైల్లో ఉన్న లగచర్ల బాధితులతో మాట్లాడి వివరాలను రికార్డు చేశానన్నారు. వారికి న్యాయం చేస్తానని చెప్పారు.

అకారణంగా జైలుకు పంపించారు..

పంచాయతీ కార్యదర్శిగా పనిచేసే తన భర్త రాఘవేందర్ గొడవ జరిగిన రోజు లగచర్లలో లేకపోయినా.. అతడిని అరెస్టు చేసి జైలుకు పంపించారని, సస్పెండ్ చేశారని అతడి భార్య హుస్సేన్ ఎదుట వాపోయింది. దీంతో సంబంధం లేని వ్యక్తిని అరెస్టు చేసి, జైల్లో పెడితే ఎలా? అని ఆయన ఎస్పీని ప్రశ్నించారు. ఘటనతో సంబంధం లేకున్నా విష్ణువర్ధన్‌రెడ్డి, శివకుమార్, రవి, లక్ష్మయ్యలను అక్రమంగా అరెస్టు చేశారని అక్కడున్న వారు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాగా, లగచర్లలో అధికారులపై దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి కోరారు. ఈ మేరకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. లగచర్ల దాడికి సూత్రదారులు వేరే ఉన్నారని తెలిపారు.

పరిగి డీఎస్పీపై బదిలీ వేటు!

- పంచాయతీ కార్యదర్శిపై కూడా..

వికారాబాద్/దౌల్తాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో ఈ నెల 11న కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు పలువురు అధికారులపై దాడులకు పాల్పడిన ఘటనను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. చర్యలకు ఉపక్రమించింది. పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డిపై బదిలీ వేటు వేసింది. ఆయన్ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, ఎస్సై నుంచి జిల్లా ఉన్నతాధికారి వరకు బాధ్యులపై శాఖాపరమైన చర్యలకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదనపు డీఎస్పీ శ్రీనివాస్‌ను కరుణాసాగర్ స్థానంలో పరిగి డీఎస్పీగా నియమించారు. లగచర్ల ఘటనలో వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని సంగాయిపల్లి పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌ను సస్పెండ్ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. రాఘవేందర్ సొంత గ్రామం లగచర్ల. కలెక్టర్, అధికారులపై జరిగిన దాడి ఘటనలో కేసు నమోదు చేసి రాఘవేందర్‌ను రిమాండ్‌కు తరలించారు. దీంతో ఆయన్ను విధుల నుంచి తప్పించారు. కాగా, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ 25వ తేదీకి వాయిదా పడింది. ఇదిలా ఉంటే, నరేందర్‌రెడ్డి కస్టడీ కోరుతూ పోలీసులు వేసిన పిటిషన్‌పై విచారణను కొడంగల్ కోర్టు ఈ నెల 20కి వాయిదా వేసింది.

నియంతలా సీఎం రేవంత్ ప్రవర్తన

పేదల భూములను లాక్కునేందుకు యత్నిస్తున్నారు.. రైతులకు సీఎం సోదరుడి బెదిరింపులు: డీకే అరుణ

- లగచర్లపై పార్లమెంటులో హక్కుల తీర్మానం: ఈటల
- సంగారెడ్డి జైలులో ఉన్న గ్రామస్థులకు పరామర్శ



కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలు వద్ద మాట్లాడుతున్న ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్

కంది, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక నియంతలా ప్రవర్తిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ అన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్, అధికారులపై దాడి కేసులో అరెస్టై సంగారెడ్డి జైలులో ఉన్న లగచర్ల గ్రామస్థులను ఆమె సోమవారం ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఫార్మా పరిశ్రమకు భూములు ఇవ్వబోమని 8 నెలలుగా రైతులు, పేదలు ఆందోళన చేస్తున్నారన్నారు. కానీ వారి భూములను లాక్కునేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారన్నారు. భూములను బలవంతంగా లాక్కుంటామని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారన్నారు. అధికారులపై దాడి ఘటనలో కాంగ్రెస్ వాళ్లు కూడా ఉన్నారని, వారిని విడిచిపెట్టి మిగతా పార్టీల వారిని అరెస్ట్ చేశారని ఆరోపించారు. దాడి జరిగిన రోజున అర్ధరాత్రి పోలీసులు గ్రామస్థుల ఇళ్లలోకి చొరబడి దాడి చేశారన్నారు. అరెస్ట్ చేసిన వారిపై 'థర్డ్ డిగ్రీ' ప్రయోగించి వారి కాళ్లు, చేతులు కమిలిపోయేలా కొట్టారన్నారు. సీఎంకు తనను ఓటేసి గెలిపించిన ప్రజల కంటే ఫార్మా కంపెనీలపైనే ప్రేమ ఎక్కువైందన్నారు. రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన 11 నెలలకే పేదల ఉసురుపోసుకుంటున్నారన్నారు. సీఎం అహంకారం వీడి లగచర్ల బాధితులను వెంటనే విడుదల చేయాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. ఫార్మా సిటీ పేరుతో భూములను సేకరించి వాటిని రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు అప్పనంగా ఇస్తే ఊరుకోమని ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. కొడంగల్ నియోజకవర్గంలో సీఎం సోదరుడి అరాచకాలు ఎక్కువయ్యాయని, ఆయన ప్రజలపై దౌర్జన్యం చేస్తున్నాడని ఆరోపించారు. లగచర్ల ఘటన తర్వాత అక్కడికి వెళ్లడానికి పోలీసులు ఎవ్వరినీ అనుమతించకపోయినా, సీఎం సోదరుడు మాత్రం 50 వాహనాల్లో వెళ్లి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడన్నారు. సీఎం బేషరతుగా రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు. ఈ విషయమై పార్లమెంటులో హక్కుల తీర్మానం ప్రవేశపెడతామన్నారు.


లగచర్ల వెళ్తున్న ఈటల, డీకే అరుణ అరెస్టు

మొయినాబాద్/నార్సింగ్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులను పరామర్శించేందుకు వెళుతున్న బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని మొయినాబాద్ పోలీసులు అడ్డుకున్నారు. సోమవారం సాయంత్రం మొయినాబాద్ ఠాణా ఎదుట రోడ్డుపై బారికేడ్లు అడ్డుపెట్టి ఎంపీలు, ఎమ్మెల్యేల కార్లను ఆపేశారు. దీంతో వారు దిగకుండా కారులోనే కూర్చున్నారు. సమాచారం తెలుసుకున్న స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పోలీసులు ఎంపీలు, ఎమ్మెల్యేను బలవంతంగా వారి కారుల్లో నుంచి దింపి అరెస్టు చేసి పోలీసు వాహనాల్లో నార్సింగ్ ఠాణాకు తరలించారు. డీకే అరుణ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఓ చేతకాని దద్దమ్మ అని, దమ్ముంటే రాజీనామా చేసి కొడంగల్‌లో మళ్లీ పోటీ చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. "మేం రౌడీలం కాదు. పార్లమెంట్ సభ్యులం. మమ్మల్ని ఎలా అడ్డుకుంటారని పోలీసులపై ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు.

మణిపూర్ వంటి పరిస్థితే లగచర్లలోనూ

(మొదటి పేజీ తరువాయి)

ఉందన్నారు. అందుకే ఆయనే ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటాడని భావిస్తున్నానని, ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఆ తర్వాత 15ఏళ్లు అధికారం తమదేనన్నారు. సోమవారం ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో లగచర్ల బాధితులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తొలుత లగచర్ల ఘటన, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిల గత వ్యాఖ్యల వీడియోను ప్రదర్శించారు. ఆ తర్వాత కేటీఆర్ మాట్లాడుతూ మణిపూర్, ముంబైలోని ధారావి, యూపీలోని ఝాన్సీ ఘటనపై తాము విచారం వ్యక్తం చేస్తున్నామని, లగచర్ల ఘటన వాటికంటే తక్కువేం కాదన్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం గిరిజన మహిళలపై చేసిన అఘాయిత్యాలను దేశ ప్రజలందరికీ తెలిసేలా చేసేందుకే ఢిల్లీకి వచ్చామన్నారు. రైతులు, బీసీ, దళితులు, గిరిజనుల సంక్షేమం గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పదే పదే ప్రస్తావిస్తారని, అయితే రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో గిరిజన మహిళల ఆవేదనను రాహుల్ వినాలన్నారు. అర్ధరాత్రి పోలీసులు వచ్చి ఎలా లైంగిక దాడులు చేస్తున్నారో, ఎలా శారీరకంగా హింసించారో, ఎలా అరెస్టులు చేస్తున్నారో లగచర్ల బాధితులు వివరంగా చెబుతున్నారని, ఆ దమనకాండపై ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. దేశంలో తెలంగాణ అనే రాష్ట్రం ఉందని ప్రధాని మరిచిపోయారా? అని వ్యాఖ్యానించారు. 50 నుంచి 60 ఏళ్లుగా ఇవే భూములపై ఆధారపడి బతుకుతున్నామని, రేవంత్‌రెడ్డి అల్లుడి ఫార్మా కంపెనీ కోసం తమ భూములను కోల్పోవాలా? అని గిరిజనులు ప్రశ్నిస్తున్నారన్నారు. తెలంగాణలో చిన్నపిల్లలు పిలిచినా వస్తానని చెప్పిన రాహుల్‌కు గిరిజన మహిళ ఆక్రందనలు ఎందుకు వినిపించటం లేదన్నారు. రాజ్యాంగ పరిరక్షణ అంటూ రాహుల్ మాటలు చెప్పడం కాదని, కాంగ్రెస్ ముఖ్యమంత్రి అరాచకాలను ఆపాలన్నారు.



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

9 నెలలుగా పోరాడుతుంటే...

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గిరిజనుల భూములు లాక్కునే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. ఫార్మా విలేజ్ కోసం తమ భూములు ఇవ్వబోమని 9 నెలలుగా లగచర్ల రైతులు పోరాటం చేస్తుంటే ముఖ్యమంత్రి సహా ఎవరూ వారికి సమయం ఇవ్వలేదన్నారు. కలెక్టర్ వచ్చినప్పుడు నిరసన తెలిపినందుకు వారిని అరెస్టు చేశారన్నారు. దాదాపు 30 మంది రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్నారు. సంగారెడ్డి జైలుకెళ్లి చూశామని, వాళ్లు నడవలేకపోతున్నారని తెలిపారు. కొట్టామని జడ్జి ముందు చెబితే మళ్లీ కొట్టి కుటుంబ సభ్యులపై కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారు. లగచర్లలోనే కాదని, భూములు ఇవ్వబోమని సంగారెడ్డిలో కూడా రైతులు ఆందోళన చేశారన్నారు. రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని పూర్తిగా వాళ్ల ఫ్యామిలీ ప్యాకేజ్‌గా మార్చేస్తున్నారన్నారు. తాము ఫార్మాసిటీ కోసం దాదాపు 14 వేల ఎకరాల భూమి సేకరించామని, అయితే తాము రైతులను ఒప్పించి, మెప్పించి వారికి సరైన పరిహారం ఇచ్చామన్నారు. భూమి ఇచ్చే రైతులకు అన్యాయం జరగవద్దని కాంగ్రెస్ పార్టీయే భూసేకరణ చట్టం తీసుకొచ్చిందని, కానీ తెలంగాణలో గిరిజనుల భూముల విలువ రూ.60 లక్షలు ఉంటే, కనీసం రూ.8 లక్షలు కూడా ఇవ్వడం లేదన్నారు.

రేవంత్ ప్రైవేట్ సైన్యంగా పోలీసులు

సీఎం రేవంత్ రెడ్డికి ప్రైవేట్ సైన్యంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సీఎం సోదరుడు రైతులను బెదిరిస్తూ, పాల్పడుతున్న అరాచకాలపై ఇప్పటికీ ఒక్క కేసు కూడా పెట్టలేదన్నారు. ఆయన వార్డు సభ్యుడు కూడా కాదని, కానీ ఆయనకు ప్రోటోకాల్ ఇచ్చి కలెక్టర్ వచ్చి స్వాగతం పలుకుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అకృత్యాలపై, ప్రజల సమస్యలపై బీజేపీ నాయకులు మాట్లాడటం లేదన్నారు. లగచర్ల బాధితులకు ఎస్సీ, ఎస్టీ, మహిళా, మానవ హక్కుల కమిషన్ల ద్వారా న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని కేటీఆర్ అన్నారు. అఘాయిత్యాలకు పాల్పడిన పోలీసులకు నోటీసులు ఇస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. కేంద్రానికి కూడా మనసుంటే ఈ విషయంలో వెంటనే విచారణ జరపాలని డిమాండ్ చేశారు.



జీ20 సదస్సులో అమెరికా అధ్యక్షుడు బైడెన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమాఫోసాతో ప్రధాని మోదీ

ప్రపంచ సంఘర్షణలతో పేదదేశాలు సతమతం

వెంటనే పరిష్కారం కనుగొనాలి.. జీ20 సదస్సులో మోదీ

రియో డి జనెరియో, నవంబరు 18: ప్రపంచంలో నెలకొన్న సంఘర్షణల ప్రభావం పేద దేశాలపై పడుతోందని, అందువల్ల వీటికి వెంటనే పరిష్కారం కనుగొనాల్సి ఉందని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఈ యుద్ధాల ప్రభావం ఆహారం, ఇంధనం, ఎరువుల రంగంపై పడిందని చెప్పారు. 'గ్లోబల్ సౌత్'గా వ్యవహరించే ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా ఖండాల్లోని పేద దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం బ్రెజిల్ రాజధాని రియో డి జనెరియోలో జరిగిన జీ-20 కూటమి శిఖరాగ్ర సదస్సులో మోదీ ప్రసంగించారు. యుద్ధాల కారణంగా గ్లోబల్ సౌత్ దేశాలకు జరుగుతున్న నష్టంపై దృష్టి పెట్టాలని, అప్పుడే ఈ సదస్సు విజయవంతమవుతుందని అన్నారు. ఈ సదస్సులో 'సామాజిక సమ్మిళితం, ఆకలి, పేదరికాలపై పోరాటం' అన్న అంశంపై చర్చలు జరుగుతున్నందున దీనిపై కూడా దృష్టి పెట్టాలని చెప్పారు. ఆకలి, పేదరికానికి వ్యతిరేకంగా ప్రపంచ కూటమి ఏర్పాటు కావాలన్న బ్రెజిల్ అధ్యక్షుడి ప్రతిపాదనను స్వాగతించారు. సదస్సు ప్రారంభం కావడానికి ముందు ప్రధాని మోదీ.. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రెజిల్ అధ్యక్షుడు లుల డి సిల్వా, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ అంటోనియో గుటెర్రస్, ఇతర ప్రపంచ నాయకులతో భేటీ అయ్యారు. సీటులో కూర్చొనే ముందు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో కరచాలనం చేశారు. కాగా, బ్రెజిల్ పర్యటనలో మోదీకి.. సంప్రదాయ భారతీయ వస్త్రాలను ధరించిన పలువురు సంస్కృత శ్లోకాలను పఠిస్తూ ఘన స్వాగతం పలికారు.

ఢిల్లీలో కాలుష్యం తీవ్రం.. బడుల మూసివేత

న్యూఢిల్లీ, నవంబరు 18: ఢిల్లీ కాలుష్యం తీవ్రంగా పరిణమించిన నేపథ్యంలో నాలుగో దశ కార్యాచరణ ప్రణాళిక(జీఆర్‌ఏపీ-4)ను సోమవారం ఉదయం నుంచి అమల్లోకి తెచ్చారు. ఇందులో భాగంగా పాఠశాలలను మూసేశారు. 11, 12 తరగతులకు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తున్నారు. సాఫ్ట్‌వేర్, ఇతర ఐటీ అనుబంధ సంస్థలను వర్క్‌ఫ్రమ్ హోంకు అనుమతించాలని ఆదేశించారు. ఆరు బయట కార్యకలాపాలను పూర్తిగా నిషేధించారు. సాధారణ నిర్మాణాలు, కూల్చివేతలను ఇప్పటికే ఆపేయగా, సోమవారం నుంచి కీలక మౌలిక ప్రాజెక్టుల నిర్మాణాలను కూడా నిలిపేశారు. నిత్యావసరాల సరకు రవాణా తప్ప మిగతా అన్ని సరకు రవాణా వాహనాలను నగరంలోకి రాకుండా ఆపేశారు. మెట్రోలు, బస్సులు, ఇతర ప్రజా రవాణా వాహనాలు, క్యాబ్‌లు, ఆటోలు, అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్లు, ప్రజాసంబంధ కార్యక్రమాలకు వెళ్లే ప్రభుత్వ అధికారుల వాహనాలు, అత్యవసరం మీద వెళుతున్న ప్రైవేటు వాహనాలు, బ్యాటరీ వాహనాలను మాత్రమే అనుమతించారు. మిగతా అన్ని ప్రైవేటు వాహనాల రాకపోకలను నిలిపేశారు. ఢిల్లీలో ప్రస్తుతం వాతావరణ నాణ్యత సూచీ 500 వరకు సూచిస్తోంది. సూచీ 400 దాటితే నాలుగో దశ కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తారు. తాజాగా తీసుకుంటున్న చర్యల వల్ల సూచీ 300-400 మధ్యకు వచ్చినా నాలుగో దశ కార్యాచరణ ప్రణాళికను కొనసాగించాలని సోమవారం సుప్రీంకోర్టు ఆదేశించింది.

అమెరికా పోలీసుల అదుపులో అన్మోల్ బిష్ణోయ్

ముంబయి, నవంబరు 18: గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్‌ను అమెరికాలోని కాలిఫోర్నియా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం అందింది. ముంబయిలోని బాంద్రాలో సినీహీరో సల్మాన్‌ఖాన్ ఇంటివద్ద జరిగిన కాల్పులు, ఎన్సీపీ నాయకుడు బాబా సిద్ధిఖీ హత్య కేసులో అన్మోల్ నిందితుడిగా ఉన్నాడు. దీనిపై దర్యాప్తు జరిపిన పోలీసులు పరారీలో ఉన్న అన్మోల్‌పై నాన్‌బెయిల్‌బుల్ వారెంటును జారీ చేశారు. మరో రెండు క్రిమినల్ కేసుల్లో ఎన్ఐఏ కూడా విచారణ జరుపుతోంది. దాదాపు 20 క్రిమినల్ కేసులు ఉండడంతో అతడిని అప్పగించాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరింది.

కాగ్ చీఫ్‌గా సంజయ్ మూర్తి నియామకం

న్యూఢిల్లీ, నవంబరు 18: కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) చీఫ్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ మూర్తి నియమితులయ్యారు. ప్రస్తుత కాగ్ చీఫ్ జీసీ ముర్ము పదవీకాలం బుధవారంతో ముగియనుంది. ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన సంజయ్.. 1989లో ఐఏఎస్‌కు ఎంపికై.. హిమాచల్ క్యాడర్‌లో సేవలందించారు. 2002-07 మధ్యకాలంలో కేంద్ర సర్వీసుల్లో భాగంగా.. పర్యావరణ, అటవీ, ఐటీ మంత్రిత్వ శాఖల్లో పనిచేశారు. ఐటీలో ఉన్నప్పుడే.. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నమెంట్(ఎన్ఐఎస్‌జీ)లో మూడేళ్ల డైరెక్టర్‌గా కొనసాగారు. గురువారం ఆయన కాగ్ చీఫ్‌గా బాధ్యతలు చేపడతారు.

మస్క్ రాకెట్లో రోదసిలోకి మన శాటిలైట్

న్యూఢిల్లీ, నవంబరు 18: ఆస్ట్రేలియా, బ్రెజిల్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, జపాన్.. ఇలా వేరే దేశాలకు చెందిన 400కు పైగా ఉపగ్రహాలను మన ఇస్రో రాకెట్లు రోదసిలోకి మోసుకెళ్లాయి! ఇప్పుడు దానికి భిన్నంగా.. 4,700 కిలోల బరువున్న మన 'జీశాట్-20 (జీశాట్ ఎన్2)' కమ్యూనికేషన్స్ ఉపగ్రహాన్ని ఈలన్ మస్క్‌కు చెందిన 'స్పేస్ ఎక్స్' సంస్థకు చెందిన ఫాల్కన్-9 రాకెట్ భారత కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి దాటిన ఒక్క నిమిషానికి (12:01 గంటలకు) విజయవంతంగా రోదసిలోకి మోసుకెళ్లింది! అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న కేప్ కెనరెవాల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి ఈ ప్రయోగాన్ని చేపట్టారు. దేశంలోని మారుమూల ప్రాంతాలతో పాటు.. విమానాల్లో (ఇన్ ఫ్లైట్) ఇంటర్‌నెట్ సేవలను అందించేందుకు ఇస్రో ఈ ఉపగ్రహాన్ని రూపొందించింది. దీని జీవితకాలం 14 సంవత్సరాలు. భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తున పరిభ్రమిస్తూ.. భారత్‌తోపాటు, అండమాన్ నికోబార్, లక్షద్వీప్‌లో ఇంటర్‌నెట్ సేవలు అందిస్తుందీ ఉపగ్రహం. ఇతర దేశాల ఉపగ్రహాలను రోదసిలోకి ప్రవేశపెట్టడంలో పేరుగాంచిన ఇస్రో.. ఈ ఉపగ్రహ ప్రయోగానికి మాత్రం స్పేస్ ఎక్స్ రాకెట్‌ను ఎందుకు ఎంచుకుందంటే.. బరువే దీనికి కారణం. బాహుబలిగా పేరొందిన ఇస్రో ప్రయోగ వాహనం ఎల్‌వీఎం-3 రాకెట్ 4వేల కిలోల దాకా బరువున్న ఉపగ్రహాలను మోసుకెళ్లగలదు. కానీ, జీశాట్ బరువు 4700 కిలోలు. ఇంత భారీ ఉపగ్రహాల ప్రయోగానికి ఇస్రో ఇన్నాళ్లుగా యూరోపియన్ ఏరియేన్ రాకెట్లపై ఆధారపడుతోంది. ఈసారి అవి అందుబాటులో లేని నేపథ్యంలో ఈసారి స్పేస్ ఎక్స్ ఫాల్కన్-9ను ఎంచుకుంది.

నువ్వా.. నేనా?

(మొదటి పేజీ తరువాయి)

పోటీ చేస్తోంది. బీజేపీకి చెందిన మరో 19 మంది నేతలు ఎన్సీపీ, శివసేన టికెట్లపై పోటీ చేస్తున్నారు. అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ- 59, ఏక్ నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన- 81 సీట్లకు పోటీ చేస్తున్నాయి. మహా వికాస్ అఘాడీ కూటమిలో కాంగ్రెస్ అత్యధికంగా 102, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన- 96, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ- 86 చోట్ల పోటీ చేస్తున్నాయి. బీజేపీతో కాంగ్రెస్- 76 చోట్ల నేరుగా తలపడుతోంది. మహారాష్ట్ర ఎన్నికల్లో కుల, మత రాజకీయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. హిందువులంతా కలిసికట్టుగా ఓటు వేయాలని, ఓట్లు చీల కూడదని బీజేపీ విస్తృతంగా ప్రచారం చేసింది. ఏక్ హైతో సేఫ్ హై, బటేంగేతో కటేంగే పేరిట మోదీ, అమిత్ షా, యోగి ఇచ్చిన నినాదాలు ఈ ఎన్నికల్లో ప్రచారాంశాలయ్యాయి. అదానీ ఒక్కడికే అన్నీ దక్కాలని మోదీ భావిస్తున్నారని, అందుకే ఏక్ హైతో సేఫ్‌హై అని నినాదం చేస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ధారావి అభివృద్ధి ప్రాజెక్టు పేరిట అదానీకి ముంబైలో కీలక ప్రాంతాన్ని అప్పజెప్పి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇవి కాక రైతుల ఆత్మహత్యలు, అధిక ధరలు, నిరుద్యోగం ప్రచారాంశాలయ్యాయి.

లాడ్లీ బెహనా గేమ్ చేంజర్?

ఎన్నికల ముందు మహిళల కోసం మహాయుతి కూటమి ప్రభుత్వం ప్రకటించిన లాడ్లీ బెహనా యోజన గేమ్ చేంజర్‌గా మారనున్నదని బీజేపీ అంచనా వేస్తోంది. నెలకు రూ. 1500 చొప్పున 2.5 కోట్ల మందికి ఈ పథకం క్రింద చెల్లించడంతో మహిళలు తమకే ఓటు వేస్తారని మహాయుతి కూటమి నేతలు ఆశాభావంగా ఉన్నారు. ఎన్నికల ప్రచారం ముగియడంతో అభ్యర్థులు ప్రలోభాలు మొదలుపెట్టినట్లు సమాచారం. ఇందుకోసం రెండు కూటముల నుంచి సరిహద్దు జిల్లాల్లోని నేతలను కూడా పురమాయించినట్లు తెలిసింది. బుధవారం పోలింగ్ జరగనుండటంతో సరిహద్దుల్లో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించారు.

ఝార్ఖండ్‌లో చివరిదశ పోలింగ్

ఝార్ఖండ్‌లో చివరిదశలో భాగంగా 38 స్థానాలకు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. హేమంత్ సొరేన్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే నేతలు ధీమాగా ఉన్నారు.



తెలంగాణ సరిహద్దులో ఇదీ పరిస్థితి

తెలంగాణ సరిహద్దులో మహారాష్ట్రలోని నాందేడ్, యావత్‌మాల్, చంద్రాపూర్, గడ్చిరోలి జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాల పరిధిలో మొత్తం 25 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నాలుగు జిల్లాల్లో తెలుగు వచ్చిన వారు ఎక్కువగా ఉండటంతో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు సీతక్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఎంవీఏ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. మహాయుతి తరఫున ఏపి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రచారం నిర్వహించారు. యవత్‌మాల్, చంద్రాపూర్, నాందెడ్ జిల్లాల పరిధిలోని కేళాపూర్, రాజురా, డిగ్రస్, కిన్వట్, వణి, చంద్రాపూర్, బల్లార్ష 7 నియోజక వర్గాలలో బీజేపీ, కాంగ్రెస్ కూటముల మధ్య పోటీ నువ్వానేనా అన్నట్లుంది. తెలంగాణ మాజీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ మాణిక్‌రావ్‌ఠాక్రె పోటీ చేస్తున్న డిగ్రస్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బీజేపీ నుంచి తీవ్రమైన పోటీ కనిపిస్తుంది.

ఒక్కటిగా ఉంటే.. బాగుపడేది అదానీయే!

ముంబై, నవంబరు 18: 'అందరూ ఒక్కటిగా ఉంటేనే భద్రత (ఏక్ హై తో సేఫ్ హై)' అని మోదీ ఇచ్చిన నినాదాన్ని రాహుల్‌గాంధీ ఎద్దేవా చేశారు. అందరూ ఒక్కటిగా ఉంటే బాగుండేది అదానీయేనన్నారు. వారిద్దరూ కలిసి ఉంటేనే.. ఇద్దరూ క్షేమంగా ఉంటారని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం ముగింపు చివరి రోజైన సోమవారం రాహుల్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ ఖజానా పెట్టెను తీసుకొచ్చారు. దానిని తెరిచి అందులో మోదీ, అదానీ కలిసి ఉన్న పోస్టర్‌ను తీసి చూపించారు. ముంబైలోని ధారవి పునర్నిర్మాణ ప్రాజెక్టును అదానీకి కట్టబెట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనిపై బీజేపీ మండిపడింది. అదానీతో రాజస్థాన్, తెలంగాణల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కుదుర్చుకున్న ఒప్పందాల మాటేమిటని నిలదీసింది. 'తెలంగాణలో రేవంత్‌రెడ్డి సర్కారు రూ.12,400 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. రాజస్థాన్‌లో గత అశోక్ గహ్లోత్ ప్రభుత్వం రూ.46 వేల కోట్ల సోలార్ ప్రాజెక్టును అదానీకి కట్టబెట్టింది. మరి అదానీకి ఎవరితో లింకులున్నట్లు' అని ప్రశ్నించింది.



హీరోగా నిలిచినా.. తన పిల్లలను కోల్పోయాడు

ఝాన్సీ అగ్ని ప్రమాద ఘటనలో విషాదం

ప్రమాదం నుంచి చాలా మంది శిశువులను కాపాడిన యాకూబ్

పొగలో తన ఇద్దరు పిల్లల మృతి



ఝాన్సీ, నవంబరు 18: అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న చాలా మంది శిశువులను కాపాడి హీరోగా మన్ననలు అందుకున్న యాకూబ్ మన్సూరీ.. తన కవల పిల్లలను మాత్రం రక్షించుకోలేకపోయాడు. తాను రక్షించిన పిల్లల తల్లిదండ్రులు అతనికి కృతజ్ఞతలు చెపుతుంటే.. అతను మాత్రం కళ్ల ముందే ప్రాణాలు కోల్పోయిన తన పిల్లలను తలచుకుని కుమిలిపోతున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో లక్ష్మీబాయి ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాద విషాద ఘటన వివరాలను యాకూబ్ మీడియాకు వివరించాడు. "ఈనెల 9న పుట్టిన నా కవల పిల్లలకు శ్వాసలో ఇబ్బంది వచ్చింది. వారిని ఝాన్సీ ఆస్పత్రిలో చేర్చాం. రాత్రి అగ్ని ప్రమాదం గుర్తించి ఎస్ఎన్‌సీయూ లోపలి యూనిట్ నుంచి ఓ మహిళ అరవడంతో సడెన్‌గా నిద్ర నుంచి లేచాం. ఆ యూనిట్ లోపలికి వెళ్లడానికి ప్రయత్నించాం. అయితే వెళ్లడానికి దారిలేక కిటికీ పగలగొట్టాల్సి వచ్చింది. లోపల చాలా వేడిగా ఉండటమే కాకుండా పూర్తి పొగ కమ్మేసింది. నా బావమరిదితో కలసి లోపల ఉన్న ఒక్కో శిశువును జాగ్రత్తగా కిటికీలోంచి బయటకు తీసుకువచ్చాం. ఆ చిన్న గదిని విపరీతంగా పొగ కమ్మేయడంతో నా పిల్లలను గుర్తించే అవకాశం లేదు. పొగ ఘాటుకు మేం వాంతులు చేసుకున్నాం. ఇక ఆ చిన్నపిల్లలు ఎలా తట్టుకుంటారు? అందుకే చనిపోయారు. నా పిల్లలను పోస్టుమార్టంలో చూడటం భరించలేని విషయం" అని తెలిపాడు. ఈ ప్రమాదంలో 11 మంది శిశువులు చనిపోయారు.

అవును.. ఎమర్జెన్సీ విధిస్తా: ట్రంప్

వాషింగ్టన్ డీసీ, నవంబరు 18: తాను అధికార పగ్గాలు చేపట్టాక జాతీయ అత్యవసర పరిస్థితిని విధిస్తానని.. బైడెన్ హయాంలో పెద్ద ఎత్తున అక్రమంగా అమెరికాలోకి వచ్చినవారిని తిరిగి వారి వారి దేశాలకు పంపేందుకు (మాస్ డీపోర్టేషన్) సైనిక సాయాన్ని వినియోగించుకుంటానని ట్రంప్ స్పష్టం చేశారు. ట్రంప్ పగ్గాలు చేపట్టగానే అమెరికాలో ఎమర్జెన్సీ విధించే అవకాశం ఉందంటూ వారంరోజుల క్రితం 'జ్యుడీషియల్ వాచ్' ప్రెసిడెంట్ టామ్ ఫిట్టన్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్టు పెట్టారు. దానికి ట్రంప్ సోమవారం నాడు.. 'ట్రూ (నిజం)' అంటూ స్పందించారు. అక్రమ వలసలను నిరోధించేందుకు మెక్సికో సరిహద్దుల్లో గోడ కట్టాలని భావించిన ట్రంప్.. అందుకు నిధులివ్వడానికి అమెరికా కాంగ్రెస్ ఒప్పుకోకపోవడంతో, ఆ నిధుల కోసం 2019లో ఎమర్జెన్సీ విధించారు.

మహారాష్ట్ర మాజీ హోంమంత్రి కారుపై రాళ్ల దాడి

తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు

నాగ్‌పూర్, నవంబరు 18 : మహారాష్ట్ర మాజీ హోం మంత్రి, ఎన్సీపీ(ఎస్పీ) లీడర్ అనిల్ దేశ్‌ముఖ్ కారుపై నాగ్‌పూర్ జిల్లాలో సోమవారం రాత్రి రాళ్ల దాడి జరిగింది. ఈ దాడిలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. నార్ఖేడ్ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని తిరిగి వస్తుండగా దుండగులు అనిల్ కారుపై రాళ్లతో దాడి చేశారు. దీంతో ఆయన తలకు గాయమవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. అనిల్ కుమారుడు సలీల్.. కటోల్ నుంచి పోటీలో ఉన్నారు. ఆ ప్రచారం కోసమే అనిల్ నాగ్‌పూర్ జిల్లాకు వెళ్లారు.

నాపై ఎవరి ఒత్తిడి లేదు

స్వచ్ఛందంగానే బీజేపీలో చేరా: కైలాస్

న్యూఢిల్లీ, నవంబరు 18: ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేసిన కైలాష్ గెహ్లోత్ సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రులు ఖట్టర్, హర్ష్ మల్హోత్రా ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై ఎవరి ఒత్తిడి లేదని, స్వచ్ఛందంగానే ఆమ్ ఆద్మీ పార్టీని వీడి బీజేపీలో చేరానని చెప్పారు. "అన్నా హజారే సమయం నుంచి ఆప్‌లో ఉన్నాను. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఢిల్లీకి నావంతు సేవలు అందించాను. ఇది రాత్రికి రాత్రి తీసుకున్న నిర్ణయమని కొందరు భావిస్తున్నారు. ఒత్తిడి వల్లే ఈ అడుగు వేశానని అంటున్నారు. ఒత్తిడి వల్ల నేనెప్పుడూ ఏ నిర్ణయం తీసుకోలేదని వారికి స్పష్టం చేస్తున్నాను". అని వెల్లడించారు. కైలాష్ గెహ్లోత్ రాజీనామా బీజేపీ కుట్ర ఫలితమేనని ఆప్ పేర్కొంది.

వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం అక్కర్లేదు

ఇప్పటికే ఉన్న చట్టాలు సరిపోతాయి

నేషనల్ టాస్క్‌ఫోర్స్ సిఫారసులు

న్యూఢిల్లీ, నవంబరు 18: వైద్యులపై జరిగే దాడుల కట్టడికి ప్రత్యేకంగా కేంద్ర చట్టం అవసరం లేదని నేషనల్ టాస్క్‌ఫోర్స్ అభిప్రాయపడింది. రోజువారీ చిన్నచిన్న ఘటనలపై పనిచేయడానికి రాష్ట్రాల స్థాయిలోని చట్టాలు సరిపోతాయని పేర్కొంది. తీవ్రమైన దాడులు జరిగితే శిక్షించడానికి భారతీయ న్యాయ సంహిత -2023 (బీఎన్ఎస్)లో కఠినమైన నిబంధనలు ఉన్నాయని తెలిపింది. ఈ మేరకు తన ప్రతిపాదనలతో ఒక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. కేంద్రం ఆ నివేదికను అఫిడవిట్ రూపంలో సుప్రీంకోర్టుకు అందించింది. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ బోధనాస్పత్రిలో మెడికోపై హత్యాచారం నేపథ్యంలో ఈ ఏడాది ఆగస్టు 20వ తేదీన నేషనల్ టాస్క్‌ఫోర్స్‌ను సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. వైద్య నిపుణుల భద్రతకు భరోసానిచ్చే ప్రొటోకాల్ నిబంధనలను తయారుచేసేందుకు అవసరమైన ప్రతిపాదనలతో ముందుకు రావాలని ఆదేశించింది. వైద్యులపై జరిగే హింసకు వ్యతిరేకంగా 24 రాష్ట్రాల్లో ఇప్పటికే చట్టాలు అమలవుతున్నాయనీ, మరో రెండు రాష్ట్రాలు బిల్లులు తెచ్చి వాటికి చట్టరూపం ఇచ్చే ప్రయత్నంలో ఉన్నాయని తన నివేదికలో టాస్క్‌ఫోర్స్ తెలిపింది. నిర్దిష్టంగా చట్టాలు రూపొందని రాష్ట్రాల్లో బీఎన్ఎస్-2023లోని నిబంధనలు సత్వరం అమలుచేయాలని సూచించింది. "వైద్య సంస్థలకు గట్టి భద్రత కల్పించాలి. దీనికోసం భద్రతా కమిటీ ఏర్పాటుచేయాలి. వైద్య సంస్థలు నిర్వర్తిస్తున్న విధుల స్వభావాన్ని బట్టి సీసీ కెమెరాలను నెలకొల్పాలి" అని ప్రతిపాదించింది. రెసిడెంట్ వైద్యుల పని గంటల విషయంలో ఎన్ఎంసీ మార్గదర్శకాలను వైద్య సంస్థలు పాటించి తీరాలని స్పష్టం చేసింది.

కర్ఫ్యూ ఉల్లంఘించి అల్లర్లు

మణిపూర్‌లో మరింత క్షీణించిన పరిస్థితి

ప్రభుత్వ ఆఫీసులకు నిరసనకారుల తాళాలు

మణిపూర్‌కు అదనంగా 5 వేల బలగాలు



నిరసనల్లో కాలిపోయిన మణిపూర్ మంత్రి గోవిందాస్ ఇల్లు

ఇంఫాల్, న్యూఢిల్లీ, నవంబరు 18: మణిపూర్‌లో శాంతిభద్రతల పరిస్థితి మరింత క్షీణించింది. నిరసనకారులు సోమవారం కర్ఫ్యూను ఉల్లంఘించి యథేచ్ఛగా అల్లర్లకు పాల్పడ్డారు. జిరిబమ్ జిల్లాలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పిల్లల హత్యకు నిరసనగా కొకొమి(కోఆర్డినేషన్ కమిటీ ఆన్ మణిపూర్ ఇంటిగ్రిటీ) గ్రూపునకు చెందిన కొందరి నేతృత్వంలో జనం ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేశారు. జిరిబమ్ జిల్లాలో హత్యకు గురైన బాధితులకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ నిరసనకారులు ఇంఫాల్‌లోని చీఫ్ ఎలక్టొరల్ ఆఫీసర్ కార్యాలయంలోకి చొచ్చుకుపోయి ప్రధాన గేటుకు తాళం వేశారు. సమీపంలోని పలు కార్యాలయాలకు ఇదేవిధంగా తాళాలు వేశారు. అలాగే కుకి మిలిటెంట్లపై సైనిక చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇంఫాల్‌లో కొకొమి చేపట్టిన ధర్నా మూడోరోజుకు చేరుకుంది. మరోవైపు మణిపూర్ ప్రభుత్వం సోమవారం నుంచి బుధవారం వరకు ఏడు జిల్లాల్లో ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వరుసగా రెండోరోజు మణిపూర్‌పై కేంద్ర, ఆ రాష్ట్ర ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. మరో 5 వేలమంది పారామిలిటరీ సిబ్బందిని ఆ రాష్ట్రానికి పంపాలని నిర్ణయించారు. ఉన్నతాధికారులు ఆ రాష్ట్రంపై దృష్టి పెట్టి వెంటనే అక్కడ శాంతి భద్రతలను పునరుద్ధరించాలని ఆదేశించారు. ఇప్పటికే సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ ఏడీ సింగ్, ఇతర కేంద్ర సాయుధ పోలీసు బలగాల ఉన్నతాధికారులు ఆ రాష్ట్రంలో మకాం వేసి ఉన్నారు. గత వారం పంపిన కేంద్ర సిబ్బందితో కలిపి మొత్తం 218 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఆ రాష్ట్రంలో ఉన్నాయి. కాగా జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) మణిపూర్‌లో తాజాగా చోటు చేసుకున్న హింసకు సంబంధించి మూడు కేసులను నమోదు చేసింది. జిరిబమ్ జిల్లాలో మహిళల హత్య.. సీఆర్‌పీఎఫ్ పోస్టుపై సాయుధ మూక దాడి.. బొరొబెక్రలో ఇళ్ల దహనం, ఒకరి హత్యకు సంబంధించిన కేసుల దర్యాప్తును ఎన్ఐఏ చేపట్టింది. మరోవైపు పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభం కాక ముందే ప్రధాని మోదీ కల్లోలిత మణిపూర్ రాష్ట్రంలో పర్యటించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మణిపూర్‌లో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ పూర్తిగా విఫలమైందని, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ రాజీనామా చేయాలని కోరింది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మణిపూర్ కాంగ్రెస్ చీఫ్ కె. మేఘచంద్ర సింగ్, ఆ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌చార్జ్ గిరీష్ చోడంకర్‌లతో కలిసి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నవంబరు 25న పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కాకముందే ఆ రాష్ట్రంపై జాతీయ స్థాయిలో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 31 నుంచి మణిపూర్‌కు పూర్తిస్థాయి గవర్నర్ కూడా లేరని పేర్కొన్నారు. పాలనలో విఫలమైన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని హోం మంత్రి ఎందుకు రక్షిస్తున్నారని ప్రశ్నించారు.

కుంగదీస్తున్న మధుమేహం

(మొదటి పేజీ తరువాయి)



భయం వంటివి.. షుగర్ పేషెంట్లు రకరకాల మానసిక సమస్యలకు గురయ్యేలా చేస్తున్నాయి" అని తమ అధ్యయన నివేదికలో పేర్కొన్నారు. ఈ సమస్యలన్నింటినీ కలిపి 'డయాబెటిస్ డిస్ట్రెస్'గా వ్యవహరిస్తారు. టైప్-1 లేదా టైప్-2.. ఏ రకం డయాబెటిస్ అయినా, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా దాన్ని నియంత్రణలో ఉంచుకోవాల్సిందే. వైద్యుల సిఫారసు మేరకు క్రమం తప్పకుండా మందులు వాడడం, ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకోవడం, నిత్యం వ్యాయామం చేయడం, ఒకే చోట కూర్చోకుండా శారీరకంగా చురుగ్గా ఉండడం, ఆహారపుటలవాట్లను నియంత్రించుకోవడం వంటివి తప్పనిసరి. కానీ, మానసిక ఆరోగ్యం అంతగా బాగుండనివారికి ఇవన్నీ పెను సవాళ్లుగా కనిపిస్తున్నాయని పరిశోధకులు వివరించారు. కాబట్టి, మధుమేహంతో బాధపడేవారు 'డయాబెటిస్ డిస్ట్రెస్' లక్షణాలకు సంబంధించిన పరీక్షలు చేయించుకుని, వాటిని ముందే గుర్తించి వైద్యుల సహాయం తీసుకోవాలని సూచించారు. చక్కెరవ్యాధి వల్ల కలుగుతున్న మానసిక సమస్యల ముప్పును గుర్తించిన అంతర్జాతీయ మధుమేహ సమాఖ్య (ఐడీఎఫ్).. ఇన్సులిన్‌ను కనిపెట్టి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా 2021లో దీనిపై మూడేళ్ల ప్రచారోద్యమాన్ని ప్రారంభించింది. అది ఈ ఏడాదితో పూర్తైంది. ఐడీఎఫ్ తాజా సర్వేలో అయితే.. మధుమేహ బాధితుల్లో 77% మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నట్టు వెల్లడైంది. దీంతో 2024-26 దాకా కూడా 'డయాబెటిస్ అండ్ వెల్‌బీయింగ్' థీమ్‌తో ప్రపంచ మధుమేహ దినాన్ని నిర్వహించాలని ఐడీఎఫ్ నిర్ణయించింది.

అరెస్టు నుంచి రక్షణ కల్పించలేం

వర్మకు ఏపీ హైకోర్టు ఝలక్.. అరెస్టు భయం ఉంటే బెయిల్ పిటిషన్ వేసుకోవాలని సూచన

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు కేసు



అమరావతి(ఆంధ్రజ్యోతి)/ఒంగోలు క్రైం, నవంబరు 18: సామాజిక మాధ్యమాలలో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు ఏపీ హైకోర్టు ఝలక్ ఇచ్చింది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. పోలీసులు అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉంటే బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించింది. క్వాష్ పిటిషన్‌లో అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేమని తేల్చిచెప్పింది. పోలీసుల ముందు హాజరయ్యేందుకు మరికొంత సమయం ఇవ్వాలన్న రామ్‌గోపాల్ వర్మ తరఫు న్యాయవాది అభ్యర్థననూ తోసిపుచ్చింది. ఈ తరహా అభ్యర్థనను సంబంధిత స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) వద్ద చేసుకోవాలని, కోర్టు ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదని పేర్కొంది. వ్యాజ్యంలో ప్రతివాదిగా ఉన్న ముత్తనపల్లి రామలింగయ్యకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీఎంఎన్ చక్రవర్తి ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఏపీలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు, జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రతిష్ఠను దిగజార్చేలా సామాజిక మాధ్యమాలలో వర్మ అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టారని ప్రకాశం జిల్లా మద్దిపాడు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ముత్తనపల్లి రామలింగయ్య ఫిర్యాదు చేశారు. మద్దిపాడు పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు వచ్చింది. రామ్‌గోపాల్ వర్మ తరఫున టి.రాజగోపాలన్ వాదనలు వినిపించారు. గత ఏడాది డిసెంబరులో పిటిషనర్ పోస్టు పెట్టారన్నారు. ఆ పోస్టుకు ఫిర్యాదుదారుడు బాధితుడు కాదన్నారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. మంగళవారం సంబంధిత ఎస్‌హెచ్‌వో ముందు హాజరు కావాల్సి ఉందని, హాజరయ్యేందుకు మరికొంత సమయం ఇవ్వాలని కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ... క్వాష్ పిటిషన్‌లో అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొన్నారు. పోలీసుల ముందు హాజరు కావడానికి మరికొంత సమయం కావాలంటే సంబంధిత ఎస్‌హెచ్‌వోను అభ్యర్థించాలని సూచించారు. కాగా, రామ్‌గోపాల్‌వర్మ మంగళవారం ఒంగోలు రూరల్ సర్కిల్ స్టేషన్‌కు కేసు విచారణ నిమిత్తం హాజరుకానున్నారు. వర్మ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో ఆయన విచారణకు హాజరు కావడం అనివార్యమైంది.

పోసానిపై సీఐడీ కేసు

చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు

తెలుగు యువత నేత వంశీ ఫిర్యాదుతో పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు

ఏపీ వ్యాప్తంగా 8 చోట్ల కేసులు



అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సినీనటుడు, రచయిత పోసాని కృష్ణమురళిపై సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. "వర్గ విభేదాలు సృష్టించేలా చంద్రబాబు మాట్లాడారు. ప్రధాని మోదీ, అమిత్ షాల కాళ్లు పట్టుకున్నారు" అంటూ పోసాని విలేకరుల సమావేశంలో ఆరోపించారని, ఆయన్ను హిందూత్వ వ్యతిరేకిలా చిత్రీకరించారని తెలుగు యువత అధికార ప్రతినిధి బండారు వంశీకృష్ణ ఫిర్యాదు చేయడంతో.. సీఐడీ పోసానిపై బీఎన్ఎస్ 111, 196, 353, 299, 336(3)(4), 341, 61(2) సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వాడారని సెప్టెంబరులో సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలో పోసాని సెప్టెంబరు 28న విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి చంద్రబాబుపై పలు విమర్శలు చేశారు. తిరుమల కొండపైకి వెళ్లే జగన్‌ను డిక్లరేషన్ అడిగే అర్హత చంద్రబాబుకు లేదని, క్రైస్తవులు ఇళ్లకు హిందువులు వెళ్తే డిక్లరేషన్ అడగరని.. చంద్రబాబు గతంలో మసీదులోకి వెళ్లి.. బీజేపీని మతతత్వ పార్టీ అని అన్నారని.. ఆ తర్వాత రాజకీయ అవసరాల కోసం ఢిల్లీ వెళ్లి నరేంద్ర మోదీ, అమిత్ షా కాళ్లు పట్టుకున్నారని.. ఆ ఫొటోలు ఉన్నాయంటూ వ్యాఖ్యానించారు. అలాగే.. అయ్యప్ప మాల వేసుకున్న భక్తులు నిష్ఠతో మద్యానికి దూరంగా ఉంటారు గనుక ఆదాయం తగ్గుతుందని ఒక సందర్భంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యల వీడియో చూపించి.. ఇవి హిందువులను కించపరిచేలా ఉన్నాయని చెప్పారు. వీటిపై బండారు వంశీకృష్ణ అదే రోజు సాయంత్రం మంగళగిరిలో సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ అధినేత చంద్రబాబుపై పోసాని వ్యాఖ్యలు తమ మనోభావాలను గాయపరచడంతో పాటు రాష్ట్రంలో వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా ఉన్నాయని తెలిపారు. ఆయా సందర్భాలకు సంబంధించిన వాస్తవ వీడియోలను పెన్‌డ్రైవ్‌లో అందించారు. వాటిని పరిశీలించిన సీఐడీ పోలీసులు పలు సెక్షన్ల కింద పోసానిపై కేసు నమోదు చేశారు. ఇంకోవైపు.. రాష్ట్రవ్యాప్తంగా పోసాని కృష్ణమురళిపై పలువురు ఫిర్యాదులు చేస్తున్నారు. కడప, చిత్తూరు, తిరుపతి, అనంతపురం, బాపట్ల, పల్నాడు, కృష్ణ, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లో ఎనిమిది చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

వేములవాడ అభివృద్ధికి రూ.127.65 కోట్లు

సిరిసిల్ల, హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ఆలయ అభివృద్ధికి సోమవారం రూ.127.65 కోట్లు మంజూరు చేస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తులకు అవసరమైన అధునాతన సదుపాయాల కల్పనకు రూ.76 కోట్లు కేటాయించారు. వేములవాడ ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్లను వెడల్పు చేసేందుకు రూ.47.85 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో రోడ్ల విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను చేపట్టనున్నారు. మూలవాగులో ఉన్న బతుకమ్మ తెప్ప నుంచి జగిత్యాల కమాన్ జంక్షన్ వరకు పైప్‌లైన్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.3.8 కోట్లు కేటాయించారు. ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించిన తదుపరి చర్యలను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్, వేలములవాడ ఆలయ పాలకవర్గం చేపట్టాలని దానకిషోర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వేములవాడ అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేయడం పట్ల రాజన్న భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఇందుకోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

6 గ్యారంటీల అమలులో రేవంత్ డకౌట్

- మాజీ మంత్రి హరీశ్‌రావు

హయత్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీల అమలులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డకౌట్ అయ్యారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లో నిర్వహించిన క్రికెట్ ట్రోఫీలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పది సంవత్సరాలలో కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపితే ఒకే సంవత్సరంలో కాంగ్రెస్ వెనక్కు తీసుకుపోయిందని దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీల దుకాణాన్ని బందు పెట్టి మూసీ సుందరీకరణ ముందు వేసుకున్నారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో మూసీ నది అభివృద్ధి కోసం రూ. 3,800 కోట్లతో 31 మురుగుశుద్ధి కేంద్రా(ఎస్‌టీపీ)లు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. పేదల ఇళ్లు కూల్చి ముఖ్యమంత్రి హిట్ వికెట్ అయ్యాడని ఎద్దేవా చేశారు.

ఏం చేశారని విజయోత్సవ సభ:ఎర్రబెల్లి

వరంగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అబద్ధాలు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజలకు ఏం చేసిందని 'ప్రజా పాలన విజయోత్సవ' సభ నిర్వహిస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ ఆడపడుచులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సభ నిర్వహిస్తున్నారంటే నవ్వొస్తుందని ఎద్దేవాచేశారు. ఆడబిడ్డలకు ఇస్తామని చెప్పిన తులం బంగారం, రూ. 2,500 సాయం, కల్యాణలక్ష్మి, విద్యార్థినులకు స్కూటీలు ఎక్కడకు పోయాయని నిలదీశారు. 22 జిల్లాల్లో మహిళల డబ్బులతో మహిళా సమాఖ్య భవనాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు. మహిళలకు ఏం చేయకుండా మహిళ శక్తి విజయోత్సవ సభ పెట్టడానికి సిగ్గుగా లేదా అని దయాకర్‌రావు విమర్శించారు.

మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఇందిరాగాంధీ ఎక్సలెన్సీ అవార్డు ప్రదానం

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు తెలంగాణ మేధావుల ఫోరం సోమవారం ఇందిరాగాంధీ ఎక్సలెన్సీ అవార్డును ప్రదానం చేసింది. మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసిన ఫోరం ప్రతినిధులు ఈ అవార్డును అందజేసి శాలువాతో సత్కరించారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని కాన్ఫరెన్సు హాల్లో జరిగే వ్యవసాయ ప్రతిభా పురస్కారాల ప్రదానం కార్యక్రమంలో మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొననున్నారు.

వేములవాడ సభలో గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

- సీఎం చేతుల మీదుగా 17 కుటుంబాలకు అందజేత

ఈ నెల 20న వేములవాడలో జరగనున్న సభలో సీఎం రేవంత్‌రెడ్డి గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా మంజూరీ పత్రాలను అందజేయనున్నారు. మొత్తం 17 కుటుంబాలను ఎంపిక చేసిన ప్రభుత్వం.. సీఎం చేతుల మీదుగా వారికి మంజూరి పత్రాలను అందజేయనుంది. ఈ మేరకు టీపీసీసీ ఎన్నారై సెల్ సోమవారం తెలిపింది.

నేటి నుంచి డిగ్రీ కాలేజీలు బంద్!

ఫీజు రీ-యింబర్స్‌మెంట్ పెండింగ్ బిల్లులకు నిరసనగా ఈనెల 19వ తేదీ నుంచి రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల బంద్‌ను నిర్వహిస్తున్నట్టు ప్రైవేట్ కాలేజీల అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి ప్రకటించారు.పెండింగ్ బిల్లుల కారణంగా కాలేజీలను నిర్వహించలేకపోతున్నట్టు వివరించారు. ఈ బిల్లులను చెల్లిస్తామని రెండు నెలల క్రితం ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటి వరకు దానిని నెరవేర్చలేదని ఆయన చెప్పారు. అందుకే మంగళవారం నుంచి బంద్‌ను పాటిస్తున్నట్టు తెలిపారు.

కస్టమ్ మిల్లింగ్ రైస్ సేకరణ గడువు పొడిగింపు

కస్టమ్ మిల్లింగ్ రైస్ సేకరణ గడువును రెండు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. 2019-20 రబీ, 2020-21 రబీ, 2021-22 ఖరీఫ్, రబీ, 2022-23 ఖరీఫ్ సీజన్లలో ఉన్న బియ్యం బకాయిలను తీర్చేందుకు 60 రోజులు గడువు ఇచ్చారు. ఇప్పటికే పలుమార్లు గడువు ఇవ్వటం, పొడిగించటం చేశారు. దీర్ఘకాలంగా బకాయిలున్న మిల్లర్లకు 25 శాతం జరిమానా కూడా విధించారు. ఇంకా డిఫాల్టర్ల వద్ద రూ. 3,200 కోట్ల విలువైన బియ్యం బకాయిలు ఉన్నాయి. రైస్‌మిల్లుల్లో తనిఖీలు కూడా నిర్వహిస్తున్నారు. ఎలాగైనా రికవరీ చేయాలనే లక్ష్యంతో ఉండగా.. గడువు 2025 జనవరి 31వ తేదీ వరకు పెంచారు.

ఐఎస్‌బీ నూతన లోగో విడుదల

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మేనేజ్‌మెంట్ విద్యలో ప్రముఖ అంతర్జాతీయ విద్యాసంస్థగా వెలుగొందుతున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) తన లోగోను మార్చింది. నవతరంలో మరింత స్ఫూర్తి నింపాలన్న లక్ష్యానికి అనుగుణంగా లోగోలో మార్పులు చేశామని సోమవారం నూతన లోగో విడుదల కార్యక్రమం సందర్భంగా డీన్ మదన్ పిల్లుట్ల తెలిపారు.

హరీశ్ నా ఫోన్ ట్యాప్ చేయించాడు

- వ్యతిరేకంగా పనిచేస్తున్నాననే కక్షతో జైలుకు పంపారు
- పోలీసులకు ఆధారాలు సమర్పించిన కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్

బంజారాహిల్స్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీష్‌రావు తన ఫోన్‌తో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితుల ఫోన్‌లను ట్యాప్ చేయించాడని సిద్దిపేట కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్ ఆరోపించారు. తన ఫోన్ ట్యాప్ అయిందంటూ జూన్ 19న చక్రధర్‌గౌడ్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు పట్టించుకోకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు చక్రధర్‌గౌడ్‌ను గతంలో విచారించిన పోలీసులు సరైన ఆధారాలు తీసుకు రావాలని సూచించారు. ఈ మేరకు చక్రధర్‌గౌడ్ సోమవారం జూబ్లీహిల్స్ ఏసీపీని కలిసి ట్యాప్ అయినట్టు అనుమానిస్తున్న సెల్‌ఫోన్‌తో పాటు యాపిల్ కంపెనీ నుంచి ఫోన్ ట్యాప్ అయిందని వచ్చిన మెయిల్ కాగితాలు, ఇతర వివరాలను విచారణ అధికారులకు అందచేశారు. హరీశ్‌రావుకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాననే కక్షతో తనపై అనేక కేసులు పెట్టి జైలుకు పంపించారని చక్రధర్‌గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రంగనాయకసాగర్ కుంభకోణాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది తానేనని ఆయన వెల్లడించారు.

ట్యాపింగ్ కేసులో భుజంగరావు బెయిల్ పొడిగింపు

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్ కేసులో మూడో నిందితుడిగా ఉన్న ఎన్. భుజంగరావు మధ్యంతర బెయిల్‌ను ఈనెల 28 వరకు పొడిగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. నిందితుడికి తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నట్లు డాక్టర్లు తెలపడంతో ఈ నిర్ణయం తీసుకొంది. ఇదే కేసులో నాలుగో నిందితుడిగా ఉన్న మేకల తిరుపతన్న బెయిల్ పిటిషన్ ఈ నెల 27న సుప్రీంకోర్టులో విచారణకు రానున్న నేపథ్యంలో కూడా మధ్యంతర బెయిల్ పొడిగిస్తున్నట్లు తెలిపింది. తదుపరి విచారణను జస్టిస్ కే సుజన ధర్మాసనం ఈనెల 28కి వాయిదా వేసింది.

మహారాష్ట్రలో ఓటమి

మోదీకి ముందే తెలిసింది!

అందుకే ప్రచారం వీడి విదేశాలకు వెళ్లారు.. హామీల అమల్లో విఫలమైన ప్రధాని

- కాంగ్రెస్ హామీలపై ఆరోపణలా?
- మావి కచ్చితమైన గ్యారెంటీలు..
- మహారాష్ట్రను విద్రోహులకు అడ్డాగా మార్చిన మోదీ
- ఎన్నికల ప్రచారంలో రేవంత్



హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ కూటమి ఓడిపోతుందనే విషయం ప్రధాని మోదీకి ముందే తెలిసిపోయిందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అందుకే మోదీ మూడు రోజులుగా ప్రచారం చేయకుండా విదేశాలకు వెళ్లి పోయారన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పుణెలో జరిగిన మీడియా సమావేశంలో, కడెగావ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైన ప్రధాని మోదీ.. తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాల హామీల అమలుపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ గ్యారెంటీలంటే కచ్చితమైన గ్యారెంటీలు అని, అవి.. మోదీ గ్యారెంటీల్లా కాదని అన్నారు. కేంద్ర మంత్రితోగానీ, కేంద్ర ఉన్నతాధికారి ఆధ్వర్యంలోగానీ ఒక కమిటీని వేసి తెలంగాణకు పంపిస్తే రాష్ట్రంలో హామీల అమలుపై ఆ కమిటీకి వివరాలు ఇస్తానని చెప్పారు. మోదీ 11 ఏళ్ల పాలనలో చెప్పుకోవడానికి ఒక్క విజయగాథ కూడా లేకపోవడంతో ప్రతి ఎన్నికల ముందు బాంబుపేలుళ్లు, ఇతర విషయాలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. 2014 ఎన్నికలకు ముందు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, దేశంలోని ప్రతి పేదవాడికీ ఇల్లు నిర్మిస్తామంటూ నరేంద్రమోదీ హామీ ఇచ్చారని రేవంత్ గుర్తు చేశారు. కానీ, చివరికి మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తెచ్చారన్నారు. దేశంలోనే అత్యధికంగా రైతు ఆత్మహత్యలు మహారాష్ట్రలో చోటు చేసుకుంటున్నాయని, ప్రధాని మోదీ ఈ విషయంపై ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు.

2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి?

ఏటా 2కోట్ల ఉద్యోగాలని చెప్పిన ప్రధాని మోదీ.. 11 ఏళ్ల పాలనలో అందులో ఒక్క శాతం కూడా ఇవ్వలేదని రేవంత్ అన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు ఏటా 2 కోట్ల ఉద్యోగాలపై లోక్‌సభలో ప్రశ్న అడిగితే కేవలం కేవలం 7.50 లక్షల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చినట్లుగా మోదీ ప్రభుత్వం సమాధానం ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు వేసి వారి రుణాలను మాఫీ చేశామని తెలిపారు. 50 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. యూపీఏ హయాంలో సోనియాగాంధీ సూచన మేరకు దీపం పథకం కింద రూ.400కే గ్యాస్ సిలిండర్, స్టవ్‌లను అప్పటి ప్రభుత్వం అందజేసిందన్నారు. మోదీ ప్రధాని అయ్యాక రూ.400 సిలిండర్‌ను రూ.12000కు పెంచేశారని, తద్వారా పేద మహిళలు వంటింట్లో దాచుకున్న డబ్బును మోదీ చోరీ చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో తాము పేద మహిళలకు రూ.500కే సిలిండర్ ఇస్తున్నామని తెలిపారు. ప్రధాని మోదీ, బీజేపీ నేతలు హైదరాబాద్‌కు వస్తే సచివాలయంలో కూర్చోబెట్టుకుని తాను చెప్పిన ప్రతి అంశానికీ వివరాలను అందజేస్తానని, ఇందులో ఏమైనా తప్పులు ఉంటే క్షమాపణలు చెబుతానని ప్రకటించారు. మహారాష్ట్ర ప్రజలు మహా వికాస్ అఘాడీని గెలిపిస్తే తెలంగాణలో అమలవుతున్నట్లుగానే ఇచ్చిన హామీలన్నీ అమలవుతాయని చెప్పారు.

ఇందిరాగాంధీకి సీఎం రేవంత్ నివాళి

భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ.. పేదలు, మహిళల అభ్యున్నతికి విశేష కృషి చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. "భారతీయ శక్తికి మహిళలే ప్రతీకలు' అన్న ఇందిరాగాంధీ మాటల స్ఫూర్తితో తెలంగాణ ప్రజాప్రభుత్వం మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. సోమవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రేవంత్‌రెడ్డి ఆమెకు నివాళి అర్పించారు. ఆమె జయంతిని పురస్కరించుకుని నిర్వహించే 'జాతీయ సమైక్యతా దినోత్సవం' సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇందిర జయంతి రోజునే రాష్ట్రంలో 22 జిల్లాల్లో నూతనంగా నిర్మించే మహిళా శక్తి భవనాలకు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం గర్వకారణమని సీఎం రేవంత్ పేర్కొన్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

కోవర్టు ఆపరేషన్లకు అడ్డాగా మార్చారు..

రాజకీయంగా మహారాష్ట్ర.. దేశంలో రెండో పెద్ద రాష్ట్రమని రేవంత్ అన్నారు. అలాంటి రాష్ట్రాన్ని ప్రధాని మోదీ.. కోవర్టు ఆపరేషన్లకు, విద్రోహులకు అడ్డాగా మార్చారని ఆరోపించారు. ముంబయిలోని ధారావిని కబ్జా చేసేందుకు మోదీకి గులాములు, ద్రోహులైన శిందే, అజిత్ పవార్, అశోక్ చవాన్‌లను వినియోగించుకుంటున్నారని ధ్వజమెత్తారు. మహారాష్ట్ర నేల.. వీరుల నేల అని, ఈ విద్రోహులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌లో విభేదాలనేవి బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ చేసే తప్పుడు ప్రచారమని రేవంత్ అన్నారు. కాగా, గత మూడు రోజులుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున మహారాష్ట్రలో విస్తృతంగా ప్రచారం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. సోమవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు.



బీజేపీ వర్క్‌ షాపులో మాట్లాడుతున్న జి.కిషన్‌రెడ్డి

నేను భారతీయులకు గులామ్‌ని!

- మీరు ఇటలీ నేతలకు గులామ్‌లు
- సీఎం రేవంత్‌పై ధ్వజమెత్తిన కిషన్‌రెడ్డి

హయత్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాను ఎవరికీ గులామ్‌ను కాదని, భారతీయులకు మాత్రమే గులామ్‌నని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై సోమవారం రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో బీజేపీ నిర్వహించిన వర్క్‌షాపులో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతిపిత మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, ప్రధాని నరేంద్రమోదీకి జన్మనిచ్చిన గుజరాత్‌కు గులామ్‌నని చెప్పారు. కాంగ్రెస్ నేతలు నకిలీ గాంధీ కుటుంబానికి, ఇటలీ నేతలకు గులామ్‌లని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలను ఎత్తి చూపితే వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయకుండా మహారాష్ట్రలో ప్రచారం చేయడానికి సీఎంకు సిగ్గుండాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు, కోతలతో సంవత్సరం గడిపేసిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అప్పులు తేవడానికి ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ మాదిరిగా ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామన్నారని.. 340 రోజులు అవుతున్నా అమలు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కుటుంబ కాంట్రాక్టర్లు వచ్చారన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు దివాలా తీశాయని విమర్శించారు. రాష్ట్రంలో ఆలయాలను కూల్చుతుంటే ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తోందన్నారు. మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ పని చేస్తుందని, భవిష్యత్ బీజేపీదేనని చెప్పారు.

చెత్త వేస్తే చలానా!

ట్రాఫిక్ జరిమానా తరహాలో విధింపు

- రోడ్లపై వ్యర్థాలు వేయకుండా నిఘా
- సీసీ కెమేరాలు.. క్షేత్ర స్థాయి ఫొటోలు
- యాప్ రూపకల్పనలో జీహెచ్ఎంసీ
- డిసెంబరు 1 నుంచి అందుబాటులోకి!
- చెత్త బుట్టలు లేని దుకాణాలు సీజ్



హైదరాబాద్ సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ చలానా తరహాలో.. రోడ్ల పక్కన చెత్త వేసేవారికి జరిమానా విధించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) రంగం సిద్ధం చేస్తోంది. వాహనాల నంబర్ల ఆధారంగా సంబంధిత వ్యక్తుల ఇంటికి జరిమానా వివరాలు పంపనున్నారు. నడుచుకుంటూ వచ్చి చెత్త పారబోసేవారికీ చలానా వేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను బల్దియా ఐటీ విభాగం రూపొందిస్తోంది. డిసెంబరు 1 నుంచి దీనిని అందుబాటులోకి తేనున్నారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. రోడ్లపై వ్యర్థాలు వేసే వాణిజ్య సముదాయాలపైనా ప్రత్యేక దృష్టిసారించనున్నారు. పలుసార్లు సూచించినా పట్టించుకోకుంటే వ్యాపార అనుమతి రద్దుతో పాటు అవసరమైతే దుకాణాలను సీజ్ చేయాలని భావిస్తున్నారు. హైదరాబాద్‌లో పారిశుధ్య కార్మికులు వస్తున్నా.. కొందరు ఉద్దేశపూర్వకంగా స్వచ్ఛ ట్రాలీలకు చెత్త ఇవ్వడం లేదు. భార్యాభర్తలు ఉద్యోగులైతే, పనులకు వెళ్లే కుటుంబాల వారు, బ్యాచిలర్లదీ ఇదే తీరు. బస్తీలు, మురికివాడల్లోనూ ఇంతే. వీరంతా వ్యర్థాలను రోడ్లపై వేస్తున్నారు. దీనిని నివారించేందుకు కార్మికులను సాయంత్రం వరకు కాపలా ఉంచితే.. అర్ధరాత్రి తర్వాత పారబోస్తున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో నిఘా, జరిమానా విధించాలని జీహెచ్ఎంసీ అధికారులు నిర్ణయించారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల (జీవీపీ) వద్ద ఇప్పటికే సీసీ కెమెరాలున్నాయి. వీటి ఫుటేజీ ఆధారంగా.. చెత్త వేసేవారి వాహనాల నంబర్లు గుర్తిస్తారు. నడుస్తూ వచ్చి చెత్త వేసేవారి ఫొటోలను క్షేత్రస్థాయి సిబ్బంది తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు, జవాన్లు, మొబైల్ వినియోగంపై అవగాహన ఉన్న పారిశుధ్య కార్మికులకూ ఈ బాధ్యతలు అప్పగిస్తామని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. జరిమానా అధికారం క్షేత్రస్థాయి సిబ్బందికి అప్పగిస్తే అవకతవకలకు ఆస్కారం ఏర్పడుతుంది. కాబట్టి ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ తప్పనిసరి చేయనున్నారు. తొలిసారి ఉల్లంఘనకు రూ.200, రెండోసారి రూ.500 చలానా విధించాలని భావిస్తున్నారు. ఇది క్రమంగా పెరగనుంది. ఉల్లంఘన ఎన్నోసారి? ఎంత జరిమానా? అన్నది యాప్‌లో ఉండేలా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. నిర్మాణ రంగ వ్యర్థాలు రోడ్ల పక్కన వేసేవారినీ గుర్తించి జరిమానా వేయనున్నారు. కాగా, ప్రతి దుకాణం వద్ద చెత్త బుట్టలు (బిన్) ఏర్పాటు చేసుకోవాలని జీహెచ్ఎంసీ ఇప్పటికే వ్యాపారులకు నోటీసులిచ్చింది. అయినా, కొందరు దుకాణాలు మూశాక రోడ్లపై వ్యర్థాలు వేస్తున్నారు. వీరిపై కఠినంగా వ్యవహరించనున్నారు. రూ.1000 నుంచి రూ.10 వేల వరకు జరిమానాతో పాటు.. రెండు, మూడుసార్లు ఉల్లంఘన అనంతరం కూడా బుట్టలు ఏర్పాటు చేయకుంటే అనుమతి రద్దుతో పాటు, దుకాణాన్ని సీజ్ చేస్తామని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

ఓరుగల్లుకు నిధుల వరద

(మొదటిపేజీ తరువాయి)

ఎంచుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రైతు డిక్లరేషన్ సభ నిర్వహించిన హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలోనే మంగళవారం ప్రజాపాలన విజయోత్సవ సభను నిర్వహిస్తున్నారు. ఈ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో.. వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ వివరాలను మంగళవారం పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించనున్నారు.

నెరవేరనున్న 30 ఏళ్ల కల..

వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లో అత్యధికంగా వరంగల్ భూగర్భ డ్రైనేజీకి రూ.4,170 కోట్లు కేటాయించింది. దీంతో వరంగల్ నగర ప్రజల 30 ఏళ్ల కలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాకారం చేయనుంది. జూన్ 29న సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండలో పర్యటించి, కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో భూగర్భ డ్రైనేజీ కోసం ప్రతిపాదనలు తయారు పంపించాలని నగర కమిషనర్‌ను ఆదేశించారు. ఆ తర్వాత అధికారుల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు ఈ మొత్తాన్ని కేటాయించారు. ఈ నిధులను నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు ముంపు ప్రాంతాలకు నష్టం జరగకుండా కాలువల అభివృద్ధి, తాగునీటి సరఫరాను మెరుగు పరచడం, నీటి వనరులకు పునరుజ్జీవం కల్పించడం, జలాశయాల నిర్వహణ ప్రణాళికకు బ్లూ, గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూపకల్పనతో పాటుగా విద్యుత్తు, టెలిఫోన్, కేబుల్, ఇంటర్నెట్ తదితర సేవలకు ఆటంకం కలగకుండా భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టడం కోసం వినియోగించనున్నారు. తొలి విడతలో రూ.3,087 కోట్లు, రెండో విడతలో రూ.597కోట్లు, మూడో విడతలో రూ.486 కోట్లు విడుదల చేస్తారు. ఈ మేరకు పనులను మూడు విడతల్లో పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం జీవోలో వెల్లడించింది. దీంతోపాటు మామునూరు ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి భూసేకరణకూ నిధులు మంజూరు చేసింది. మొత్తం 949 ఎకరాల్లో విమానాశ్రయాన్ని అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 669 ఎకరాలు ఉండగా.. అదనంగా మరో 280 ఎకరాలను సేకరించనుంది. ఇందుకోసం రూ.205 కోట్లు కేటాయించింది.

మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు నిధులు..

ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పరిశ్రమలు నెలకొల్పిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.194 కోట్లు కేటాయించింది. టెక్స్‌టైల్ పార్క్‌కు భూములు ఇచ్చిన 863 మంది రైతులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నారు. ఇందుకోసం రూ.43.15 కోట్లు కేటాయించారు. దీంతోపాటు మెగా టెక్స్‌టైల్ టౌన్‌షిప్‌లో నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు సోమవారం జీవో జారీ చేశారు. ఇక హనుమకొండలో ఏర్పాటుచేసిన కాళోజీ కళాక్షేత్రానికి అదనంగా మరో రూ.85 కోట్లు మంజూరు చేశారు. అలాగే పరకాల నుంచి ఎర్రగట్టు గుట్ట వరకు రోడ్డు విస్తరణ చేపట్టేందుకు రూ.65 కోట్లు, కరీంనగర్-హన్మకొండ ప్రధాన రహదారిపై నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.8.3 కోట్లు మంజూరు చేశారు. ఇవే కాకుండా.. వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ భవనానికి రూ.32.50 కోట్లు, ఇన్నర్ రింగు రోడ్డుకు రూ.80 కోట్లు, పాలిటెక్నిక్ కాలేజీ కొత్త భవన నిర్మాణానికి రూ.28 కోట్లు, గ్రేటర్ వరంగల్ మునిసిపాలిటీ పరిధిలో రోడ్ల నిర్మాణాలకు 49.50 కోట్లు వరంగల్ ఉర్దూ భవన్, షాదీ ఖానాలకు 1.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధి: శ్రీధర్‌బాబు

హనుమకొండ సిటీ/వడ్డెపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. ఎన్నికల సమయంలో వరంగల్ అభివృద్ధికి ఇచ్చిన హామీలను ఏడాదిలోనే నెరవేరుస్తున్నామని తెలిపారు. హనుమకొండలో మంగళవారం నిర్వహించనున్న విజయోత్సవ సభ ఏర్పాట్లను మంత్రి కొండా సురేఖ, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు పరిశీలించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని, పదేళ్ల బీఆర్ఎస్ పాలన నిర్లక్ష్యం, స్వార్థపూరిత పాలనే ఇందుకు కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సమస్యల పరిష్కారం సవాలుగా మారిందని, అయినా భయపడకుండా ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటనూ నిలబెట్టుకుంటున్నామని తెలిపారు.

సీఎం పర్యటన సాగుతుందిలా..

వరంగల్ పర్యటనలోభాగంగా సీఎం రేవంత్ మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు హయగ్రీవచారి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకోనున్నారు. 3గంటలకు ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరిట రూ.92 కోట్ల వ్యయంతో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తారు. కవులు, కళాకారులతో ముచ్చటిస్తారు. మధ్యాహ్నం 3.10 గంటలకు అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి మ.3.20కి ఆర్ట్స్ కాలేజీకి చేరుకుంటారు. మధ్యాహ్నం 3.50 గంటల వరకు ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి స్టాళ్లను పరిశీలించి, ఎస్‌హెచ్‌జీ, ఎంఎస్, జడ్ఎస్ మహిళా గ్రూపు సభ్యులతో మాట్లాడనున్నారు. మధ్యాహ్నం 3.55 గంటలకు విజయోత్సవ సభ వేదికపైకి చేరుకుంటారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నిర్మించనున్న 22 మహిళా శక్తి భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్రంలో పది జిల్లాలో ఇప్పటికే ఈ భవనాలు ఉండగా, మిగిలిన జిల్లాల్లో కొత్తగా నిర్మించనున్నారు. ఎంజీఎంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌నూ ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభిస్తారు. మహిళలకు బ్యాంకు లింకేజీ చెక్కులను పంపిణీ చేస్తారు., అనంతరం విజయోత్సవ సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 5గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.

బీఆర్ఎస్ పనైపోయింది

ఆ పార్టీలో తండ్రి, కొడుకు, బిడ్డే మిగులుతారు.. హరీశ్, మిగతా వాళ్లు వేరే దారి చూసుకుంటారు

- బీఆర్ఎస్ పదేళ్ల, ప్రస్తుత పాలనపై చర్చకు సిద్ధమేనా?
- గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలకే కేసీఆర్ టైమ్ ఇవ్వలేదు
- కాంగ్రెస్‌లో పూర్తి స్వేచ్ఛ.. కార్యకర్తలూ సీఎంను కలవొచ్చు
- కష్టపడ్డ కార్యకర్తలను స్థానిక ఎన్నికల్లో గెలిపించుకుంటాం
- ఈ ఐదేళ్లే కాదు.. వచ్చే ఐదేళ్లూ కాంగ్రెస్ పార్టీదే అధికారం
- రాహుల్ ప్రధాని కావడం ఖాయం: టీపీసీసీ చీఫ్ మహేశ్
- సంగారెడ్డిలో భారీ ర్యాలీతో స్వాగతం పలికిన జగ్గారెడ్డి

సంగారెడ్డి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణలో బీఆర్ఎస్ పనైపోయిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆ పార్టీలో కేసీఆర్, ఆయన కొడుకు, బిడ్డ మాత్రమే మిగులుతారని ఎద్దేవా చేశారు. హరీశ్‌రావుతోపాటు మిగతా వారందరూ పలాయనం చిత్తగించి వేరే దారి చూసుకోవడం ఖాయమని జోస్యం చెప్పారు. సంగారెడ్డిలో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ జిల్లా కార్యకర్తల సమావేశానికి మహేశ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ గతంలో బీజేపీతో కుమ్మక్కై సర్కార్‌ను కూలుస్తామంటూ బీఆర్ఎస్ ప్రగల్భాలు పలికిందని, ఇప్పుడు ఆ పార్టీ ఎమ్మెల్యేలే కాంగ్రెస్‌లో చేరారని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే ట్యాగ్‌లైన్‌తో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ నేతలు.. వాటిని విస్మరించారని ఆరోపించారు. నీళ్ల ప్రాజెక్టుల పేరిట కుంభకోణాలు చేశారని విమర్శించారు. నిధులన్నీ పక్కదారి పట్టించి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపించారు. నియామకాల పేరిట నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆగం చేస్తే.. తాము మరమ్మతులు చేసుకుంటూ వస్తున్నామని వివరించారు. బంగారు తెలంగాణ అంటూ కేసీఆర్ కుటుంబం బంగారుమయంగా మారిందని ధ్వజమెత్తారు. వారి పదేళ్ల పాలన, తమ పదకొండు నెలల పాలనపై హరీశ్‌రావు చర్చకు రావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పాలనలో హంగులు, ఆర్భాటాలు లేవని, అభివృద్ధి, సంక్షేమం మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఈ ఐదేళ్లు కాదు.. వచ్చే ఐదేళ్లూ కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందన్నారు. కేంద్రంలోనూ రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలం..

కార్యకర్తల్లో ఉత్సాహం నింపిన ఘనత టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికే దక్కుతుందని మహేశ్‌గౌడ్ కొనియాడారు. కాంగ్రెస్‌లో కార్యకర్తలకు పూర్తి స్థాయి స్వేచ్ఛ ఉంటుందని, ముఖ్యమంత్రిని సైతం నేరుగా కలిసే అవకాశం ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ తన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలకు కూడా సమయం ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు కార్యకర్తలే ప్రధాన బలం, బలగం అని పునరుద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలను గెలిపించే బాధ్యత పార్టీ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే పలు కార్పొరేషన్ పదవులు భర్తీ చేశామని, జనవరిలోగా మిగతావీ భర్తీ చేస్తామని ప్రకటించారు. సమావేశంలో మంత్రి దామోదర, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సెట్విన్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వేదికపై మంత్రి దామోదర , టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

బీఆర్ఎస్ సోషల్ మీడియా హెడ్..
కొణతం దిలీప్ అరెస్టు

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు
- అనుచిత వ్యాఖ్యల కేసులో అరెస్టు
- రిమాండ్‌ను తిరస్కరించిన మెజిస్ట్రేట్

హైదరాబాద్ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సోషల్ మీడియా హెడ్ కొణతం దిలీప్‌ను హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. హైడ్రా, మూసీ సుందరీకరణ, లగచర్ల ఘటనలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతూ.. సర్కారును అప్రదిష్టపాలు చేస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో దిలీప్‌కు నోటీసులివ్వగా.. ఆయన కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో.. సోమవారం పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. దిలీప్‌ను కొన్ని గంటలపాటు విచారించిన పోలీసులు.. ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. అనంతరం అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించాక.. మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. నాంపల్లి కోర్టు వద్ద పోలీసులు వారిస్తున్నా.. దిలీప్ మీడియాతో మాట్లాడారు. "నేను ఏ తప్పు చేయకున్నా.. పోలీసులు అక్రమ కేసులు పెట్టి, అరెస్టు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తున్నందుకు కేసు పెట్టారు. అరెస్టు నుంచి రక్షణకు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నాను. ఆ ఆదేశాలను పోలీసులు బేఖాతర్ చేశారు. పోలీసులు ఏం కేసు పెట్టారో వారికే అర్థం కావడం లేదు. నేను ఇవ్వని వాంగ్మూలాన్ని నమోదు చేసి, సంతకం పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. ఎవరు ఎన్ని కేసులు పెట్టినా.. నేను ప్రశ్నిస్తూనే ఉంటా" అని స్పష్టం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతున్న క్రమంలో.. పోలీసులు దిలీప్‌ను బలవంతంగా కారులో ఎక్కించి, న్యాయమూర్తి ఇంటికి తీసుకెళ్లారు. పోలీసులు అందజేసిన రిమాండ్ రిపోర్టును పరిశీలించిన మెజిస్ట్రేట్.. రిమాండ్‌ను తిరస్కరించారు. దిలీప్ అరెస్టును మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఎక్స్‌లో తీవ్రంగా ఖండించారు. "కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపినందుకు దిలీప్‌ను అరెస్టు చేశారు" అని కేటీఆర్ ట్వీట్ చేశారు. విచారణకు పిలిచి, అరెస్టు చేశారని మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని ఎన్నాళ్లు ఖూనీ చేస్తారని నిలదీశారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

- అధికారులను ఆక్రమణదారులు అడ్డుకునే యత్నం
- పోలీసుల బందోబస్తు మధ్య కొన్ని నేలమట్టం

మేడ్చల్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లి మునిసిపాలిటీ ఖాజిగూడలోని ప్రభుత్వ స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను భారీ బందోబస్తు మధ్య అధికారులు సోమవారం తొలగించారు. రూ.50 కోట్ల ప్రభుత్వ స్థలానికి ఎసరు అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై స్పందించిన ఉన్నత అధికారులు స్థానిక రెవెన్యూ సిబ్బందిని కట్టడాలు తొలగించటానికి గుండ్లపోచంపల్లి పంపారు. కాగా నిర్మాణాలు తొలగించటానికి వచ్చిన రెవెన్యూ సిబ్బందిని అక్రమ నిర్మాణదారులు అడ్డుకొని గొడవ పెట్టడటంతో స్థానిక తహసీల్దార్ శైలజ పేట్‌బషీరాబాద్ పోలీసలతో ప్రొటక్షన్ తీసుకున్నారు. అయినప్పటికీ అక్రమార్కులు నిర్మాణాలను తొలగించకుండా అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమను నిరాశ్రయులు చేయరాదంటూ అధికారులతో ప్రాధేయ పడ్డారు. చివరికి పోలీసులు అడ్డు వచ్చిన వారిని పక్కన జరిపి నిర్మాణాలను తొలగించారు. కాగా ఎవరు అడ్డువచ్చినా కూల్చివేతలు ఆపే ప్రసక్తి లేదని తహసీల్దార్ శైలజ స్పష్టం చేశారు. సర్వే నంబర్ 30లోని 4 ఎకరాల 23 గుంటల స్థలం పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు.

విద్యార్థికి గుండు గీయించిన ప్రొఫెసర్‌పై వేటు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ మొదటి ఏడాది విద్యార్థికి గుండు గీయించిన ఘటనలో ఖమ్మం వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రెహ్మాన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఆయన్ను సస్పెండ్ చేస్తూ సోమవారం వైద్య విద్య డైరెక్టర్ శ్రీవాణి ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థిపై కోపంతో ఈ నెల 12వ తేదీన రాత్రి వైద్య కళాశాల హాస్టల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ రెహ్మాన్ గుండు గీయించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వైద్య వైద్య ఉన్నతాధికారులు ఈ ఘటనను తీవ్రంగా పరిగణించారు. ఈ నేపథ్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు 13వ తేదీన రెహ్మాన్‌ను ర్యాగింగ్ నిరోధక పర్యవేక్షక వైద్య అధికారి విధుల నుంచి తొలగించారు. శాఖాపరంగా త్రిసభ్య కమిటీతో ఈ ఘటనపై విచారణ నిర్వహించారు. కమిటీ నివేదిక ఆధారంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రెహ్మాన్‌ను సస్పెండ్ చేస్తూ వైద్య విద్య డైరెక్టర్ శ్రీవాణి ఉత్తర్వులు జారీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి

కడ్తాల్, ఆమనగల్లు, వనపర్తి రూరల్, మంచిర్యాల అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేర్వేరు చోట్ల ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు యువకులు మృతిచెందారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలంలోని టోల్‌ప్లాజా సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం జాతీయరహదారిపై ఆగి ఉన్న ట్రక్కును బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ప్రాణస్నేహితులు దుర్మరణం పాలయ్యారు. మండల కేంద్రానికి చెందిన సిద్దిగారి మహేశ్ (24), తుప్పరి రాజు అలియాస్(24)లు బంధువులకు పెళ్లి కార్డు ఇవ్వడానికి వెళ్లి తిరిగి రాత్రి 2 గంటల సమయంలో కడ్తాలకు వస్తుండగా రోడ్డు మధ్యలో నిలిపిన ట్రక్కును ఢీ కొట్టారు. వేగంగా వచ్చి ట్రక్కు వెనుక భాగంలో ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. వనపర్తి జిల్లా చిమనగుంటపల్లి గ్రామంలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన శివకుమార్ (20), బాలకృష్ణ (22) అనే ఇద్దరు యువకులు మరణించారు. వారు ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి వద్ద లారీ కిందకు దూసుకుపోవడంతో టైర్ల కిందపడి మృతి చెందారు. లారీ డ్రైవర్ అజాగ్రత్తగా సిగ్నల్ వేయకుండా రోడ్డుపైకి రావడంతో ఈ ప్రమాదం జరిగిందని మృతుడు శివకుమార్ తండ్రి చిన్నయ్య ఫిర్యాదు చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని దొరగారి పల్లె సమీపంలో జాతీయ రహదారిపై ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ముల్క ఉదయ్ (31), పత్తి నర్సింహ (35) అనే ఇద్దరు యువకులు చనిపోయారు. సోమవారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండటం చింతపల్లిలో గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీ కొట్టడంతో వరికుప్పల యాదగిరి(57), మార్ల యాదయ్య(42) అనే ఇద్దరు వ్యక్తులు మరణించారు.

పెరుగుతున్న చలి తీవ్రత

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 18: రాష్ట్రంలో చలి తీవ్రత క్రమేపీ పెరుగుతోంది. కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలి ప్రభావం ఎక్కువవుతోంది. సోమవారం సైతం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం గిన్నెధరిలో 12.0డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. అదే జిల్లాకు చెందిన సిర్పూర్(యు)లో 12.3, వాంకిడిలో 12.9డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డ్ అయ్యాయి. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో చలి ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 12- 13డిగ్రీల లోపే నమోదు కావడం గమనార్హం. రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల జిల్లాలో సైతం ఉష్ణోగ్రతలు 13-15డిగ్రీల స్థాయికి పడిపోయాయి. అదేవిధంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనూ ఈ సీజన్‌లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వికారాబాద్ జిల్లాలోని మర్పల్లి, రంగారెడ్డి జిల్లా చందన్వెల్లిల్లో వరుసగా రెండోరోజు 12.2డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డ్ అయ్యాయి. హైదరాబాద్ శివారులోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ప్రాంతాల్లో 12.6డిగ్రీలు నమోదు కావడం విశేషం.

ఒక్క రోజే 131 ఈవీల కొనుగోలు!

- ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరుగుతున్న అమ్మకాలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రోత్సాహం నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. సోమవారం ఒక్క రోజే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ క్యాటగిరీలకు చెందిన 131 వాహనాలను కొనుగోలు చేశారని రవాణా శాఖ పేర్కొంది. ఇందులో ఆటో రిక్షాలు-3, గూడ్స్ క్యారేజ్-1, కార్లు-6, ద్విచక్ర వాహనాలు 121 ఉన్నాయి. ప్రోత్సాహం నేపథ్యంలో ఈ వాహనాలకు రిజిస్ట్రేషన్, రోడ్ ట్యాక్స్ నుంచి మినహాయింపు లభించింది. ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు సంబంధించి రిజిస్ట్రేషన్, రోడ్ ట్యాక్స్ మినహాయింపును 2026 డిసెంబరు 31 వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అలాగే వాహనాల కొనుగోలు పరిమితినీ ఎత్తి వేయడంతో అమ్మకాలు మరింత పెరుగుతాయని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏఐ సహకారంతో 2-3 గంటల్లోనే శ్రీవారి దర్శనం!

శ్రీవాణి ట్రస్టు పేరు మార్పు

- టూరిజం కోటా టికెట్లు కూడా రద్దు
- నెయ్యి నాణ్యత పరీక్షకు 90 లక్షలతో కొత్త ల్యాబ్
- దేవస్థానంలో అన్యమతస్థులకు వీఆర్ఎస్
- లేదంటే ఇతర శాఖలకు బదిలీ
- కొత్త పాలకమండలి కీలక నిర్ణయాలు



తిరుమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరుడిని 2-3 గంటల్లోనే దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) నూతన ధర్మకర్తల మండలి నిర్ణయించింది. కొండపై విశాఖ శారదా పీఠం లీజును రద్దు చేసి భవనాన్ని స్వాధీనం చేసుకుని కూల్చివేయాలని నిశ్చయించినట్లు మండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. కొత్త మండలి తొలి సమావేశం సోమవారం కొండపై ఉన్న అన్నమయ్య భవనంలో జరిగింది. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. వాటిని ఈవో శ్యామలరావుతో కలిసి నాయుడు ఆ తర్వాత విలేకరులకు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు నిధులపై అపోహలు, అనుమానాలు ఉన్న క్రమంలో దాని పేరు మారుస్తామన్నారు. ట్రస్టుకు వచ్చే సొమ్ము టీటీడీ ప్రధాన ఖాతాలోనే జమయ్యేలా సాధ్యాసాధ్యాలను పరిశీలించి తదుపరి జరిగే బోర్డు సమావేశంలో రిపోర్టు ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. 'ప్రస్తుతం శ్రీవారి దర్శనానికి 20 నుంచి 30 గంటల సమయం పడుతోంది. కృత్రిమ మేధ (ఏఐ) సహకారంతో 2-3 గంటల్లోనే దర్శనం పూర్తయ్యేలా చూడాలి. ఇందుకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఆ కమిటీ ఇచ్చే రిపోర్టు ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటాం. అలాగే టీటీడీలో పనిచేస్తున్న అన్యమతస్థులతో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం. వారికి వీఆర్ఎస్ ఇవ్వాలని.. లేదా ప్రభుత్వంతో మాట్లాడి మున్సిపాలిటీలో గానీ, రెవెన్యూ విభాగాలకు గానీ బదిలీ చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఇకమీదట కొండపై రాజకీయాలు మాట్లాడడం నిషేధం. ఉల్లంఘించిన వారిపై కేసులు పెడతాం. కొండపై భవన నిర్మాణంలో శారదాపీఠం నూటికి నూరుపాళ్ల నిబంధనలు అతిక్రమించింది. నిపుణుల కమిటీ కూడా నిర్ధారించింది. ఈ క్రమంలో లీజును పూర్తిగా రద్దు చేసి స్థలాన్ని స్వాధీనపరచుకోవాలని బోర్డు తీర్మానించింది. ప్రతిరోజు టూరిజం కోటా కింద కేటాయిస్తున్న 4 వేల టికెట్ల కోటాను రద్దు చేయాలని నిర్ణయించాం' అని వెల్లడించారు. రేణిగుంట విమానాశ్రయంలో జారీ చేసే శ్రీవాణి టికెట్ల కోటాను వంద నుంచి 200కు పెంచుతూ తీర్మానించామన్నారు.

మరికొన్ని నిర్ణయాలు..

- ప్రైవేటు బ్యాంకుల్లో ఉన్న టీటీడీ డిపాజిట్లను వెనక్కి తీసుకుని ప్రభుత్వ బ్యాంకుల్లోనే జమచేయాలి.
- అన్నప్రసాదం మెనూలో ఇంకో పదార్థం.
- శ్రీవారి లడ్డూలో వాడే నెయ్యి నాణ్యత ఇంకా పెంచాలి. దీనికోసం నిపుణుల కమిటీ. నెయ్యి నాణ్యతను పూర్తిస్థాయిలో పరీక్షించేందుకు తిరుమలలో రూ.90 లక్షలతో నూతన ల్యాబ్ ఏర్పాటు.

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి
టెండర్లు జనవరిలో..

(మొదటి పేజీ తరువాయి)



అవసరమవుతోందని, 1,862 హెక్టార్లకు సంబంధించి ఇప్పటికే 3డీ నోటిఫికేషన్(భూమిని సేకరించే ఉద్దేశ ప్రకటన) జారీ చేశామన్నారు. ఇందులో 1320 హెక్టార్ల భూమికి సంబంధించి ముసాయిదా అవార్డుల ప్రకటన, 427 హెక్టార్లకు సంబంధించి అవార్డు విచారణ జరుగుతోందని, మిగతాది వివిధ దశల్లో హైకోర్టులో విచారణలో ఉందని వివరించారు. రీజినల్ రింగు రోడ్డులోని దక్షిణ భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించనుందని మంత్రి ప్రకటించారు. 2017లో ఆర్ఆర్ఆర్‌ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం నిర్మాణ పనులను ఆశించినంత వేగంగా చేపట్టలేక పోయినందున దక్షిణ భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టనుందని చెప్పారు. మొదట ఆరు లేన్లతో చేపడతామని, తర్వాత రద్దీ పెరిగాక ఎనిమిది లేన్లుగా విస్తరిస్తామని వెల్లడించారు. ఈ మార్గాన్ని ఫోర్త్ సిటీ మీదుగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానిస్తామని చెప్పారు. ఆర్ఆర్ఆర్ డీపీఆర్ తయారీకి సలహా సంస్థ ఎంపికకు టెండర్లను ఆహ్వానిస్తున్నామని, ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు కూడా జారీ చేశామని వెల్లడించారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ప్రపంచ బ్యాంకు, జైకా, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఏడీబీ) సహా వివిధ ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు చెప్పారు. అలైన్‌మెంట్ అధ్యయనం కోసం ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఇప్పటికే కమిటీని నియమించామన్నారు. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందనను నియమించామని చెప్పారు. దక్షిణ భాగం నోటిఫికేషన్ ఇవ్వడానికి ముందే మార్కెట్ ధరలను, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం లభించే ధరలను పరిశీలించాలని ఆదేశించామన్నారు.

8 నెలల్లో మామునూరు ఎయిర్‌పోర్టు

వరంగల్ జిల్లాలోని మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయని వెంకటరెడ్డి తెలిపారు. డిసెంబర్‌లో తాను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలిసి కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడును కలుస్తామన్నారు. 8 నెలల్లో మామునూరు విమానాశ్రయాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించారు. వరంగల్ నుంచి తిరుపతి, విజయవాడ, ఢిల్లీ, ముంబై, బెంగళూరులకు విమానయాన సౌకర్యం కలిస్తామన్నారు. కొత్తగూడెం, రామగుండాలలో కొత్త విమానాశ్రయాలను నిర్మిస్తామని, ఇవి రెండూ పారిశ్రామిక, ఆధ్యాత్మిక కేంద్రాలు కావడంతో విమానాశ్రయాల ఏర్పాటుకు అనుకూలమని చెప్పారు. నాలుగేళ్లలో రాష్ట్రంలో మూడు విమానాశ్రయాలు అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. శంషాబాద్‌కు 150 కిలోమీటర్ల లోపు దూరంలోనే ఉన్న మామునూరులో విమానాశ్రయ ఏర్పాటుకు అభ్యంతరం లేదని పత్రం అందించిన జీఎంఆర్ సంస్థకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65)ని ఆరు లేన్లుగా విస్తరించడానికి డీపీఆర్ సిద్ధమవుతోందని వెంకటరెడ్డి ప్రకటించారు. ఫిబ్రవరిలో పనులు మొదలవుతాయని చెప్పారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌ను ఏడాదిన్నరలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రూ.7 వేల కోట్ల వరకు ఖర్చవుతుందని మంత్రి చెప్పారు. ఏడాదిలోపు డీపీఆర్ పూర్తి చేసి, నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు.

దక్షిణ భాగానికి.. ప్రాజెక్టు అమలు విభాగం

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి ప్రభుత్వం 'ప్రాజెక్టు అమలు విభాగాన్ని' ఏర్పాటు చేసింది. పర్యావరణ అంశాలను పరిశీలించేందుకు అటవీ శాఖలో జిల్లా స్థాయి అటవీ అధికారి ఒకరితో పాటు, ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్(సీఈ)గా ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజినీరును, ఇద్దరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను, ఒక అకౌంటెంట్‌ను కలిపి మొత్తం ఐదుగురితో విభాగాన్ని ఏర్పాటు చేస్తూ జీవో ఇచ్చింది.

కేసీఆర్ ఆపమంటే ఆపుతాం

కేటీఆర్, హరీష్‌కు అరెస్టుల భయం పట్టుకుందని మంత్రి వెంకటరెడ్డి అన్నారు. అందుకే, అభివృద్ధి పనులను అడ్డుకొనేందుకు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. 80 వేల పుస్తకాలు చదివిన కేసీఆర్ వచ్చి మూసీని శుద్ధి చేయొద్దని అంటే వెంటనే ప్రాజెక్టును నిలిపేస్తామని మంత్రి సవాల్ విసిరారు. బీజేపీ నేతలు నగరంలో ఒకరోజు మూసీ పక్కన నిద్ర చేయడం కాదని, దమ్ముంటే మూడు నెలలు నల్గొండలో నిద్ర చేయాలని అన్నారు. అప్పటికీ కాళ్లు, చేతులు వంకరలు తిరగకుండా హైదరాబాద్ వస్తారేమో చూద్దామని వ్యాఖ్యానించారు. కిషన్‌రెడ్డి ఢిల్లీలో దోమల బాధ తట్టుకోలేక అచ్చం హైదరాబాద్‌లో ఉంటున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. బషీర్‌బాగ్‌లో అప్పటి సీఎంతో కలిసి రైతులపై కాల్పులు జరిపించిన కేసీఆర్ ఇప్పుడు రైతులపై దొంగ ప్రేమను ఒలక బోస్తున్నారని కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

నెలాఖరులో కేసీఆర్, హరీశ్‌కు పిలుపు!

- 21న రాష్ట్రానికి జస్టిస్ పినాకి చంద్రఘోష్
- తొలుత ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌ల విచారణ
- కాళేశ్వరం నిర్మాణంపై ఆరా తీయనున్న కమిషన్

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణానికి సంబంధించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావును జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణకు పిలవనుంది. వీరిద్దరినీ ఈ నెలాఖరున లేదా డిసెంబరు తొలివారం లో విచారించే అవకాశాలున్నాయి. 21న హైదరాబాద్ రానున్న జస్టిస్ ఘోష్.. వచ్చే నెల 5 దాకా ఇక్కడే ఉండనున్నారు. మాజీ సీఎస్‌లు ఎస్‌కే జోషి, సోమేష్‌కుమార్, మాజీ ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, సీఎంవో మాజీ ఓఎస్డీ, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పరిశీలించిన స్మితా సభర్వాల్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును తొలుత కమిషన్ క్రాస్ ఎగ్జామిన్ చేయనుంది. ప్రాజెక్టు నిర్మాణంలో కీలక నిర్ణయాలు తీసుకున్నది ఎవరు? మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో బ్యారేజీలు కట్టాలని నిర్ణయించిందెవరు?బ్యారేజీల వైఫల్యానికి కారణాలు ఏంటి? రీ ఇంజనీరింగ్‌తో కాళేశ్వరం ప్రాజెక్టును తెరమీదికి తేవడానికి కారణమేంటి? వంటి వివరాలను కమిషన్ సేకరించే అవకాశాలున్నాయి. అనంతరం కేసీఆర్, హరీశ్‌రావుకు కమిషన్ సమన్లు పంపే అవకాశం ఉంది. అయితే, విచారణకు కేసీఆర్ హాజవు అవుతారా? లేక జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్‌కు లేఖ రాసినట్లుగా.. జస్టిస్ పీసీ ఘోష్‌కు లేఖ రాసి దూరంగా ఉంటారా? అన్న చర్చ సాగుతోంది. జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి స్థానంలో నియమితులైన జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ కమిషన్ మాత్రం కేసీఆర్‌ను విచారణకు పిలవకుండానే నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఇప్పుడు కూడా కేసీఆర్ విచారణకు రాకపోతే.. ఆయన ఇచ్చే లేఖనే అభిప్రాయంగా పరిగణనలోకి తీసుకొని కాళేశ్వరం విచారణ నివేదిక ఇచ్చే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. డిసెంబరు నెలాఖరు లేదా వచ్చే జనవరి ఆఖరుకల్లా ప్రభుత్వానికి నివేదిక అందించడానికి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. డిసెంబరు 5 కల్లా విచారణ పూర్తయితే... నివేదికను తయారు చేసే ప్రక్రియను కమిషన్ ప్రారంభించనుంది.



ఖమ్మంలో 960 కిలోల కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్టును స్వాధీనం చేసుకున్న ఆహార తనిఖీ అధికారులు

ఖమ్మంలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ అధికారుల స్టింగ్ ఆపరేషన్

960 కిలోల కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ పట్టివేత

- పలు స్వీట్స్ దుకాణాలు, పిండి వంటల కేంద్రాల్లో తనిఖీలు
- నాణ్యతలేని ఆహార పదార్థాలు అమ్ముతున్నట్లు గుర్తించి కేసులు

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆహార తనిఖీ విభాగం రాష్ట్ర అధికారులు సోమవారం ఖమ్మంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఖమ్మం జిల్లా అధికారులకు కూడా సమాచారం ఇవ్వకుండా పలు ఆహార తయారీ కేంద్రాలు, స్వీట్స్ దుకాణాలు, పిండి వంటల కేంద్రాల్లో తనిఖీలు చేసి కేసులు నమోదు చేశారు. కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ అమ్ముతున్న ఓ వ్యాపార కేంద్రంపై స్టింగ్ ఆపరేషన్ చేసి 960 కిలోల కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.250 ఉండే అల్లం, వెల్లులి పేస్ట్‌ను ఖమ్మంలో కొందరు వ్యాపారులు కేజీ రూ.60కే విక్రయిస్తున్నారు. ఈ రకమైన కల్తీ దందా ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది. దీనిపై ఫిర్యాదులు అందుకున్న రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ అధికారులు వ్యూహాత్మకంగా దాడులు నిర్వహించారు. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఖమ్మం చేరుకున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు.. ఓ చిరు వ్యాపారి నుంచి కల్తీ అల్లం, వెల్లుల్లి వ్యాపారి ఫోన్ నెంబర్‌ను సేకరించారు. తమ కుటుంబంలో ఒక పెద్ద ఫంక్షన్ ఉందని, తమకు క్వింటా అల్లం, వెల్లుల్లి పేస్ట్ కావాలని అడిగారు. కొన్ని గంటల తర్వాత లైన్‌లోకి వచ్చిన కల్తీ వ్యాపారి వీరి ప్రతిపాదనకు ఒప్పుకోవడంతో మూడు గంటల పాటు స్టింగ్ ఆపరేషన్ నిర్వహించి రూ. 1లక్ష 35వేల విలువైన 960 కిలోల కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. కనీస నిబంధనలు పాటించకుండా హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ వ్యాపార సంస్థకు చెందిన స్టిక్కర్‌ను వినియోగించడాన్ని గుర్తించి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ దాడి తరువాత ఓ ప్రముఖ స్వీట్స్ దుకాణంలో తనిఖీలు నిర్వహించి కేక్‌ల తయారీలో దుస్తులకు వినియోగించే రంగులు, గడువు దాటిన పదార్థాలతో స్వీట్లు తయారీ చేస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. అనంతరం పిండి వంటల దుకాణంలో అధికారులు తనిఖీలు నిర్వహించగా పురుగులు పట్టిన పిండి, బూజు పట్టిన స్వీట్లు కనిపించాయి. దీంతో ఆ దుకాణంపై కూడా కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆహార తనిఖీ టాస్క్‌ఫోర్స్ అధికారి జ్యోతిర్మయి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కల్తీ ఆహారంపై ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఫిర్యాదులు రావటంతో ఆకస్మికంగా తనిఖీలు చేశామని తెలిపారు. ఆహార నాణ్యతపై ఎటువంటి అనుమానాలు ఉన్నా రాష్ట్రస్థాయి ఫిర్యాదుల నెంబర్ 9100105795కు ఫోన్ చేయాలని సూచించారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌లో..
సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా తెలంగాణ

బీకాం, బీబీఎం విద్యార్థులకు సెకండియర్ నుంచే ఉపాధి శిక్షణ: మంత్రి శ్రీధర్ బాబు



ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై పుస్తకం విడుదల చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను త్వరలో క్వాంటమ్ కంప్యూటింగ్‌కు 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'గా మారుస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఇప్పటికే సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ పరిశోధన, అభివృద్ధిలో దేశం దృష్టిని ఆకర్షిస్తున్న రాష్ట్రానికి.. సిలికాన్ వ్యాలీ సంస్థలను తీసుకొస్తామన్నారు. 'ఆరోగ్య సంరక్షణ రంగంలో కృత్రిమ మేధ' అనే అంశంపై సోమవారం హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఏఐజీ ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి, సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ డియన్ హో, నారాయణ వైద్యాలయ వైస్ ఛైర్మన్ వీరేన్ శెట్టి, ప్రపంచ ఆరోగ్యసంస్థ డిజిటల్ హెల్త్ విభాగం సభ్యుడు డాక్టర్ రాజేంద్ర గుప్తా, తదితరులు పాల్గొన్న ఈ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు కీలకోపన్యాసం చేశారు. ప్రపంచ వ్యాక్సిన్ కేంద్రంగా ఘనత సాధించడంలో, హెల్త్ సైన్సెస్‌లో నగరాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లిన పారిశ్రామికవేత్తలు, సంస్థలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాలుగో పారిశ్రామిక విప్లవానికి కేంద్రంగా ఉన్న హైదరాబాద్.. ఆరోగ్య సంరక్షణలో కృత్రిమ మేధను విస్తృతంగా వినియోగించే దిశగా ముందుకు నడుస్తోందని గుర్తుచేశారు. రేడియాలజీ రోగనిర్ధారణ పరీక్షల్లో స్పెషలిస్టు వైద్యులకు ఇప్పటికే ఏఐ తోడ్పడుతోందని.. దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా పరిశోధనలు జరగాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐజీలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఏర్పాటుచేసి.. డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ప్రపంచ ఆరోగ్యరంగానికి దిక్సూచిగా మారారని ప్రశంసించారు. కృత్రిమ మేధతో పనిచేసే 'మిరా' అనే వర్చువల్ వైద్య సహాయకురాలిని ప్రవేశ పెట్టి ఈ రంగంలో ఆయన ఆదర్శప్రాయులుగా నిలిచారని మంత్రి కొనియాడారు. వైద్య సంస్థలు, పరిశ్రమల్లో కృత్రిమ మేధను వినియోగించే సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందని వెల్లడించారు. వైద్య సంరక్షణలో కృత్రిమ మేధ వినియోగంపై ఒక రోడ్ మ్యాప్‌ను రూపొందించాలని సీఎం రేవంత్ సూచించిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. రాష్ట్రంలో తాము యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి పరిశ్రమలకు అవసరమైన నిపుణులను తయారు చేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తుచేశారు. జీసీసీ కన్సార్షియం, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాలకు మరో కన్సార్షియం ఏర్పాటు చేశామని.. బీకాం, బీబీఎం విద్యార్థులకు కోర్సు రెండో సంవత్సరం నుంచే బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ ఉద్యోగాలకు సంబంధించిన శిక్షణనిస్తామని తెలిపారు. దేశంలో ఏటా ఈ రంగంలో 20 వేల ఉద్యోగ ఖాళీలు ఏర్పడుతున్నా నిపుణుల కొరత వల్ల అభ్యర్థులు దొరకట్లేదని పేర్కొన్నారు. అలాగే.. సైన్స్, ఫార్మా డిగ్రీ విద్యార్థులకూ కోర్సు పూర్తయ్యేలోగా నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగానికి సంసిద్ధులుగా తీర్చిదిద్దుతామన్నారు.

ఉగాది తర్వాతే సన్న బియ్యం!

3 నెలల తర్వాత ప్రారంభం కానున్న పథకం

- కొత్త ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే నూక శాతం పెరిగినాణ్యత తగ్గే చాన్స్
- నిపుణుల సూచనతో సర్కారు పునరాలోచన

హైదరాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ముందుగా ప్రకటించినట్లు సంక్రాంతికి కాకుండా ఉగాది పండుగ తర్వాతే సన్న బియ్యం పంపిణీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. జనవరి నుంచి ఈ పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం తొలుత భావించినప్పటికీ.. తాజాగా మూడు నెలల పాటు ఆగాలని భావిస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. ఖరీఫ్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన కొత్త ధాన్యాన్ని వెంటనే మిల్లింగ్ చేస్తే... బియ్యంలో నూక శాతం పెరుగుతుందని, అన్నం ముద్దగా మారుతుందని, నాణ్యత లోపిస్తుందని నిపుణులు సూచించినట్లు ఆయన తెలిపారు. కనీసం మూడు నెలలపాటు ధాన్యాన్ని తప్పకుండా నిల్వ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సన్న బియ్యాన్ని ఎస్‌పీఆర్‌జీల్లో (స్టేట్ పూల్ రిజర్వు గోడౌన్లలో)నిల్వ చేసి, మూడు నెలల తర్వాత ఉగాది నుంచి రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు స్పష్టం చేశారు. మరోవైపు.. సన్న బియ్యం పంపిణీ పథకానికి నెలకు 2లక్షల టన్నుల చొప్పున ఏడాదికి 24 లక్షల టన్నుల బియ్యం అవసరం. అంటే.. 36 లక్షల టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేయాలి. కానీ, ప్రస్తుతం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్న ధాన్యం పెద్దగా రావడం లేదు. ఇప్పటి వరకు కేవలం 3 లక్షల టన్నులే వచ్చాయి. రైతులు బహిరంగ మార్కెట్లోనే సన్నాలను అమ్ముకుంటున్నారు. సీజన్ ప్రారంభంలో కొనుగోలు కేంద్రాలకు 50 లక్షల టన్నుల సన్న ధాన్యం వస్తుందని అంచనా వేసిన ప్రభుత్వం.. ఆ తర్వాత 40 లక్షల టన్నులే వస్తుందని అంచనా వేసింది. తాజాగా 35లక్షల టన్నులు వస్తుందనే అంచనాతో ఉన్నట్లు పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో సన్న బియ్యం పంపిణీకి సరిపోయేలా ధాన్యం వస్తుందా? లేదా? అనే సందేహాలున్నాయి. ఒక వేళ లక్ష్యానికి అనుగుణంగా సన్న ధాన్యం రాకపోతే సన్న బియ్యాన్ని మళ్లీ బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వస్తుంది. అదే జరిగితే... మళ్లీ టెండర్లు పిలవడం, రైస్‌మిల్లర్ల నుంచి ప్రొక్యూర్మెంట్ చేయటం వంటి పనులుంటాయి. ఈ కారణాల రీత్యానే సన్న బియ్యం పంపిణీని ప్రభుత్వం మూడు నెలల పాటు వాయిదా వేసిందనే చర్చ జరుగుతోంది. ఈ మేరకు ఉగాది పండుగ రోజు (వచ్చే ఏడాది మార్చి 30)న పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి, ఏప్రిల్ నెల కోటాలో సన్న బియ్యం పంపిణీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

హైదరాబాద్, షాద్‌నగర్‌లో
ఐటీ దాడులు

- స్వస్తిక్ రియల్ ఎస్టేట్ సంస్థ, ఆగ్రో కంపెనీలో తనిఖీలు
- రియల్టర్ ఆకుల రవి ఇంటితో పాటు మరో చిట్‌ఫండ్ కంపెనీలో సోదాలు

హైదరాబాద్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ రియల్ ఎస్టేట్ సంస్థ కార్యాలయాల్లో ఆదాయ పన్ను(ఐటీ) అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. పన్ను ఎగవేత ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు సాగాయి. నగరంలోని బంజారాహిల్స్, బేగం బజార్, గచ్చిబౌలితో పాటు షాద్‌నగర్‌లోని స్వస్తిక్ రియల్ ఎస్టేట్ సంస్థ కార్యాలయాల్లో ఈ సోదాలు నిర్వహించారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్టలోని ఇండస్ట్రీయల్ ఏరియాలో ఉన్న స్వస్తిక్ గ్రూప్ అనుబంధ పరిశ్రమ ఫోర్ ఆగ్రో ఎల్‌ఎల్‌పీ పరిశ్రమలో సోదాలు జరిగాయి. షాద్‌నగర్ పట్టణం పద్మావతి కాలనీలోని రియల్టర్ ఆకుల రవి నివాసంతో పాటు సమీపంలో ఉన్న చిట్‌ఫండ్ యజమాని బండారి రమేష్ నివాసంలో కూడా సోదాలు నిర్వహించారు. షాద్‌నగర్ సమీపంలో రూ. 300 కోట్ల విలువ చేసే భూమి అమ్మకానికి సంబంధించి లెక్కలు సరిగా చూపకపోవడంతో ఈ మూకుమ్మడి దాడులు నిర్వహించినట్లు తెలిసింది. మరోవైపు కొత్తూరు మండలానికి చెందిన రియల్టర్ జార్జిరెడ్డి నివాసం, కార్యాలయాల్లోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.